హైదరాబాద్
శనివారం
17-3-2018
సంపుటి: 2, సంచిక: 107
పేజీలు: 12+16, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



‘తీరుబాటు’ ఒక జీవలక్షణం

..మైత్రిలో

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

2025 నాటికి క్షయ నిర్మూలన

- వ్యాధుల నివారణకు శాస్త్రవేత్తలు కృషి చేయాలి
- విద్యార్థులతో విజ్ఞాన విశేషాలు పంచుకోవాలి
- అంతరిక్ష శాస్త్ర పరిశోధనల్లో మనోళ్లు భేష్
- సాంకేతిక వినియోగం ఎంతో కీలకం
- ఇంఫాల్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ

7 లో..

హీటెక్కిన హస్తిన

ఎక్కడ చూసినా అవిశ్వాసం మాటే

- తీర్మానం పెట్టి చక్రం తిప్పిన చంద్రబాబు
- వైఎస్ఆర్‌సీపీకి మద్దతిస్తామని తొలి మాట
- మళ్లీ తామే ప్రవేశపెడతామంటూ నోటీసు
- దానికి మద్దతిస్తామన్న వైఎస్ఆర్‌సీపీ
- అవిశ్వాసానికి మద్దతుగా ఓటేస్తాం: టీఆర్ఎస్
- మా బాటలోనే ఇపుడు తెలుగుదేశం పార్టీ
- చంద్రబాబుది సరికొత్త నాటకం: జగన్ ఫైర్
- వెల్‌లోకి ఎంపీలు.. లోక్‌సభలో గందరగోళం
- సభను సోమవారానికి వాయిదా వేసిన స్పీకర్



(మనం - అమరావతి)

హస్తిన రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కిపోయాయి. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు వైఎస్ఆర్‌సీపీ చెప్పడం, దానికి మద్దతిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు మిగతా 6లో..



సాగును ఉపాధితో అనుసంధానించండి

రిజర్వేషన్ల హక్కు రాష్ట్రాలకే ఇవ్వండి

- ‘ఒకే దేశం.. ఒకే చట్టం’ అమలు చేయండి
- పార్లమెంట్‌లో టీఆర్ఎస్‌లో ఎంపీల ఆందోళన
- వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోరా?
- కేంద్రం తీరుపై ఆగ్రహం.. పార్లమెంట్ ఆవల నిరసన

హైదరాబాద్, మార్చి 16:

రిజర్వేషన్లను పెంచుకునే అధికారాన్ని రాష్ట్రాలకు కల్పించాలని కోరుతూ పార్లమెంట్‌లో నినదిస్తున్న టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన శుక్రవారం కూడా కొనసాగింది. గురువాం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిరసన వ్యక్త చేసిన ఎంపీలు.. అదే ఒరవడిని మిగతా 6లో..

ఇదీ లోకం!



ఎవరేం అవిశ్వాసం పెట్టినా సభ జరగనిస్తేగా.. అయినా మనకొచ్చే నష్టం కూడా లేదు డోంట్ వర్రీ సార్..!



బ్లూవేల్ ఉనికి నిజమే!

- బాధితుడికి చికిత్స చేశాం
- డిప్రెషన్ లక్షణాలతో ఆస్పత్రికి
- ఐదు టాస్కులు పూర్తిచేశాక గుర్తించాం
- చికిత్స తర్వాత తేరుకున్న బాలుడు
- మెడికల్ జర్నల్‌కు పరిశోధనా పత్రం
- ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల వెల్లడి

6 లో..

మద్దతు.. ప్లీజ్!

కందికి మద్దతు ధర కల్పించండి.. బకాయిలు వెంటనే విడుదల చేయండి



- రాధామోహన్‌సింగ్, గడ్కరీలకు హరీశ్ విజ్ఞప్తి
- సానుకూలంగా కేంద్ర మంత్రుల స్పందన

హైదరాబాద్, మార్చి 16:

తెలంగాణలో కంది రైతును ఆదుకోవాలని మంత్రి హరీశ్ రావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంది కొనుగోళ్లకు సంబంధించిన మిగతా 6లో..



ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య సా.6.42 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పూర్వాభాద్ర సా.7.41 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా.1.22-3.02; దుర్ముహూర్తం: ఉ.6.26-8.02; రాహుకాలం: ఉ.9.26-10.55; అమృతఘడియలు: ఉ.11.24-1.04; శుభసమయం: లేదు.

సూర్యోదయం: 6.26, సూర్యాస్తమయం: 6.23

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శనివారం అక్కడక్కడా చిరుజల్లులు పడే అవకాశం ఉంది. దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన యాంటీ సైక్లోనిక్ సర్కులేషన్.. లక్షద్వీప్ వద్ద అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడ్డాయి. దీంతో ఇరు రాష్ట్రాల్లో ఉరుములుతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇక పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి వేళ చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 19 డిగ్రీలు

గాలిలో తేమ: 79 శాతం

గవర్నర్ ప్రసంగం ఫుటేజి ఇవ్వండి

స్పీకర్ కార్యాలయానికి కోమటిరెడ్డి ‘ఆర్టీఐ’ దరఖాస్తు

- హైకోర్టులో కోమటిరెడ్డి, సంపత్ పిటిషన్లు
- గవర్నర్ ప్రసంగం ప్రొసీడింగ్స్ కిందకు రాదు
- గతంలో ఓ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది
- సభ నడిచినప్పడే బిజినెస్ రూల్స్ వర్తిస్తాయి
- ఆ నిబంధనల కింద సభ్యత్వం రద్దు ఎలా
- కోమటిరెడ్డి, సంపత్‌ల న్యాయవాది వాదన
- సమయం కోరిన ఏజీ.. విచారణ వాయిదా

హైదరాబాద్, మార్చి 16 (మనం ప్రతినిధి):

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం సమయంలో శాసనసభలోని మొత్తం ఆరు కెమెరాల సీసీ ఫుటేజీని ఇవ్వాలని కోరుతూ బహిష్కరణకు గురైన కాంగ్రెస్ శాసన సభ్యుడు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి సమాచార హక్కు చట్టం కింద స్పీకర్ కార్యాయానికి ధరఖాస్తు చేసుకున్నారు. గవర్నర్ ప్రసంగం మిగతా 6లో..



మిషన్ భగీరథ పనుల సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తదితరులు

ఇంత ఆలస్యమా.. ఇలాగైతే నీళ్లిచ్చేదెలా?

మిషన్ భగీరథ పనులపై కడియం తీవ్ర ఆగ్రహం

- పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశం
- వచ్చే ఏడాదిలో అన్ని గ్రామాలకూ నీళ్లివ్వాలి
- లేదంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరిక

వరంగల్, మార్చి 16 (మనం బ్యూరో):

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిషన్ భగీరథ పనులు ఆలస్యంగా జరగడంపై మంత్రి కడియం శ్రీహరి మిగతా 6లో..



హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్ సామల వేణుమాధవ్‌ను విశిష్ట కళారత్న అవార్డుతో సన్మానిస్తున్న దృశ్యం

తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

- ఆయిల్ లీకేజ్‌తో స్కిడ్ అయిన వాహనాలు
- ప్రాబ్లం సాల్వ్‌డ్.. హైదరాబాద్ పోలీస్ ట్వీట్



హైదరాబాద్, మార్చి 16: నగరంలోని తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌పై పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. దాదాపు 20 నుంచి 25 మంది వాహనదారులు కిందపడ్డారు. ఇందులో పలువురు గాయపడ్డారు. రోడ్డుపై చిందిన ఆయిల్(ఆయిల్ లీకేజ్)కు తోడు చిరుజల్లుల కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. ట్విట్టర్ ద్వారా ఈ ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. ఆయిల్ చిందిన చోట ఇసుక జల్లి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గల తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై ఆయిల్ రోడ్డుపై లీక్ అయిందని... దీనికి తోడు హైదరాబాద్ నగరంలో చిరుజల్లులు కూడా పడటంతో ఆ హైవేపై వెహికిల్స్ స్కిడ్ అవుతున్నాయని ఓ నెటిజన్ ట్విట్టర్ ద్వారా తెలిపాడు. అటుగా వెళ్లొద్దని వాహనదారులకు సూచించాడు. తర్వాత కాసేపటికి హైదరాబాద్ పోలీస్ ప్రాబ్లమ్ సాల్వ్ అయినట్టు ట్విట్టర్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. 'లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గల ఫ్లై ఓవర్‌పై ఆయిల్ లీక్ కారణంగా తలెత్తిన ఇబ్బందిని పరిష్కరించాం' అంటూ హైదరాబాద్ పోలీసులు ట్వీట్‌లో పేర్కొన్నారు.




హైదరాబాద్ మక్కా మసీదు ప్రాంతంలో శుక్రవారం పర్యటిస్తున్న హైదరాబాద్ నగర కొత్త పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్

బడ్జెట్‌లో ఆర్టీసీకి మొండిచేయి

వేల కోట్ల నష్టాల్లో టీఎస్ఆర్టీసీ.. ప్రత్యేక గ్రాంటు ప్రకటన లేదు

- రూ.975 కోట్ల కేటాయింపులే
- అదంతా ప్రభుత్వం బాకీపడ్డ సొమ్మే
- అందులోనూ అరకొరగా విడుదల
- ప్రైవేటీకరణ దిశగా అడుగులు?
- పదవీ విరమణలే తప్ప నియామకాలేవీ
- ఫిట్‌మెంట్‌పై సీఎం హామీ అమలేదీ?
- ఆర్టీసీ కార్మిక సంఘాల ఆందోళన





హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): లక్షల మందిని నిత్యం గమ్యస్థానాలకు చేరవేస్తున్న టీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం ఈ ఏడాది కూడా మొండి చేయి చూపింది. వందల కోట్ల అప్పులతో నష్టాలతో నడుస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)ను ఆదుకుంటామని సీఎం కేసీఆర్, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలులోకొచ్చే సంకేతాలేవీ ఈ బడ్జెట్‌లో కనిపించలేదు. ఆర్టీసీకి బాకి పడ్డ సొమ్మునే కేటాయింపుల్లో చూపి అంకెల గారడీ చేశారే తప్ప, ప్రగతి రథ చక్రాన్ని ఆదుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

అంకెల్లో అదుర్స్.. అసలు చూస్తే డొల్ల

విద్యార్థులు, ఉద్యోగులు, జర్నలిస్టులు తదితరులకు బస్ పాసుల రూపంలో ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఈ రాయితీ డబ్బును ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఈ తరహా రాయితీల రూపంలో ప్రభుత్వం ఆర్టీసీకి ఏటా రూ.520 కోట్లు బాకి పడుతోంది. 2015-16 నుంచి ఏటా ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఔదర్యంతో ఆర్టీసీకి ఇస్తున్నట్టు కేటాయింపుల్లో చూపుతోంది. అప్పటికీ పూర్తి స్థాయిలో నిధులను విడుదల చేయడంలేదు. గత మూడేళ్లుగా బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.2వేల కోట్లకు పైగా కేటాయించిన ప్రభుత్వం, చెల్లించింది మాత్రం రూ.811 కోట్లు మాత్రమే. 2018-19 బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.975 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.520 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సిన రాయితీ డబ్బులు. ప్రభుత్వ హామీ రుణాలను చెల్లించేందుకు మరో రూ.315.54 కోట్లు.. ఇవిపోనూ మిగిలిన రూ.140 కోట్లను కొత్త బస్సుల కొనుగోలుకు కేటాయించింది. 2017-18 బడ్జెట్‌లో కూడా కొత్త బస్సుల కొనుగోలుకు రూ.140 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఇప్పటివరకూ విడుదల చేసింది రూ.70 కోట్లు మాత్రమే. 2017-18 ఆర్థిక ఏడాదికిగానూ ఆర్టీసీ రూ.4 వందల కోట్లకుపైగా నష్టాలను మూటగట్టుకుంది. ఇటీవల కరీంనగర్ సభలో ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేదిలేదని, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ఆదుకుంటామని సీఎం కేసీఆర్ చెప్పారు. దీంతో ఆర్టీసీకి ఈ బడ్జెట్‌లో ప్రత్యేక గ్రాంటు ఉంటుందని అంతా ఆశించారు. ఆర్టీసీ ఉద్యోగులు అడిగినదానికంటే ఎక్కువగా 44 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ముఖ్యమంత్రి, దాని అమలు చేయడం మరిచారని పలు కార్మిక సంఘాలు ఆందోళన బాటపడుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచే ఫిట్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ వేతన సవరణ అమలైతే జీతాల రూపంలో సంస్థపై రూ.కోట్ల భారం పడనుంది.

నష్టాల సాకుతో ప్రైవేటీకరణ దిశగా..

నష్టాల పేరుతో ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే దిశగా అడుగులు పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఏటా దాదాపు రూ.450 కోట్ల నష్టాలను మూటగట్టుకుంటున్న ఆర్టీసీకి, జీతాల చెల్లింపు కూడా కష్టమేకానుంది. తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రి సహా జిల్లాల్లోని డిస్పెన్సరీలకు సంబంధించిన ఫార్మసీలను ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. వరంగల్‌లో ఉన్న ఆర్టీసీ టైర్ రీ ట్రేడింగ్ యూనిట్‌నూ మూసేశారు. అరిగిపోయిన టైర్లు మరికొంతకాలం మన్నేలా టైర్లకు రబ్బర్‌ను ఏర్పాటు చేసే పని ఈ యూనిట్‌లో చేపట్టేవారు. యాభై ఏండ్లుగా బస్సు టికెట్లు, ఎస్ఆర్ పత్రాలు, తదితరాలను ముద్రిస్తున్న ఆర్టీసీ ప్రింటింగ్ ప్రెస్‌ను సైతం మూసివేసేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఈ ఏడాది జూన్-జూలై నాటికి దీన్ని మూసివేస్తారని ప్రచారం జరుగుతోంది. ఆర్టీసీలో కొన్నేళ్లుగా వేల సంఖ్యలో ఉద్యోగ విరమణలుంటే, పదుల సంఖ్యలో కూడా నియామకాలు చేపట్టడంలేదు. కొత్త బస్సుల కొనుగోలుకు అంతగా ప్రాధాన్యమివ్వకుండా అద్దె బస్సులవైపే యాజమాన్యం మొగ్గు చూపుతోంది. తాజా బడ్జెట్‌లోనూ ఆర్టీసీకి ప్రభుత్వం మొండి చేయి చూపింది. ఇవన్నీ ప్రైవేటీకరించే యోచనలో భాగమేనని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు.

ఆర్థిక సంవత్సరం	కేటాయింపు (రూ.కోట్లలో)	విడుదల
2015-16	400	211
2016-17	633	275
2017-18	994	325+
2018-19	975	-



మూల్యాంకన కేంద్రాల్లో ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్

కాంట్రాక్టు లెక్చరర్ల ఆందోళన

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): నిబంధనలకు విరుద్ధంగా చీఫ్ ఎగ్జామినర్ నిర్వహణ డ్యూటీలు కేటాయిస్తున్నారని ఆర్జేడీ కాంట్రాక్టు లెక్చరర్స్ సంఘం ఆరోపించింది. ఈమేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల వద్ద ప్రభుత్వ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్ శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ కాంట్రాక్టు లెక్చరర్స్ సంఘం అధ్యక్షుడు గాదె వెంకన్న, ప్రధాన కార్యదర్శి వై.కుమారస్వామి, మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి సురేశ్ విలేకరులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం చీఫ్ ఎగ్జామినర్స్‌గా మొదట నియమించి.. గంటల వ్యవధిలోనే వాటిలో మార్పులు చేస్తూ అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా కేటాయించారని ఆరోపించారు. ఏమాత్రం అనుభవం లేని మోడల్ స్కూల్ టీచర్లకు చీఫ్ ఎగ్జామినర్‌గా బాధ్యతలు అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అనంతరం క్యాంప్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సీనియారిటీ ప్రకారం చీఫ్ ఎగ్జామినర్ బాధ్యతలను కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని చెప్పారు. అనుభవం లేనివారి వల్ల మూల్యాంకనంలో తప్పులు దొర్లి విద్యార్థులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, దీనిపై అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

సాగుకు ప్రత్యేకంగా 13500 కోట్లివ్వాలి

- బడ్జెట్ సవరణకు రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): సిబ్బంది వేతనాలు, రాయితీలు పోను వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా రూ.13500 కోట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. బడ్జెట్‌ను సవరించి ఈ మేరకు కేటాయింపులు చేసేవరకు జిల్లా స్థాయిలో సమావేశాలు, ఆందోళనలు నిర్వహించాలని ఆలిండియా కిసాన్ సంఘ్(ఏఐకేఎస్) ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో సారంపల్లి మాట్లాడుతూ.. విత్తన సబ్సిడీ, విత్తన చట్టం, ప్రకృతి వైపరిత్యాల పరిహారం, మార్కెట్ జోక్య పథకం, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. వ్యవసాయానికి కేటాయించిన రూ.12734.07 కోట్ల బడ్జెట్‌లో, వాస్తవంగా వ్యవసాయానికి దక్కేది 2 వేల కోట్లు మాత్రమేనన్నారు. రైతులను మభ్యపెట్టకుండా ప్రత్యేకం గా 13500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు పి.జంగారెడ్డి, కార్యదర్శి టి.సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మానువాడ గ్రామస్తులను ఆదుకోండి

- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎల్.రమణ లేఖ

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో భూములు కోల్పోయిన మానువాడ గ్రామస్థులకు న్యాయం చేయాలని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ కోరారు. ఏండ్ల తరబడి పెండింగ్ ఉన్న నష్ట పరిహారం వెంటనే విడుదలచేసి బాధితులను ఆదుకోవాలంటూ సీఎం కేసీఆర్‌కు శుక్రవారం ఓ లేఖ రాశారు. 2006-07లో మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయిన్‌పల్లి మండలంలోని మానువాడ గ్రామంలో 80శాతానికిపైగా ప్రజలు భూములు కోల్పోయారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని లేఖలో రమణ పేర్కొన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కూడా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గతేడాది జూన్‌లో స్థానిక ఆర్డీవో గ్రామ సభ నిర్వహించి ఎకరానికి రూ.8 లక్షల చొప్పున చెల్లిస్తామని చెప్పారు. ఇందుకు గ్రామస్థులు కూడా అంగీకరించారని రమణ గుర్తుచేశారు. మిడ్ మానేరు సందర్శనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు కూడా బాధితులను ఆదుకుంటామని హామీనిచ్చారని రమణ వివరించారు. తమకు న్యాయం చేయాలని బాధితులు దీక్ష చేస్తున్నారని, ఇప్పటికైనా నిర్వాసితులను ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని రమణ డిమాండ్ చేశారు.

బతుకుదెరువు చూపండి సారూ !

- గీతాంజలి జెమ్స్ జ్యుయెలరీ కార్మికుల మొర

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): పీఎన్‌బీ కుంభకోణంలో భాగంగా నీరవ్ మోదీకు చెందిన గీతాంజలి జెమ్స్ జ్యూలరీ కంపెనీ మూతపడింది. దీంతో దాదాపు 600 కుటుంబాలు రోడ్డు పడ్డాయి. తమకు బతుకుదెరువు చూపాలంటూ ఆ సంస్థలో పనిచేసిన కార్మికులంతా మొరపెట్టుకుంటున్నారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయం గేటు ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఏళ్లుగా ఆ కంపెనీలో పనిచేస్తున్నామని, సంస్థ మూసేయడంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందులో 200మంది కార్మికులు వికలాంగులని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఇది సకల జనుల బడ్జెట్

- మంత్రి ఈటలతో కార్పొరేషన్ చైర్మన్‌లు

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డా.కె.వాసుదేవారెడ్డి, రోడ్డు భవనాల కార్పొరేషన్ చైర్మన్ నర్సిరెడ్డి శుక్రవారం మంత్రి ఈటల రాజేందర్‌ను సచివాలయంలో కలిశారు. శాసన సభలో ఈటల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సకల జనుల బడ్జెట్ అని, ప్రజాబడ్జెట్ అని కొనియాడారు. అనంతరం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. తెరాస విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, జాగృతి రాష్ట్ర కార్యదర్శి నల్గొండ శ్రీనివాస్ కూడా మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి తమ ఆర్థికాభివృద్ధికి సహకరించినందుకు నాయీబ్రాహ్మణ సంఘం నేతలు మంత్రి ఈటలకు కృతజ్ఞతలు తెలియజేశారు.




బెదిరింపులకు అడ్డాగా అసెంబ్లీ

- కేసీఆర్ మనస్తత్వం మోసాలకు పరాకాష్ట
- ఈ నెల 20 నుంచి ఆందోళనలు: మంద కృష్ణ

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): ప్రశ్నించిన వారిని బెదిరించేందుకు, అబద్ధాలు మాట్లాడేందుకు సీఎం కేసీఆర్ అసెంబ్లీని అడ్డాగా చేసుకున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మండిపడ్డారు. శుక్రవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా తనను, ఎమ్మార్పీఎస్ ఉద్యమాలను అణచివేస్తామని మాట్లాడడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కాంగ్రెస్‌తో కుమ్మక్కై అలజడి సృష్టించే ప్రయత్నం చేశామన్న ఆరోపణను ఆయన కొట్టిపారేశారు. 24 ఏండ్ల ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ ఏనాడూ సంఘ విద్రోహ చర్యలకు, శాంతి భద్రతలకు విఘాతం కల్గించలేదని తెలిపారు. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు జిల్లా, మండల కేంద్రాల్లో దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని మంద కృష్ణ పేర్కొన్నారు. ఈ నెల 17, 18న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంపీలను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ నెల 21 నుంచి పార్లమెంటు సమావేశాలు ముగిసేవరకు ఢిల్లీలో దీక్షలు, ధర్నాలు చేస్తామని ప్రకటించారు.

అవిశ్వాసానికి టీఆర్ఎస్ అడ్డంకి


- మద్దతివ్వకుండా సభలో ఎంపీల ఆందోళన
- విభజన హామీలపై కేంద్రంపై పోరాడరా?
- బీజేపీ కనుసన్నల్లో టీఆర్ఎస్ తీరు: జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): విభజన చట్టంలోని హామీల అమలుకు ఆయాపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంట్‌లో అవిశ్వాసం పెడితే.. టీఆర్ఎస్ సభ్యులు మాత్రం వారికి మద్దతివ్వకుండా సభలో గందరగోళం సృష్టించడం విచారకరమని కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. సభ ఆర్డర్‌లో లేకుండా టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళనకు దిగారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. థర్డ్ ఫ్రంట్ పేరు వల్లిస్తున్న సీఎం కేసీఆర్..బీజేపీ సర్కారుకు వ్యతిరేఖంగా టీడీపీ, టీఎంసీ, కాంగ్రెస్ ఇతర పార్టీలు అవిశ్వాసం పెడుతుంటే టీఆర్ఎస్ అడ్డంకిగా నిలుస్తోందని అన్నారు. బీజేపీ కనుసైగల్లో టీఆర్ఎస్ నడుచుకుంటోందని ఆరోపించారు. విభజన హామీల అమలుకు విపక్షాలు పోరాడుతుంటే...టీఆర్ఎస్ వైఖరి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వం అందించనున్న పంట పెట్టుబడి పథకం.. గిట్టుబాటు ధరకు ప్రత్యామ్నాయం కాదని అన్నారు. రుణ మాఫీ లబ్ధినే రైతు ఇప్పటికీ పొందలేకపోయాడని, వడ్డీ రాయితీ నాలుగేళ్లలో ఒక్క రూపాయీ విడుదల చేయలేదని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే తప్ప రైతులకు ప్రభుత్వం చేసిందేమీ లేదని అన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్ల బండారం బయటపడకుండా ఉండేందుకే ప్రభుత్వం 24 గంటల కరెంట్‌ను తెరమీదికి తెచ్చిందని ఆరోపించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో దళితులకు రూ.26 వేల కోట్లు కేటాయించారని, కానీ.. రూ.13 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే దళిత, గిరిజనుల నిధులు లాప్స్ చేస్తున్నారని అన్నారు. అత్యంత వెనుకబడిన వర్గాల కులాల జాబితానే ప్రభుత్వం దగ్గర లేదన్నారు. 27వేల ఉద్యోగాలు భర్తీ చేశామని బడ్జెట్‌లో పేర్కొన్న ప్రభుత్వం.. మిగతా 80వేల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారో చెప్పలేదన్నారు. మిషన్ భగీరథకోసం భారీగా నిధులు కేటాయించారని, ''పైపులకోసం నీళ్లా.. నీళ్లకోసం పైపులా'' అన్న అనుమానం తలెత్తుతోందని పేర్కొన్నారు.

ప్రధానితో టీఆర్ఎస్ లాలూచీ

లోక్‌సభలో గులాబీ ఎంపీల శిఖండి పాత్ర.. మోదీపై కేసీఆర్ ఆగ్రహమంతా నాటకం: రేవంత్




హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో టీఆర్ఎస్ లాలూచీ పడిందనే విషయం శుక్రవారం పార్లమెంట్ సాక్షిగా బట్టబయలైందని కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి విమర్శించారు. లోక్‌సభలో టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అడ్డుకోవడానికి మోదీ తరపున టీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషించిందన్నారు. విభజన చట్టంలో హామీల అమలు, ప్రత్యేక హోదా కోసం టీడీపీ, వైసీపీ పార్లమెంట్‌లో ఆందోళనలు చేస్తున్నాయని రేవంత్ గుర్తు చేశారు. ఏపీ ఎంపీల ఆందోళనకు మద్దతు ఇస్తున్నామని చెబుతున్నారని, మరో వైపు మోదీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఫ్రంట్ నిర్మిస్తున్నామని కేసీఆర్ ప్రకటిస్తున్నారని, సభలో మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తించారని అన్నారు. సభ సజావుగా ఉంటేనే అవిశ్వాస తీర్మానం తీసుకుంటానని స్పీకర్ ప్రకటించిన సమయంలో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, వామపక్ష సభ్యులు లేచి నిలబడే సమయానికి టీఆర్ఎస్ కావాలనే రిజర్వేషన్లపై గందరగోళం చేసిందన్నారు. దీంతో సభ అదుపులోలేదని స్పీకర్ అవిశ్వాసం తీసుకోకుండా సభను సోమవారానికి వాయిదా వేశారన్నారు. మోదీపై నిజంగానే వ్యతిరేకత ఉంటే టీఆర్ఎస్ ఎంపీలు కొద్ది సేపు ప్రశాంతంగా ఉంటే అవిశ్వాసం చర్చకు వచ్చేందన్నారు. ఇది చర్చకు వస్తే ఆంధ్రప్రదేశ్ కే కాకుండా, తెలంగాణకు కూడా ప్రయోజనం కలిగేదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. విభజన సమస్యలపై సభలో చర్చించే అవకాశం వచ్చేందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్, కాళేశ్వరం జాతీయ హోదా వంటి సమస్యలపై ప్రధాన మంత్రిని నిలదీసే అవకాశం కలిగేదని తెలిపారు. మోదీతో లాలూచీ పడినందునే శిఖండి పాత్ర పోషించారని రేవంత్ ఆరోపించారు. మోదీ పై కేసీఆర్ ప్రదర్శిస్తున్న ఆగ్రహం నాటకమని తేలిపోయిందన్నారు. తనపై ఉన్న సీబీఐ కేసుల నుంచి తప్పించుకునేందుకే కేసీఆర్ ఏనాడో మోదీకి లొంగిపోయారని, ఇప్పుడు చెబుతున్న వ్యతిరేకత ఒట్టిదేనని రేవంత్ ఆరోపించారు.

టీడీపీ అంతానికి బీజేపీ కుట్ర

- చంద్రబాబు ఎన్నో సంక్షోభాలు చూశారు
- తెలుగు రాష్ట్రాలకు బీజేపీతో అన్యాయం
- లోకేశ్‌పై పవన్ ఆరోపణలు అవాస్తవం: రావుల

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా అన్యాయం చేసిన బీజేపీ, ఇప్పుడు టీడీపీని నాశనం చేసేందుకు కుట్ర పన్నిందని ఆ పార్టీ తెలంగాణ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రం తెలుగు రాష్ట్రాలకు ఇస్తున్న ఆదాయం కంటే, పన్నుల రూపంలో తెలుగు రాష్ట్రాలు కేంద్రానికి ఇస్తున్న నిధులు ఎక్కువ అని రావుల అన్నారు. తెలుగు రాష్ట్రాలకు న్యాయం చేస్తుందన్న నమ్మకంతో ఇరు రాష్ట్రాల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని, ఇప్పుడు టీడీపీని నాశనం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. తమ నాయకుడు, ఏపీ సీఎం చంద్రబాబు ఇలాంటి సంక్షభాలెన్నింటినో చూశారని చెప్పారు. చంద్రబాబు తనయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను విమర్శించే స్థాయి జనసేనాని పవన్‌కు లేదని రావుల అన్నారు. లోకేశ్‌పై పవన్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఏపీ ప్రత్యేక హోదా విషయంపై పవన్ తన అన్న చిరంజీవిని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. తెలంగాణకు రావాల్సిన బయ్యారం స్టీల్ ప్లాంట్, ఖాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, యూనివర్సిటీల ఏర్పాటు, తదితర హామీలను కేంద్రం విస్మరించిందని రావుల దుయ్యబ ట్టారు. ప్రతి శుక్రవారం అవినీతి కేసులో కోర్టుకు వెళ్లొచ్చే వ్యక్తి, శనివారం అవినీతిపై మాట్లాడటం హాస్యాస్ప దంగా ఉందంటూ వైసీపీ అధినేత జగన్‌కు రావుల చురకలంటించారు.



ముస్లింలకు అన్యాయం: తాజుద్దీన్

బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం ముస్లింలకు ప్రతి ఏటా అన్యాయం చేస్తోందని టీటీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ అన్నారు. 66 మంది ఉర్దూ అధికారులను నియమిస్తామని, ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటిస్తామని కేసీఆర్ హామీనిచ్చి, నేటికి అమలు చేయకపోవడం దారుణమన్నారు. రూ.21 కోట్లతో ముస్లిం కాంప్లెక్స్ భవనం నిర్మిస్తామని గతేడాది జూన్‌లో శంకుస్థాపన చేయించిన కేసీఆర్, ఇప్పటివరకు భవన నిర్మాణానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. 6 ఎకరాల్లో రూ.40 కోట్లతో ఇస్లామిక్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని మాటిచ్చిన కేసీఆర్, కనీసం స్థలం అలాట్‌మెంట్ జీవో కూడా ఇవ్వలేదన్నారు. ముస్లింలకు ఇచ్చి హామీల్లో కేసీఆర్ ఒక్కటి కూడా అమలు చేయలేదని తాజుద్దీన్ మండిపడ్డారు.

త్వరలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వెబ్‌సైట్

- నిధులు పక్కదారి పట్టకుండా విజిలెన్స్ కమిటీలు
- గవర్నర్‌ను కలిసిన చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు త్వరలో వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామని కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌ను శుక్రవారం ఆయన రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం ఎర్రోళ్ల శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా గవర్నర్‌ను కలిశానన్నారు. గవర్నర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కమిషన్ నిర్లక్ష్యానికి గురయ్యిందని, దానికి జీవం పోసి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరువచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఓ వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామని, ఆన్‌లైన్ విధానం ప్రారంభిస్తామని శ్రీనివాస్ చెప్పారు. దళితుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌కు కమిషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాల నిధులు సక్రమంగా ఖర్చు పెట్టేందుకు 31 జిల్లాలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిధులు పక్కదారి పట్టకుండా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వర్తిస్తామని ఎర్రోళ్ల స్పష్టంచేశారు. బడ్జెట్‌లో తమ శాఖకు జరిగిన నిధులు కేటాయింపుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

సీఎం కాన్వాయ్‌కి అడ్డంపడ్డ మందుబాబులు



హైదరాబాద్, మార్చి 16: సీఎం కేసీఆర్ కాన్వాయ్ ముందు ఇద్దరు తాగుబోతులు వీరంగం సృష్టించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. వివరాలు.. శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ ఖార్ఖానాలోని రోడ్డుపై ఉన్న మహంకాళి ఆలయం ముందు ఇద్దరు తాగుబోతులు సీఎం కాన్వాయ్‌కి అడ్డు వచ్చారు. పరుగెత్తుకుంటూ వచ్చి అడ్డుపడ్డారు. దీంతో ఎస్కార్ట్ సిబ్బంది కంగారు పడ్డారు. వెంటనే అప్రమత్తమై సిబ్బందిని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ కేశవులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.



బీసీ, ఎంబీసీలకు అన్యాయం

- కేసీఆర్‌ది గత ప్రభుత్వాల వైఖరే : తమ్మినేని

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ, ఎంబీలకు అన్యాయం జరిగిందని, ఉమ్మడి ఏపీ ప్రభుత్వాల మాదిరిగానే టీఆర్ఎస్ కూడా అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో తమ్మినేని శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేటాయింపులు బారెడు.. ఖర్చు మూరెడు అన్న చందంగా కేటాయింపుల్లో సగం కూడా ఖర్చు చేయకుండా ఆయా వర్గాలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. బీసీ, ఎంబీసీల కోసం కేసీఆర్ మాట్లాడేదంతా వట్టి డొల్ల అని తమ్మినేని విమర్శించారు. ఎంబీసీలకు గతేడాది రూ.వెయ్యి కోట్లు కేటాయించి, వెయ్యి పైసలు కూడా ఖర్చుచేయలేదన్నారు. మళ్లీ వెయ్యి కోట్లంటూ వారిని మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 52శాతం ఉన్న బీసీలకు రూ.5920 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. గత బడ్జెట్‌లో బీసీలకు రూ.5 వేల కోట్లు కేటాయించి 2వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గతేడాది ఆరు వేల కోట్లు కేటాయించి 3 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం పేరుతో చిన్న చిన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం లేదన్నారు. ఉపాధిహామీ, రేషన్ సరుకుల సబ్సిడీ కోసం చేసిన ఖర్చును ఎస్సీ సబ్‌ప్లాన్‌లో చూపడం సిగ్గుచేటన్నారు. ధరల స్థిరీకరణ నిధికి నిధులు కేటాయించకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలన్నారు. కేసీఆర్ కేటాయించిన రూ.14 వందల కోట్లతో ఇంకో 50ఏండ్లయినా దళితులందరికీ మూడెకరాల భూమి ఇవ్వడం సాధ్యంకాదన్నారు. బడ్జెట్ తీరు తెన్నులు, ఆదాయవ్యయాలపై ప్రభుత్వం నోట్ విడుదల చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

19న మహాజన పాదయాత్ర వార్షికోత్సం

గతేడాది సీపీఎం చేపట్టిన మహాజన పాదయాత్ర ముగింపు సభ జరిగి ఈ నెల 19నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తమ్మినేని చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'నేటి రాజకీయాలు- వామపక్ష, సామాజికల శక్తుల కర్తవ్యం' అనే అంశంపై 19న సెమినార్ నిర్వహించనున్నారు. ఈ సెమినార్‌కు గుజరాత్‌కు చెందిన దళిత ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని హాజరవుతారని చెప్పారు. అదే రోజు సాయంత్రం గోల్కొండ చౌరస్తాలో బహుజన లెఫ్ట్(బీఎల్ఎఫ్) కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగాన్ని స్వాగతిస్తున్నామని, తెలంగాణలో ఆయనతో కలిసి వెళ్లే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్‌తో కలవమని తమ్మినేని స్పష్టం చేశారు.

ఆ ఉపకులాలను ఎంబీసీల్లో చేర్చండి

- సీఎం కేసీఆర్‌కు సీపీఐ నేత చాడ లేఖ



హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): వెనుకబడిన తరగతులకు చెందిన సంచార జాతుల్లో 30 ఉపకులాలకు నేటికి గుర్తింపులేదని, వారిని బీసీల్లో ఏ వర్గంలో చేర్చాలో నేటికి ప్రశ్నార్థకంగా ఉందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. 30 సంచారజాతులకు గుర్తింపు కల్పించి వారిని ఎంబీసీల్లో చేర్చాలని ఆయన కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుక్రవారం ఓ లేఖ రాశారు. సంచార జాతుల వారు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారని చాడ ఆ లేఖలో పేర్కొన్నారు. వారిని బీసీల్లో ఎంబీసీల కింద ఉపకులాలగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయంపై కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ బీసీ కమిషన్‌కు లేఖ కూడా రాశారని గుర్తు చేశారు. ఎంబీసీ, బీసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి గుర్తింపు లేకుండా ఉన్న కులాలపై ఓ నిర్ణయం తీసుకోవాలని చాడ కోరారు.

బీసీలను వంచించిన సర్కారు

- 52 శాతం జనాభా ఉంటే.. బడ్జెట్‌లో 4 శాతమే నిధులా?
- కేటాయింపులను సవరించాలి
- బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ డిమాండ్

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): ఏటా మాదిరిగానే ఈసారి కూడా బడ్జెట్‌లో బీసీలక తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలను వంచించిందని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ(బీసీఎస్ఎస్సీ) మండిపడింది. శుక్రవారం, హైదరాబాద్‌లో బీసీ సబ్‌ప్లాన్ సాధన తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. బీసీ, ఎంబీసీలకు కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో 4శాతానికి మించదని, రాష్ట్ర జనాభాలో 52శాతం ఉన్న బీసీలకు ఇది ఏ మూలకూ సరిపోదని ఈ భేటీలో వక్తలు దుయ్యబట్టారు. బీసీ సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం, ఆచరణలో అన్యాయం చేస్తోందని, దీన్ని బీసీ ఎమ్మెల్యేలు గ్రహించాలని సబ్‌ప్లాన్ సాధన కమిటీ చైర్మన్, ప్రొఫెసర్ మురళి మనోహర్ కోరారు. గతేడాది బీసీలకు కేటాయించిన బడ్జెట్ నుంచి ఎంత ఖర్చు చేశారో, పూర్తి వివరాలతో ప్రభుత్వ శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌ను సవరించాలని, బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ భేటీలో కమిటీ నేతలు కిల్లె గోపాల్, కూరపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

- ఎంతటివారైనా సరే క్రిమినల్ కేసులు
- చట్టం రూపంలో మైనింగ్ పాలసీ
- సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరగాలి
- ప్రభుత్వనిర్మాణాల్లో రాక్ శాండ్ వాడకం
- టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో క్రషర్ల ఏర్పాటు పరిశీలన
- గనులు, ఇసుక రీచ్‌ల లీజుకు ఈ-ఆక్షన్ విధానం
- త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా శాండ్ ట్యాక్సీ విధానం
- సున్నపురాయి గనులకు అంతర్జాతీయ స్థాయిలో వేలం
- బయ్యారం స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర మంత్రులతో మాట్లాడతా
- గనుల శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి కేటీఆర్



గనుల శాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌ను సహించేది లేదని, ఈ విషయంలో ఎంతటి వారైనా అధికారులు ఒత్తికి గురికావద్దని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కేటీ రామారావు సూచించారు. గనుల శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సుదీర్ఘంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అక్రమ మైనింగ్ పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అక్రమ మైనింగ్ నివారణకు గనుల శాఖ తీసుకున్న చర్యలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో 354 తనీఖీలు నిర్వహించామని, 79 ఉల్లంఘనలు గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలో గనులు లీజు తీసుకుని కార్యకలాపాలు నిర్వహించని 477 లీజులను రద్దు చేశామని అధికారులు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా శాండ్ ట్యాక్సీ

పలు జిల్లాల్లో చేపట్టిన శాండ్ ట్యాక్సీ విధానం విజయవంతం అయిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో ఇసుక ధర ఎంతో తెలిసేలా విధానం ఉండాలన్నారు. ఈ అర్థిక సంవత్సరానికిగాను గనుల శాఖ ఆదాయం లక్ష్యాన్ని సాధించినట్లు మంత్రి తెలిపారు. ఈ సంవత్సరానికి గాను నిర్ధేశిత రూ.3166 కోట్ల లక్ష్యానికి గాను మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా ఫిబ్రవరీ నెలాఖరుకు సుమారు 3,500 కోట్ల రూపాయల (110శాతం) అదాయం ప్రభుత్వానికి వచ్చింది. ముఖ్యంగా ఇసుక అదాయ లక్ష్యం 388కోట్లకు గాను 538 కోట్ల ఆదాయం (139శాతం) ఖజనాకు లభించినట్లు తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా అక్రమ ఇసుక తవ్వకాలపై ఉక్కపాదం మోపడంతో ఇంత పెద్ద ఎత్తున ప్రజల సంపద ప్రభుత్వానికి చేరిందన్నారు. ఖనిజాల ఆదాయం ప్రజల ఆస్తి అని అది వారికే ఉపయోగపడాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు. అందుకే మైనింగ్ ఆదాయంలోని లీకేజీలను సాధ్యమైనంత ఎక్కవగా అరికట్టామని తెలిపారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై మంత్రి అధికారులతో చర్చించారు. అదేవిధంగా ఎన్ఎండీసీ డైరెక్టర్ మరియు ప్రతినిధులతో ఇనుప ఖనిజం కేటాయింపులపై చర్చించారు. కేంద్రాన్ని ఎన్నిసార్లు కోరినా బయ్యారంపైన ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. కేంద్ర గనుల శాఖ, స్టీల్ శాఖ మంత్రులను త్వరలోనే కలిసి బయ్యారం స్టీల్ ప్లాంట్ అంశంపై మాట్లాడతానని కేటీఆర్ ఈ సందర్భంగా తెలి యజేశారు. ఈ సమావేశంలో గనుల శాఖ డైరెక్టర్ సుశీల్ కూమార్, టీఎస్ఎండీసీ ఎండీ మల్సూర్, గనుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలి

గనుల శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని మంత్రి కేటీఆర్ అధికారులకు సూచన చేశారు. గనుల పర్యవేక్షణకు జియోఫెన్సింగ్, జీయో ట్యాగింగ్, ఉపగ్రహ చిత్రాల ఉపయోగం, డ్రోన్లను ఉపయో గించుకోవాలన్నారు. త్వరలో తీసుకురానున్న మైనింగ్ పాలసీలో దేశంలోని అత్యుత్తమ విధానాలను చేర్చాలన్నారు. ఈ పాలసీని చట్టరూపంలో తీసుకువస్తామన్నారు. ఈ ఆక్షన్ విధానంలోనే గనుల, ఇసుక రీచ్‌ల లీజు కేటాయింపులు జరగాలని, ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకో వాలన్నారు. అనంతరం రాష్ట్రంలోని సున్నపు రాయి గనుల లీజుపైన మంత్రి చర్చించారు. భవిష్యత్తులో వచ్చే ఈ గనుల లీజుకు జాతీయ స్ధాయి వేలం స్థానంలో అంతర్జాతీ స్థాయి వేలం నిర్వహించాలన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం రాక్ సాండ్ వినియోగాన్ని పెంచా లన్నారు. ప్రభుత్వం చేప ట్టిన సాగునీటి, అర్ అండ్ బీ శాఖల నిర్మాణాల్లో దీని వినియోగం పెంచాలని, ఇందుకోసం ఆయా శాఖల ఇంజనీరింగ్ శాఖాధి పతులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరతా మన్నారు. టీఎస్ ఎండీసీ కూడా రాక్ శాండ్ క్రషర్ల ఏర్పాటును పరిశీలించాలని ఆదేశించారు.



టర్కీలో 'హైదరాబాద్ వాక్'

- పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యం
- టర్కీ రాయబారితో బుర్రా వెంకటేశం భేటీ

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో టర్కీ దేశ రాయబారి అద్నాన్ అల్తాయ్ అల్టినోర్స్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టర్కీ దేశ పర్యాటక, సాంస్కృతి సాంప్రదాయాల పై హైదరాబాద్ లో టర్కిస్ వీక్ గా నిర్వహించటంతోపాటు టర్కీ దేశ రాజధాని ఇస్తాంబుల్ లో హైదరాబాద్ వీక్‌ను నిర్వహిస్తున్నట్లు బుర్రా వెంకటేశం వెల్లడించారు. టర్కీ దేశంతో హైదరాబాద్ నగరానికి గతం నుంచి మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయన్నా యన్నారు. అందులో భాగంగా హైదరాబాద్, తెలంగాణ ప్రాంత సంస్కృతి, సాంప్రదాయాలను టర్కీలో పరిచయం చేసి పర్యాటకులను ఆకర్షిస్తామన్నారు. టర్కీకి చెందిన కొన్ని కంపనీలు మ్యాజిక్ మెట్లను తయారు చేస్తున్నాయని వాటిని మన హైదరాబాద్ నగరానికి పరిచయం చేసే విధంగా వారిని ఆహ్వానిస్తున్నామని ఈ సందర్భంగా వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా అద్నాన్ అల్తాయ్‌కు తెలంగాణ పర్యాటక శాఖ రూపొందించిన పుస్తకాలను బహూకరించారు

అప్పుల కోసమే ఈ గొప్పలన్నీ

- రాష్ట్రానిది మిగులు బడ్జెట్ కాదు
- కాగ్ నివేదికతో ముసుగు తొలగిపోద్ది
- రాష్ట్రంలో కార్పొరేషన్ల లెక్కలేంటి?
- బడ్జెట్‌లో హైదరాబాద్‌కు అన్యాయం
- నగరంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి ఆరోపణ



హైదరాబాద్, మార్చి 16 (మనం ప్రతినిధి): టీఆర్ఎస్ సర్కారు రికార్డు స్థాయిలో అప్పులు చేసిందని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ అప్పులకు వడ్డీ రూపంలో 12 వేల కోట్లు చెల్లించే పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీలోని మీడియా హాల్‌లో ఆయన మాట్లాడుతూ.. విభజన సమయంలో రూ.72 వేల కోట్లుగా ఉన్న అప్పు ఈ రోజు రూ.2.22 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. అప్పులకోసం ప్రభుత్వం గొప్పలకు పోతోందని, టీఆర్ఎస్ నాయకులు చెబుతున్నట్లు తెలంగాణ రాష్ట్రానిది మిగులు బడ్జెట్ కాదని విమర్శించారు. 2017-18 సంవత్సరంలో రూ.1545 కోట్ల మిగులు బడ్జెట్ మాత్రమే ఉందని, ప్రభుత్వం మాత్రం రూ.4571 కోట్లుగా ఉందని అబద్ధపు లెక్కలు చెబుతోందని ఆరోపించారు. కాగ్ నివేదికలో ఇవన్నీ బట్టబయలు అవుతాయన్నారు. కార్పొరేషన్ల పేరిట 41 వేల కోట్ల అప్పు ఉందని, అసలు రాష్ట్రంలో ఎన్ని కార్పొరేషన్‌లు ఉన్నాయో ప్రభుత్వం లెక్క చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఏడాది బడ్జెట్‌లో భూముల విక్రయం ద్వారా 5000 కోట్లు వస్తాయని పేర్కొంటే.. 1000 కోట్లు మించి రాలేవని, ఈ సారి బడ్జెట్‌లో ఆ విలువను 3 వేల కోట్లుగా ప్రతిపాదించినా 500 కోట్లు కూడా వచ్చే అవకాశం లేదన్నారు. బడ్జెట్‌లో హైదరాబాద్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్రానికి పెద్దమొత్తంలో ఆదాయం సమకూర్చే మహానగరంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి అభివృద్ధికి నయాపైసా కూడా కేటాయించలేదన్నారు.

విశ్వవిద్యాలయాలపై కక్ష

టీఆర్ఎస్ సర్కారు విశ్వవిద్యాలయాలపైన కక్ష కట్టినట్లు వ్యవహరిస్తోందని, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు జరపలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఓయూలో ఆచార్యులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. గత బడ్జెట్‌లో యూనివర్సిటీలకు 374 కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసింది 170 కోట్లు మాత్రమేనని ఆరోపించారు. ఈసారి బడ్జెట్‌లో 650 కోట్లు కేటాయిస్తామని కడియం శ్రీహరి చెప్పినా.. తీరా 210 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడానికే ఈ లెక్కలే నిదర్శనమన్నారు. మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం 735 కోట్లు కేటాయించడం సంతోషకరమని, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలకు కూడా జనాభా ప్రాతిపాదికన నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. హరితహారానికి కేటాయింపులు లేవన్నారు. డిస్కమ్‌లలో 862 కోట్ల రూపాయల లోటు ఉందని తెలిసినా, విద్యుత్ రంగానికి కేటాయింపులు తగ్గించారని, దీన్ని బట్టి చూస్తే.. రాబోయే రోజుల్లో కరెంటు చార్జీలు పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యారంగానికి బడ్జెట్ తగ్గించిందని, ప్రగతి పద్దు కేటాయింపులు చూసుకుంటే, గత బడ్జెట్‌కు, ప్రస్తుత బడ్జెట్‌కు 115 కోట్లు తగ్గిందన్నారు.

రుణమాఫీ లెక్కలేవీ?

రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు ఇంతవరకు రుణమాఫీ జరగలేదని, ఆ లెక్కలు బడ్జెట్‌లో ప్రస్తావించకుండా రుణమాఫీ లెక్కలు పూర్తయ్యాయని ఎలా చెబుతారంటూ కిషన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాత బకాయిల వివరాలు బడ్జెట్‌లో పొందుపరచలేదని, కొత్త బకాయిలు ఇంకెన్ని కోట్లు ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం 35 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.2520 కోట్లు, ఫుడ్ సబ్సిడీ రూ.4500 కోట్లు, ఫసల్ బీమా యోజన రూ.150 కోట్లు, రైతుల పావలా వడ్డీ రూ.400 కోట్లు, పొదుపు సంఘాలకు పావలా వడ్డీ రుణాలకు రూ.1000 కోట్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలకు రూ.1000కోట్లు, కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహక సబ్సిడీ రూ.1200 కోట్లు, పీఆర్‌సీ ఉద్యోగులకు రూ.1800 కోట్లు, విద్యుత్ బకాయిలు (జెన్‌కో) రూ.8000కోట్లు, గ్రామపంచాయతీలకు రూ.450కోట్లు, ఆరోగ్యశ్రీ(ప్రైవేట, ప్రభుత్వ ఆసుపత్రులకు) రూ.200 కోట్లు, ఇరిగేషన్ రంగానికి రూ.5000కోట్లు, మిషన్ భగీరథ కోసం రూ.1000కోట్లు, ఆర్అండ్‌బీ రూ.1000కోట్లు, మున్సిపాలిటీలకు రూ.800కోట్లు ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని కిషన్ రెడ్డి వివరించారు.




తెలంగాణలో బీజేపీదే అధికారం: అరుణ్ సింగ్

హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): సంస్థాగతంగా ఎలాంటి బలంలేని త్రిపుర లాంటి రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన తరహాలోనే తెలంగాణలోనూ వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని పార్టీ జాతీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ పేర్కొన్నారు. 2014 తర్వాత దేశంలో 14 రాష్ట్రాల్లో కమలం పార్టీ అధికారం చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రెండు రోజుల పర్యటన కోసం రాష్ట్రానికి విచ్చేసిన అరుణ్ సింగ్ శుక్రవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారులతో సమావేశమయ్యారు. కర్నాటక ఎన్నికల్లో ఘన విజయం సాధించి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోనూ పెనుమార్పులు సంభవిస్తాయని, అవి తమ పార్టీకి అనుకూలంగా ఉంటాయన్నారు. టీడీపీ, ఎన్డీయే నుంచి వెళ్లిపోయినంత మాత్రాన ఒరిగేది ఏమీలేదన్నారు. ప్రధాని మోదీ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ప్రజలు దాన్ని గమనిస్తున్నారని చెప్పారు. మోదీ వల్లే దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్న నమ్మకం దేశ ప్రజల్లో బలంగా ఉందన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిందిగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తగిన సూచనలు చేశారు. రేపు ఖమ్మం, వరంగల్ రూరల్ జిల్లాల్లో బూతుస్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాల్లో అరుణ్ సింగ్ పాల్గొంటారు.

బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

- మాజీ ఎంపీ రవీంద్ర నాయక్



హైదరాబాద్, మార్చి 16(మనం ప్రతినిధి): తెలంగాణలో బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ ఆరోపించారు. శుక్రవారం నాడు గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎస్టీలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఏనాడు ఖర్చు చేయలేదన్నారు. పది శాతం రిజర్వేషన్ ఇస్తామని కేసీఆర్ మోసం చేశారని, రిజర్వేషన్లపై కేంద్రంతో పోరాడుతున్నామని నాటకాలు ఆడుతున్నారన్నారు. కేసీఆర్ అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని అన్నారు. భయంతోనే కాంగ్రెస్ సభ్యులను శాసనసభ నుంచి బయటకు పంపించారన్నారు. స్వామిగౌడ్‌కు ఎలాంటి గాయంకాలేదని, ఇదంతా కేసీఆర్ ఆడిస్తున్న నాటకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామిగౌడ్‌ను అడ్డుపెట్టుకుని సభలో ప్రతిపక్షాలులేకుండా చేసేందుకు కేసీఆర్ కుట్ర పన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజనులు కేసీఆర్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బలరాంనాయక్‌కు మద్దతు ఇవ్వాలని అన్ని పక్షాలను రవీంద్రనాయక్ కోరారు.


మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, మార్చి 17

వాణిజ్య యుద్ధం

వాణిజ్య యుద్ధాలు కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో భౌగోళిక రాజకీయ యుద్ధాలుగా పరిణామం చెందుతాయన్నది చారిత్రక నియమం. 2008 నుంచి ప్రపంచాన్ని చుట్టు ముట్టి పీడిస్తున్న ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ప్రపంచ దేశాల మధ్య నేడు చెలరేగుతున్న వాణిజ్య యుద్ధాలు క్రమంగా భౌగోళికాధిపత్య యుద్ధాలుగా పరిణమించే ప్రమాదమున్నట్లు పలువురు రాజకీయ విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేజారుతున్న ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు అనేక దేశాల్లో సైనిక జోక్యం చేసుకుంటున్న అమెరికా ప్రస్తుతం వాణిజ్యరం గంలో సరికొత్త యుద్ధాలకు తెరతీస్తోంది. ఇటీవల ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకాల్ని విధించిన అమెరికా, తాజాగా భారత్ అమలు చేస్తున్న ఎగుమతులపై సబ్సిడీ పథకాల కారణంగా దేశీయ మార్కెట్ ధరలలో అసమతుల్యతను సృష్టిస్తుండడంతో తమ దేశ కార్మికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)కు ఫిర్యాదు చేసింది. భారతీయ ఎగుమతుదారులకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో అమలు చేస్తున్న ఎగుమతి రాయితీ పథకాల కారణంగా ఆ దేశ చౌక ఎగుమతులు తమ సరుకుల అమ్మకాలకు విఘాతం కలిగిస్తుండడంతో సంబంధిత పరిశ్ర మలు దివాలా తీస్తున్నాయని, పర్యవసానంగా వస్తూత్పత్తిదారులు, శ్రామికులు బలవుతున్నారని డబ్ల్యూటీవో ముందు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) బుధవారం తన వాదన వినిపించారు. జాతీయ భద్రతా కారణాల రీత్యా స్వీయరక్షణ చర్యలు చేపడుతున్నట్టు అమెరికా సమర్థించు కుంటున్నా ప్రపంచాధిపత్య ఎజెండాతోనే వాణిజ్య యుద్ధాన్ని అమెరికా ప్రారంభించిందన్నది సర్వ విదితమే. పర్యవసానంగా ఈయూ, చైనా, రష్యా, జపాన్, కెనడా, దక్షిణ కొరియా తదితర దేశాలు సైతం అనేక స్వీయరక్షణ చర్యలు తీసుకునే అకాశం లేకపోలేదు.

మర్కన్‌డైజ్ ఎక్స్‌పోర్ట్స్ ఫ్రమ్ ఇండియా స్కీం-2015, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ స్కీం, స్పెషల్ ఎకానమిక్ జోన్స్, ఎక్స్‌పోర్ట్ ప్రొమోషన్ కేపిటల్ గూడ్స్ స్కీం, డ్యూటీ ఫ్రీ ఇంపోర్ట్స్ ఫర్ ఎక్స్‌పోర్టర్స్ ప్రోగ్రామ్ అనే ఎగుమతి ప్రోత్సాహక రాయితీ పథకాలను భారత్ అమలు చేస్తుండడం వల్ల వాణిజ్యపరమైన నష్టాలు సంభవిస్తున్నాయనీ, తమ దేశ వస్తూత్పత్తి రంగం, శ్రామిక రంగం దెబ్బతింటోందని అమెరికా ఆరోపించింది. ఈ పథకాల వల్ల భారతీయ కంపెనీలకు 700 కోట్ల డాలర్లకు పైగా లాభం చేకూరుతున్నట్లు ఆ దేశ ప్రభుత్వ డాక్యుమెంట్లే వెల్లడిస్తున్నాయని తెలిపారు. అయితే తనకు అనుకూలంగా మార్చుకోవడంలో దాదాపుగా విజయవంతమైన అమెరికా డబ్ల్యూటీవోలో భారత్‌కు వ్యతిరేకంగా ఆరోపించడంలో మర్మం దాగి ఉంది. ఇలాంటి ఆరోపణలతో భారత్‌ను మరింత గట్టిగా తన వ్యూహంలో అంతర్భాగం చేసుకోవాలన్నది అమెరికా లక్ష్యంగా ఉండొచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భవితకే ప్రశ్నార్థకమైన వాణిజ్య యుద్ధాలను నివారించేందుకు అమెరికా చొరవతోనే ఏర్పడిన కొన్ని ఆర్థిక సంబంధాల వ్యవస్థలు, అంతర్జాతీయ ఒప్పందాలు ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంతో కుప్పకూలిపోయి ఆర్థిక అరాచకం చోటు చేసుకునే ప్రమాదం ఉంది.

అమెరికా ప్రపంచాధిపత్య కాంక్షకు అంతర్జాతీయ సమాజం వైషమ్యాల సుడిలోకి జారిపోతోంది. చైనా, ఈయూ, రష్యా సామ్రాజ్యవాద కూటమితో భౌగోళిక ఆధిపత్యం నిలబెట్టుకునేందుకు మాజీ అగ్రరాజ్యంగా మిగిలిన అమెరికా చేస్తున్న ఆర్థిక, రాజకీయ, ప్రచ్ఛన్న యుద్ధం వంటి ప్రపంచ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచంలో రెండవ అతిపెద్ద వ్యవస్థగా వున్న చైనాతో వాణిజ్య యుద్ధం వల్ల అమెరికాకే నష్టం వాటిల్లుతుందని ఆర్థికవేత్తలు, వాణిజ్య విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అమెరికా చేపడుతున్న చర్యలకు ప్రతీకారంగా ఇతర దేశాలు అమెరికా ఎగుమతులపై సుంకాలు పెంచితే దాని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉంటుంది. సుంకాల పెంపు ద్వారా ప్రత్యర్థి దేశాలను దెబ్బతీసినట్టు భావిస్తున్న ట్రంప్‌కు, పెంపు వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరిగి అంతర్జాతీయ విపణిలో అమెరికా సరుకులు ఇతరులతో పోటీపడలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలియడం లేదు. అమెరికాలోని ఆయిల్ కార్పొరేట్ లాబీ సహాయ, సహకారాలతో గద్దెనెక్కిన ట్రంప్ ఆటోమొబైల్ కార్పొరేట్ లాబీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందువల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. డబ్ల్యూటీవోలో భారత్‌పై ఫిర్యాదు చేయడమూ ట్రంప్ వాణిజ్య వ్యూహంలో అంతర్భాగమే. రీగన్, థాచర్ ప్రపంచీకరణ విధానాలు బడుగు, వర్ధమాన దేశాల మూలుగులను దశాబ్దాలుగా పీల్చివేశాయి. ఒకప్పుడు ప్రపంచీకరణను బలవంతంగా వెనకబడిన దేశాలపై రుద్దడం జరిగితే, నేడు ఆ దేశాలు స్వచ్ఛందంగా ప్రపంచీకరణకు అనువుగా తమ విధానాలను మార్చుకుని అంతర్జాతీయ విపణిలో వాటాకోసం వెంపర్లాడుతున్నాయి. గతంలో వాణిజ్య యుద్ధాలు ప్రత్యేక కారణాల రీత్యా రెండు ప్రపంచ యుద్ధాలుగా పరిణమించడంతో ప్రపంచ మానవాళి ఎదుర్కొన్న మృత్యు అనుభవం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది.



మంచిమాట



'పూర్తి అంకితభావమంటే పూర్తిగా కష్టపడటం కాదు. అది పూర్తిగా నిమగ్నమవడం.'

- అబ్దుల్ కలాం

ఇక ప్రాంతీయ పార్టీలదే పైచేయి!



జి. రాజశుక

సచేతన

> ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా ఉండబోతోంది? ఇది బీజేపీకి ఆందోళనకర అంశమే. ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీకి ఓ ప్రాంతీయ పార్టీ గట్టి పోటీ ఇవ్వవచ్చు. అటువంటి ప్రాంతీయ పార్టీతో కాంగ్రెస్ చేతులు కలిపినా ఆశ్చర్యపోనక్కర లేదు. ఇదే జరిగితే, మోదీ ప్రభుత్వాన్ని కాపాడేవారే ఉండరు. 2019 ఎన్నికల్లో బీజేపీకి గట్టి దెబ్బే తగిలే అవకాశం ఉంది. ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ ఒకవైపు, ప్రాంతీయ పార్టీల కూటమి మరోవైపు మోహరించడం ఖాయం. దేశమంతా బీజేపీ వ్యతిరేక ఓటు సంఘటితమవుతోంది.

ఇటీవలి కాలంలో ప్రాంతీయ పార్టీలతో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వ్యవహరిస్తున్న తీరు దేశ ఫెడరల్ వ్యవస్థ అసలు స్వరూపాన్ని బయట పెడుతోంది. బీజేపీ వంటి జాతీయ పార్టీ రానురానూ ఒంటరిదై పోతుండగా ప్రాంతీయ పార్టీలు ఒకే తాటి మీద నడవడానికి కొత్త మార్గం వెతుక్కుంటున్నాయి. ఒక్క ప్రాంతీయ పార్టీలనే కాదు, బీజేపీకి తాను నాయకత్వం వహిస్తున్న నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ)ను అజమాయిషీ చేయడం కూడా ఏమాత్రం సాధ్యం కావడం లేదు. ఇదివరకు శివసేన, ఇప్పుడు దీర్ఘకాల మిత్రపక్షం తెలుగుదేశం పార్టీ దూరమైపోయాయి. మరో ఏడాదిలో జరగబోయే ఎన్నికల్లో తాను ఒంటరిగా విజయం సాధించగలనని బీజేపీ గట్టి ధీమాతో ఉంటే తప్ప మిత్ర, భాగస్వామ్య పక్షాల పట్ల ఇంతటి నిర్లక్ష్యం సాధ్యం కాదు.

ఎన్‌డీఏ నుంచి బయటికి వచ్చేయడమే కాకుండా, ఎన్‌డీఏ ప్రభుత్వం మీద పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు కూడా ఇస్తామంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని చిన్న రాజకీయ పరిణామంగా తీసిపారేయకూడదు. ఓ జాతీయ పార్టీకి, ప్రాంతీయ పార్టీలకు మధ్య దీర్ఘకాలంగా రగులుతున్న శత్రుత్వానికి పరాకాష్ఠగా భావించాల్సి ఉంటుంది. ప్రాంతీయ పార్టీలను పరిగణనలోకి తీసుకోకపోయినా, దేశ ఫెడరల్ తత్వాన్ని బేఖాతరు చేసినా, ప్రాంతీయ పార్టీలు ఎదురుదాడికి దిగడం ప్రజాస్వామిక దేశంలో అత్యంత సహజ పరిణామం. ప్రస్తుతం భారత రాజకీయ రంగంలో అటువంటి పరిణామమే చోటు చేసుకుంటోంది.

బీజేపీకి ఎదురు తిరగడం లేదా తిరుగుబాటు చేయడం తప్ప టీడీపీ వంటి దీర్ఘకాల మిత్రపక్షానికి మార్గం లేకుండా పోయింది. రాష్ట్ర విభజన సమయంలో చేసిన వాగ్దానాలను నెరవేర్చడంపై బీజేపీ నుంచి సహాయ సహకారాలు గానీ, కనీస స్పందన గానీ లేకపోవడంతో బీజేపీపై ఎదురుదాడి తెలుగుదేశం పార్టీకి తప్పనిసరైపోయింది. తమ ప్రాంతం, తమ రాష్ట్రం, తమ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి కనీస బాధ్యత. అయితే, బీజేపీ ఆకాంక్షలు, ఆశలు, లక్ష్యాలు వేరు. బీజేపీ, టీడీపీల ఆకాంక్షలు ఎక్కడా కలిసేలా కనిపించడం లేదు. అందుకని విడాకులు తప్పలేదు.

ప్రాంతీయ కూటమి సిద్ధం

ప్రత్యేక హోదా, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ, రెవెన్యూ లోటు భర్తీ వంటి అంశాలపై తెలుగుదేశం పార్టీ బీజేపీ ప్రభుత్వంపై పోరాటం సాగిస్తున్న సమయంలోనే మరికొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా కేంద్రంపై ధ్వజమెత్తడం ప్రారంభించాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, అక్కడి బహుజన్ సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి, ఒడిశా



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, శివసేన పార్టీ నాయకుడు ఉద్ధవ్ థాకరే, మరికొందరు ప్రాంతీయ పార్టీ నాయకులు తమతమ ప్రాంతీయ వైఖరులతో కేంద్రం వైఖరిని దుయ్యబట్టడం మొదలుపెట్టాయి. తమకు దేశమంతా ముఖ్యమనేది బీజేపీ నినాదం కాగా, తమ రాష్ట్రాలే తమకు ముఖ్యమని ప్రాంతీయ పార్టీల నాయకులు తేల్చి చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా డిమాండ్‌ను ప్రధాన అస్త్రంగా చేసుకుని, వివిధ రాజకీయ పక్షాలు తమ సైద్ధాంతిక, వ్యక్తిగత విభేదాలను కూడా పక్కన పెట్టి ఒక్క తాటి మీద నడవడం 2019లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రత్యేక హోదా డిమాండ్ మీద కాంగ్రెస్, టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లు సైతం చేతులు కలపడం చూస్తే ఎన్నికల ముందు నాటికి ఎన్ని పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా చేతులు కలపబోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతానికి ఏ ప్రతిపక్షమూ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరగాలని కోరుకోవడం లేదు కానీ, అవిశ్వాస తీర్మానం మీద మాత్రం దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. నిజానికి, ఇప్పుడున్న సంఖ్యాబలాన్ని బట్టి ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానం నెగ్గే అవకాశం కూడా లేదు.

అయితే, ప్రతిపక్షాలు క్రమక్రమంగా ఐక్యం అవుతూ ఉండడం పాలక పక్షాన్ని ఇరుకున పెడుతోంది. ప్రతిపక్షాలు, ప్రాంతీయ పార్టీలు ఇదేవిధంగా చేతులు కలిపితే, ఎన్‌డీఏ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమనే సందేశం కూడా పాలకపక్షానికి చేరినట్టే భావించాలి. సుమారు మూడు దశాబ్దాల క్రితం ప్రతిపక్షాలన్నీ ఇదేవిధంగా ఒక్కతాటి మీద నడిచాయి. మితవాద, అతివాద పక్షమనే తేడా లేకుండా దాదాపు ప్రతి పార్టీ వీపీ సింగ్‌ను నాయకుడుగా అంగీకరించి అప్పటి పాలకపక్షం కాంగ్రెస్‌ను చిక్కుల్లో పడేశాయి. దాంతో దేశంలో ప్రాంతీయ పార్టీలు తప్ప జాతీయ పార్టీ అంటూ లేకుండా పోయింది. ప్రాంతీయ పార్టీలు గొంతెత్తాయి. జాతీయ పార్టీలకు నోరు పడిపోయింది. ఇప్పుడూ అదే జరగబోతోంది. బీజేపీ శత్రువులంతా ప్రాంతాల వారీగా, రాష్ట్రాలవారీగా మిత్రపక్షాలను కూడగట్టుకుని, బీజేపీని దెబ్బతీసేందుకు కాచుకు కూర్చున్నాయి. అవన్నీ జాతీయ స్థాయిలో ఆలోచిస్తూండవచ్చు. కానీ, వాటి కార్యకలాపాలు మాత్రం వాటి ప్రాంతాలకే పరిమితం.

కాంగ్రెస్ పార్టీ హస్తం

విచిత్రమేమిటంటే, బీజేపీ తరహా రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రాంతీయతత్వం కూడగట్టుకోవడానికి పరోక్షంగా కారణమైంది మరో జాతీయ పక్షమైన కాంగ్రెస్ పార్టీయే. త్వరలో ఎన్నికలు జరగబోతున్న కర్ణాటకను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీయే వివిధ రాజకీయ పక్షాలు ఒకతాటి మీదకు రావడానికి కారణమైంది. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ తానొక జాతీయ పక్షమనే విషయం మరచిపోయి వ్యవహరిస్తోంది. రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య క్రమంగా తమ రాష్ట్ర ప్రయోజనాలకే పరిమితమైపోయారు. తానొక ప్రాంతీయ పార్టీ నాయకుడినన్నట్టు వ్యవహరిస్తున్నా ఆయనను సరిదిద్దే పనిని పార్టీ అగ్రనాయకత్వం చేపట్టలేదు. ఆయన తమ సొంత పతాకాన్ని సృష్టించుకున్నారు. తమ లింగాయత్ విశ్వాసాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలని పట్టు బట్టారు.

మొత్తానికి మళ్లీ ప్రాంతీయతత్వమే ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఎన్నికలు జరిగేలోగా ఇంకా ఎటువంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించలేం. దేశంలోని ప్రతి రాష్ట్రానికీ తమ ప్రయోజనాలే ముఖ్యమైపోతున్నాయి. బీజేపీ భాగస్వామ్య పక్షమైన నితీశ్‌కుమార్ పార్టీ కూడా ప్రస్తుతానికి గోడ మీద కూర్చుని ఉండొచ్చు కానీ, ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల కూటమి వైపు దూకడానికే అవకాశం ఎక్కువగా ఉంది. ఎందుకంటే రాష్ట్రమే ముఖ్యం అనే ప్రాంతీయ పార్టీల తత్వంతో బీజేపీ ఏకీభవించే అవకాశమే లేదు. అటు దేశమూ కావాలి, ఇటు రాష్ట్రమూ కావాలి అనుకుని బీజేపీ కూటమిలో కొనసాగాలంటే అందుకు ఎంతో రాజకీయ చాతుర్యం అవసరం ఉండాలి.

ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా ఉండబోతోంది? ఇది బీజేపీకి ఆందోళనకర అంశమే. ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీకి ఓ ప్రాంతీయ పార్టీ గట్టి పోటీ ఇవ్వవచ్చు. అటువంటి ప్రాంతీయ పార్టీతో కాంగ్రెస్ చేతులు కలిపినా ఆశ్చర్యపోనక్కర లేదు. ఇదే జరిగితే, మోదీ ప్రభుత్వాన్ని కాపాడేవారే ఉండరు. 2019 ఎన్నికల్లో బీజేపీకి గట్టి దెబ్బే తగిలే అవకాశం ఉంది. ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ ఒకవైపు, ప్రాంతీయ పార్టీల కూటమి మరోవైపు మోహరించడం ఖాయం. దేశమంతా బీజేపీ వ్యతిరేక ఓటు సంఘటితమవుతోంది. 2014 ఎన్నికల్లో మాదిరిగా కేవలం ముప్పయ్ ఒక్క శాతం ఓటుతో అధికారంలోకి రాగలమని బీజేపీ భావిస్తే పప్పులో కాలేసినట్టే. బీజేపీ ఈసారి అంతకన్నా ఎక్కువ శాతం ఓట్లు సంపాదించగలగాలి.

ఆశల పల్లకిలో ఎన్నిక(ల్ల)ల బడ్జెట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఆర్థికశాఖమంత్రి ఈటెల రాజేందర్ 2018-19 సంవత్సరానికి భారీ వార్షిక బడ్జెట్ 1,74,453.83 కోట్ల రూపాయలతో గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ధనిక రాష్ట్రం పేరుతో లేని ఆదాయాన్ని వస్తుందన్నట్లు చూపించి ప్రజలను మరోసారి దగా చేయబూనుకుంది. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మొదటి మూడు బడ్జెట్‌లో ఏ ఒక్క దానిలోనూ 80 శాతానికి మించి నిధులను ఖర్చు చేయలేకపోయింది. ఇక నాలుగవ బడ్జెట్ 2017-18లో ఇప్పటివరకు కేటాయింపుల్లో 70 శాతం మాత్రమే ఖర్చు చేసింది. ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయానికి ఎప్పుడూ లేని విధంగా రూ.12,734 కోట్లు, దళితులకు రూ.12,708 కోట్లు, దళితుల సబ్‌ప్లాన్‌కు రూ.16,452 కోట్లు, గిరిజనులకు బడ్జెట్ కింద రూ.8063 కోట్లు, సబ్‌ప్లాన్ కింద రూ.9,693 కోట్లు కేటాయింపులు చేసింది. ఈ కేటాయింపులు చూస్తుంటే ఆయా వర్గాల ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించడం సహజం. కానీ, గత బడ్జెట్ వ్యయాలను పరిశీలిస్తే వ్యవసాయ రంగం, దళిత, గిరిజనులు, వెనుకబడిన తరగతులవారు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చేసిన కేటాయింపులు ఖర్చు కాలేదని తెలుస్తోంది. వ్యవసాయ ఉత్పత్తి రేటు దినదినం కునారిల్లుతున్నది. 115 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నది. కానీ ఏనాడూ 93 లక్షల టన్నులు దాటలేదు.

నాలుగేళ్ళుగా కేజీ టూ పీజీ విద్య ఉచితంగా అందిస్తామని ఊరించడమే తప్ప సాధించింది పరిమితమే. ఈసారి కూడా విద్యకు కేటాయించిన నిధులు బడ్జెట్లో 10 శాతం లోపే. పాఠశాల విద్యకు 10,830 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2448 కోట్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు రూ.2.823 కోట్లు. ఇక ఉద్యోగుల వేతన సవరణ ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. అంటే ఎన్నికలు ముగిసేవరకు ఉద్యోగుల వేతన సవరణ వైపు అడుగులు పడవన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు బడ్జెట్‌లో రూ.29వేల కోట్లు ద్రవ్య లోటు ప్రతిపాదించారు. ఇది ప్రజలపై పన్నుల భారం మోపడం ద్వారా పూడ్చుకుంటారా? లేక ఇప్పటికే రెట్టింపైన అప్పులకు తోడు మరిన్ని అప్పులు చేస్తారా? అన్న ప్రశ్నకు జవాబు లేదు. ఆర్థిక మంత్రి చెప్పిన లెక్కల ప్రకారం ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు కేవలం 27,588. రాష్ట్రానికి కొత్తగా 3,700 పరిశ్రమలు వచ్చాయన్నారు. అయితే ఎంతమందికి ఉపాధి లభించిందన్నది అసలు సమస్య. ఎన్నికల ముందు ఏడాది కావటంతో దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇల్లు, యువతకు ఉపాధి, వ్యవసాయానికి సాగు నీరు, కేజీ టూ పీజీ ఉచితవిద్య వంటి గత ఎన్నికల నాటి వాగ్దానాలు నెరవేర్చలేకపోయిన పాలకులు సంక్షేమం వైపు ప్రజల దృష్టి మళ్లించేందుకు తీవ్ర కసరత్తు చేశారు. రూ.1,71,453 కోట్ల బడ్జెట్ అంచనా వ్యయంతో ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర సొంత ఆదాయం రూ.73,751.88 కోట్లుగా, కేంద్రం నుంచి వచ్చే నిధులు రూ.29,041.88 కోట్లుగా అంచనా వేశారు. అంటే బడ్జెట్ వ్యయం-ఆదాయం మధ్య రూ.71.660 కోట్ల వ్యత్యాసం ఉంది. కోటి ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా 23 మేజర్, 13 మీడియం ఇరిగేషన్



ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేబట్టిన ప్రభుత్వం, ఈ బడ్జెట్ గతంలోవలె భారీగా రూ.28 వేల కోట్లు కేటాయించింది. గత నాలుగేళ్లుగా కేటాయించిన మొత్తంలో ఖర్చు చేసింది కేవలం 63శాతం మాత్రమే. పైగా రీడిజైన్ పేరుతో ప్రాజెక్టుల అంచనా వ్యయం రెట్టింపు అయింది. అంచనా వ్యయం పెరుగుతూ, ఖర్చు పెట్టేది తగ్గింది. ఈ ఒక్క సంవత్సరంలో కేటాయించిన మొత్తం ఖర్చుచేసినా సాధించే ఫలితం నామ మాత్రమే. కోటి ఎకరాలకు నీరు నినాదం కలగానే మిగిలింది. రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ పెట్టుబడి అనే వినూత్న పథకాన్ని మొదటిసారి ప్రారంభించింది. ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు రూ.8 వేలు ఉచితంగా అందజేసే ఈ పథకానికి రూ.12వేల కోట్లు కేటాయించారు. అలాగే రైతులకు బీమా పథకం కింద ప్రీమియం చెల్లించేందుకు రూ.500 కోట్లు కేటాయించారు. వ్యవసాయరంగానికి కేటాయించిన పెట్టుబడి సాయం తీసేస్తే వ్యవసాయరంగ అభివృద్ధికి మిగిలింది స్వల్పమే.

సంక్షేమ రంగానికి వస్తే, అసరా పెన్షన్‌ను బోదకాలు బాధితులకు కొత్తగా విస్తరించారు. 41,78,291 మందికి అసరా పథకం కింద ప్రభుత్వం రూ.5300 కోట్లు వెచ్చిస్తున్నది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి ఆకర్షణీయ పథకాలతో పేద ఆడపిల్లల వివాహాలకు, గర్భిణిలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. సంక్షేమం గురించి పెద్దపెద్ద మాటలు చెప్పారు. కేటాయింపులూ పెంచి చూపారు. కానీ బడ్జెట్ కేటాయింపుల్లో మొదట కత్తెర పడేది సంక్షేమ రంగానికే కావటం గమనించాలి. గత నాలుగు సంవత్సరాలలో దళితులు, గిరిజనుల కోసం చేసిన బడ్జెట్ కేటాయింపులుగానీ, సబ్‌ప్లాన్ నిధులు గానీ ఖర్చుచేసిన తీరు గమనిస్తే ఇదే అర్థమవుతున్నది. కేటాయించిన నిధులలో సగం కూడా ఖర్చు చేయలేదు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రత్యేక ప్రగతి నిధిని ఏర్పాటు చేసింది. దళితులకు మూడెకరాల భూమి పంపిణీ గత నాలుగేళ్ళుగా 4,939 లబ్ధిదారులకు 12,745 ఎకరాల భూమి పంపిణీ చేశారు. ఇది సముద్రంలో కాకిరెట్టలా ఉంది. రాష్ట్ర రుణభారం మార్చి 2018 నాటికి 1,51,133.21 కోట్లు ఉంది. ఈ అప్పులు మార్చి 2019 నాటికి 1,80,238 కోట్లకు పెరగనుందని ప్రభుత్వం అంచనా వేసింది. బడ్జెట్‌లో కూడా మార్కెట్ రుణాలు కేంద్ర రుణాలు కలిపి 32,300 కోట్లు తెస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టిన దగ్గర నుంచి ఇప్పటికి లక్షా 20 వేల కోట్ల రుణభారం పెరిగింది. కానీ ఆ తెచ్చిన రుణంతో స్థిరాస్తుల సంపాదన కానీ, ఉత్పత్తి రంగ అభివృద్ధి కానీ జరగడంలేదన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాలి. ఇరిగేషన్‌కు కేటాయించిన 25వేల కోట్లు కాకుండా బడ్జెట్‌లో చూపకుండా బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తెచ్చే వ్యయం చేస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసినా, ప్రజలకు ఉపాధి, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు సాగునీటి వనరులు కల్పించడంపై కేంద్రీకరించాలి. కానీ, అనుత్పాదక రంగంపై రుణాన్ని వ్యయం చేస్తున్నారు. విద్య, వైద్య, సంక్షేమ రంగాల కంటే పోలీసుశాఖ మీద మాత్రం ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఆధునీకరణ, సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లు, వాహనాలు కొనుగోలు, ఆధునిక సాంకేతిక పరికరాలు అందించటంలో ప్రత్యేకశ్రద్ధ పెట్టింది. పోలీసుశాఖను పటిష్ఠ పరిచింది. ఇవన్నీ చేసింది నేరాలు అదుపు చేయడానికే అనుకుంటే పొరపాటే. ఆర్థికమంత్రి అట్లా చెప్పుకున్నప్పటికీ నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో లెక్కల ప్రకారం ఈ కాలంలో నేరాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. ప్రజాఉద్యమాల మీద ఉక్కుపాదం మోపటంలో, ప్రతిపక్షాల, నిరసనకారుల, ఉద్యమకారుల గొంతునొక్కడంలో మాత్రం ప్రభుత్వం ముందుంది. ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ రుణాలకూ వెంపర్లాడుతోంది. ఇప్పటికే వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ. 600 కోట్లు తెచ్చారు. మరో 2లక్షల కోట్లకు దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంక్ షరతులను పాటించడం వల్ల ఇప్పటికే దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది. 1,80,000 కోట్ల అప్పుతో బంగారు తెలంగాణ ఎలా తేగలరు? మొత్తంగా బడ్జెట్‌ను గమనిస్తే ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఉండకపోవడం, కేటాయించిన నిధులలో కోత విధించడం, భారీ అంకెలు ప్రకటించి మాయ చేయడానికి ప్రయత్నించడం, వర్తమానానికీ, భవిష్యత్‌కు అనర్థదాయకమైన అప్పుల ఊబిలోకి దించడం, ఆర్థిక నిర్వహణ, ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనా వంటివి తిరోగమన చిహ్నాలే. దాన్ని ఎదిరించలేని ప్రగతిశీల శక్తుల బలహీనత ఒక విషాదం.

ఎ.నర్సింహారెడ్డి

'సంచార' ఉపకులాలను బీసీలుగా గుర్తించాలి

మన లేఖ

వెనుకబడిన తరగతులలో సంచార జాతుల (యంబీసీలు) బతుకులకు సామాజిక న్యాయం అందడం లేదు. సంచార జాతులలో ఇప్ప టికీ 30 ఉపకులాలకు గుర్తింపు ఇవ్వబడలేదు. వారు బీసీల్లో ఏ గ్రేడ్‌కు చెందినవారో అనేది ప్రశ్నార్థకంగా ఉన్నది. భిక్షాటన చేస్తూ జీవనో పాధి పొందుతున్న వీరిని బీసీల్లో ఉపకులాలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే సమాజం పట్ల అవగాహన చేసుకుంటున్న యువత భవిష్యతేమిటి అనే ఆవే దనలో వున్నారు. కరీంనగర్‌లో యంపీ వినోద్ కుమార్ ఈ 30 ఉపకులాలను యంబీసీ కింద చేర్చాలని బిఎస్ రాములుకు (బీసీ కమిషన్) లేఖ రాశారు. యంబీసీలకు బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. యంబీసీలో ఉన్న అనేక ఉపకులాలను ఇప్పటికి గుర్తింపు లేదనే విషయాన్ని గమనించాలి. నిరుపేద సంచారజాతుల ఉపకులాలకు సంబంధించినదైనందున యంబీసీ, బీసీ నాయకుల ప్రత్యేక సమావేశమేర్పాటు చేసి ఇలాంటివి తప్పిపోయినవి ఎన్ని ఉన్నయో విశ్లేషించి వాటిపైన సముచితమైన నిర్ణయం తీసుకోవడం సబబుగా వుంటుంది. కానీ యంబీసీలో ఉన్న అనేక ఉపకులా లను ఇప్పటికి గుర్తింపు లేదనే విషయాన్ని గమనించాలి. ఈ ఉపకులాలను చట్టబద్ధంగా గుర్తించాలని కోరుతున్నాను. మానవతా దృక్పథంతో సంచార జాతులలోని 30 ఉపకులాలను చట్ట బద్ధంగా గుర్తించి యువత భవిష్యత్‌కు తోడ్పడాలని సీఎం కేసీఆర్‌ను కోరుతున్నాను.

- చాడ వెంకటరెడ్డి,
సిపిఐ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి



జంతువులతో జలక్రీడలు

రిలాక్స్

జంతువులతో స్నేహం మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందన్న విషయం శాస్త్రీయంగా నిరూపితమైంది. అయితే అలసిసొలసిన మనసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు కొన్ని జంతువులు తమ స్నేహహస్తాన్ని అందిస్తున్నాయి. జంతువులతో జలకాలాట మనిషికి తీరుబాటును, మానసికంగా మరింత ఉత్సాహాన్ని అందిస్తున్న సత్యాన్ని పసిగట్టి ప్రపంచంలో కొన్ని చోట్ల ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. జంతువులతో కలిసి ఈతకొట్టడం అంటే ఏదో మచ్చిక చేసుకుంటే మనతో ఆడిపాడే పెంపుడు జంతువులనుకుంటున్నారా? ససేమిరా కాదు, ఇది కాస్త విభిన్నమైన జలకాలాట. ఇలాంటి సరదాలు తీర్చుకోవాలనుకుంటే మాత్రం మీ తీరుబాటు సమయమంతా స్విమ్ సూట్స్‌తో, ఫ్లిప్పర్లతో, అండర్‌వాటర్ కెమెరాతోనే గడపాల్సి ఉంటుంది.

పందులతో...

బహమాస్‌లోని గ్రాండ్ ఎక్సుమా ద్వీపంలో జలకాలాట కోసమే పెంచిన ప్రత్యేకమైన పందులు ఉంటాయి. అక్కడ ఇలాంటి పందుల బీచ్ కూడా ఉంటుంది. అలాంటి మాంఛి పందుల బీచ్‌ను ఎంపిక చేసుకుంటే ఇదిగో ఇలా పందులతో సముద్ర జలాల్ని తరింపజేయవచ్చు.

గుర్రాలతో...

సాధారణంగా గుర్రాల్ని పందేలకి వాడడం రివాజు. అలా రేసుల్లో పరుగెత్తి, పరుగెత్తి అలసి పోయిన గుర్రాల్ని ఇక రేసులకు ఉపయోగించకుండా వదిలేస్తారు. అలాంటి గుర్రాల్ని మేపడం, వాటిని పోషించడం అనవసరపు ఖర్చు అని భావించినపుడు వాటిని కాల్చి చంపేస్తుంటారు. ఇలా గుర్రప్పందేల నిర్వాహకుల కర్కశత్వానికి బలైపోతున్న గుర్రాల్ని జీవకారుణ్య దృష్టితో రక్షించి, సముద్ర జలాల వెంట స్వారీల కోసం వినియోగిస్తుంటారు. జమైకాలోని సముద్ర తీరాల్లో ఇలాంటి దృశ్యాలు విరివిగా కనిపిస్తుంటాయి.

తిమింగలాలతో...

పాలినీసియా రాజధాని టోంగాలోని వవావ్, హాపయి అనే ద్వీపాల్లో ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా79 వేల పౌండ్ల బరువు, 52 అడుగుల పొడవు ఉండే తిమింగలాలు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తాయి. తమ తీరుబాటు సమయాన్ని కాస్త సాహసికంగా గడపాలనుకునే వారిని ఈ తిమింగలాలు ఎక్కువగా కనిపించే ప్రాంతాలకు తీసుకు వెళ్ళి వారి ముచ్చటను తీరుస్తుంటారు స్థానిక జాలర్లు.



డాల్ఫిన్లతో...

సాధారణంగా డాల్ఫినేరియం అనే ఆక్వేరియం వంటి ఏర్పాటు ఉన్నప్పుడు డాల్ఫిన్లతో కలిసి ఆటలాడుకోవడం అందరికీ తెలిసిన విషయమే. కానీ ఈజిప్టులో జంతుప్రేమికులకు దీనికి కాస్త భిన్నంగా సహజమైన సముద్ర జలాల్లో డాల్ఫిన్లతో ఈతలాడే అవకాశం దొరుకుతుంది. షర్మ్ అల్ షేక్ అనే ప్రాంతంలో సినాయ్ ద్వీపకల్పంలో పెంపుడు డాల్ఫిన్లతో కాకుండా, సముద్రజలాల్లో పుట్టి, పెరిగిన డాల్ఫిన్లతో కలిసి జలకాలాడవచ్చు.

సోఫా మీద వన్యసౌందర్యం

కాన్వాస్





మనుషులు సేద తీరాలంటే నలుగురు కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు. ఇంట్లోనే ఏ కుర్చీ మీదో, సోఫా మీదో ఒరిగిపోతారు. కానీ జంతువులు ఎలా సేద తీరుతాయి? జంతువులు కూడా మనుషుల్లాగా సోఫాల్లో సేద తీరితే ఎలా ఉంటుంది? అడవుల్లో స్వేచ్ఛగా తిరిగే వన్యమృగాలు మన ఇంట్లో మనలాగే, మనతో కలిసి, మన సోఫాల్లో సేద తీరితే ఎలా ఉంటుంది.., ఇలాంటి ఆలోచనతోనే దక్షిణాఫ్రికా, కేప్‌టౌన్‌కు చెందిన చిత్రకారిణి డెజీరీ స్మిత్ కొన్ని పెయింటింగ్స్‌ను చిత్రించారు. ఈ పెయింటింగ్స్‌లో పులి, జీబ్రా, ఖడ్గమృగం వంటి జంతువులు సోఫాల మీద సేద తీరుతున్న భంగిమలో దర్శనమిస్తాయి. దక్షిణాఫ్రికా అడవులు అరుదైన, అందమైన వన్యమృగాలకు పెట్టింది పేరు. కానీ అక్కడ కూడా కొన్ని జీవజాతులు అంతరించి పోతున్నాయి. ఇలా జంతువులు అంతరించి పోకుండా కాపాడాలన్న సందేశాన్ని ప్రపంచానికి వినిపిస్తూ డెజీరీ స్మిత్ 'విమ్సికల్ కలెక్షన్' పేరిట ఈ పెయింటింగ్స్‌ను చిత్రించారు.

అందని ద్రాక్ష

'ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖమెరుగదు' అన్న మాట అంత తేలికైనదేమీ కాదు. అదొక జీవిత సత్యం. సుఖంగా నిద్రించడమన్నది సరైన పదప్రయోగం కాదు, ఆ సుఖం కూడా తెలియని విధంగా, ఆదమరిచి నిదుర పోవడమే నిజమైన నిద్ర. అది నాలుగు క్షణాలైనా సరే, ఆ కునికిపాటే బతుకు పాట. పరుగులు పెడుతున్న ఆధునిక మానవుడికి అందని ద్రాక్షే 'తీరుబాటు'. 'మీకేం తీరి కూర్చుని మాట్లాడుతున్నారు...' అంటూ ఈసడించడం తేలికే, కానీ నిరంతరం వస్తువ్యామోహాల మధ్య, డబ్బు యావ మధ్య పరుగు పెట్టే వాళ్ళకేం తెలుసు 'తీరి కూర్చోవాలంటే...' తీరిక లేని పని వల్లే సాధ్యమవుతుందని?! జీవితంలో మనం మరచి పోతున్న 'తీరుబాటు'ను ఇవాళ మైత్రి మీ ముందుకు తెచ్చింది.

– మీ 'మైత్రి'



కెమెరా

'బస్టాండులో బస్సు కోసం వేచి చూస్తోంది ఆమె. బస్సు ఎప్పట్లాగే ఆలస్యంగా వస్తుందని తెలుసు. ఆ ఎరుకతోనే ఇలా చేతిని తలగడగా చేసుకుని కాసేపు తీరుబాటుగా చిన్నపాటి కునుకు తీసింది. మనమైతే, బస్సు ఎప్పుడొస్తుందో, ఏమిటో అనే కంగారులో కుదురుగా కూర్చో లేం. కానీ గ్రామీణులకు, ముఖ్యంగా మహిళలకు బస్సు ఆలస్యంగా వస్తుందని తెలుసు. ఆదుర్దా పడాల్సిన అవసరం లేదని కూడా తెలుసు. జీవితం మనిషి చేత ఎంత చాకిరీ చేయించినా, అది ఇవ్వాల్సిన తీరుబాటును ఇస్తూనే ఉంటుంది. ఆ జ్ఞానం చదువు కున్న వారికి లేకపోయినా, చదువుతో అవసరం లేని ఇలాంటి జ్ఞానులకు తెలుసు. అందుకే వారికి జీవితమంటే ఆనందమే, దుఃఖంలో కూడా వాళ్ళు ఆ ఆనందాన్ని అందిపుచ్చుకోగలరు. అందుకే వాళ్ళు సామాన్యులు...' అన్నారు ప్రముఖ ఫోటోగ్రాఫర్ కందుకూరి రమేష్‌బాబు. రమేష్ గతంలో రచయిత, జర్నలిస్టు... ఇప్పుడు మాత్రం బతుకు చిత్రాన్ని కెమెరాలో నిరంతరాయంగా బంధిస్తున్న నిత్యపథికుడు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన హైదరాబాద్, మణికొండలోని తన ఫోటోగ్రఫీ గ్యాలరీ 'సామాన్యశాస్త్రం'లో **'ఎవ్వేరి డే ఉమెన్'** అనే పేరుతో ఒక ఫోటోగ్రఫీ ప్రదర్శనను ప్రారంభించారు. మహిళల్ని వారి తాత్విక భూమిక నుంచి అర్థం చేసుకుని, నిత్యజీవితంలో వారి అనుభవాల్ని ఆయన ఈ ప్రదర్శనలో ఫోటోగ్రాఫులుగా ఆవిష్కరించారు. ఈ ఫోటోగ్రాఫుల్లో గ్రామీణ మహిళల జీవితంలోని 'తీరుబాటు' ఆకర్షణీయంగా ప్రతిఫలించింది. ఈ సందర్భంగా 'మైత్రి' రమేష్‌బాబును పలకరించింది.



'తీరుబాటు' ఒక జీవలక్షణం



- ఫోటోగ్రాఫర్ కందుకూరి రమేష్‌బాబు

కందుకూరి రమేష్ బాబు రచనలకు, ఫోటోగ్రఫీకి సామాన్యుడే ప్రధాన వస్తువు. ఆయన 2003లో ఒక ప్రముఖ తెలుగు దినపత్రికలో 'సామాన్యశాస్త్రం' అనే శీర్షికతో సామాన్యుణ్ణి ప్రపంచానికి పరిచయం చేసే అసామాన్యమైన పనిని ప్రారంభించారు. ఫోటోగ్రఫీ ఆయనకు అత్యంత ఇష్టమైన విషయం. జర్నలిస్టుగా ఆయన ప్రారంభించిన సామాన్యశాస్త్రం శీర్షికకు లభించిన ఆదరణ తదనంతర కాలంలో ఆయన మరిన్ని రచనలు చేసేందుకు ప్రోత్సహించింది. 'కోళ్ళ మంగారం' రమేష్ రచనల్లో ఎన్నదగింది. రమేష్ తన 'సామాన్యశాస్త్రం'గ్యాలరీలో ప్రారంభించిన తాజా ప్రదర్శనను చూడడానికి నేను అక్కడికి వెళ్ళాను. ఒక్కో ఫోటోను చూపుతూ, దానికి ఆయన ఇచ్చిన వివరణ నన్ను కట్టి పడేసింది. ఒక జర్నలిస్టుగా ఆయనను మైత్రి కోసం ఇంటర్వ్యూ చేయాలన్న నా ప్రయత్నాన్ని నేనే మరచి పోయాను. తన ఫోటోగ్రఫీ ప్రస్థానం గురించి రమేష్ ఎంత మనోల్లాసంగా చెప్పారంటే, ఆయన్ను ప్రశ్నించాల్సిన అవసరమే ఎదురు కాలేదు. రమేష్ అనుభూతులు, జ్ఞాపకాల ప్రవాహాన్ని ఆయన మాటల్లోనే విందాం.

'రచయిత కావాలనే భావన బలంగా ఉండడంతో జర్నలిస్టునయ్యా. 'సామాన్యశాస్త్రం' శీర్షికతో నేను రాసిన వ్యాసాలు పాఠకాదరణను పొందాయి. నాకు చాలా సంతోషం కలిగింది. నేను రచించిన 'కోళ్ళ మంగారం' చాలా మంచి పేరు తెచ్చింది పెట్టింది. ఇప్పటికీ నన్ను కోళ్ళమంగారం రచయితగా గుర్తిస్తారు కొందరు. సామాన్యుడైన కోళ్ళ మంగారం జీవిత కథ ఇది. అంతవరకు లబ్ధప్రతిష్ఠులైన వ్యక్తుల జీవితగాథలే పత్రికల్లో వెలువడేవి. కానీ సామాన్యుణ్ణి, అతని జీవితంలోని తాత్విక కోణాన్ని నేను పాఠకులకు పరిచయం చేయదలిచాను. చదువుకున్న ఎగువ మధ్యతరగతి ప్రజలు ఎగువ తరగతి జీవనశైలిని, విలువల్ని అనుకరించడం చూసి నాకు ఏహ్యాభావం కలిగేది. 'పైపైకి ఎగబాకి' సెలబ్రిటీలు కావాలన్న వారి ఆకాంక్షల్లోని డొల్లతనాన్ని నేను బయట పెట్టదలిచాను. అందుకే నేను సామాన్యుణ్ణే నా రచనల్లో సెలబ్రిటీగా మార్చాను.

మా నాన్నగారికి ఒకప్పటి కరీంనగర్ జిల్లా, ఇప్పటి సిరిసిల్లా జిల్లాలోని ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోను, గొల్లపల్లిలోను స్వాతి, జ్యోతి అనే పేర్లతో ఫోటోస్టూడియోలు ఉండేవి. అవి మా చెల్లెళ్ళ పేర్లు. చిన్నప్పటి నుంచి ఫోటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. నేను ఎంఎ చదవడానికి వెళ్ళినపుడు ఇష్టం లేకపోయినా ఫోటోస్టూడియోల్ని మూసివేయాల్సి వచ్చింది. తరువాత చాలా కాలం నేను కెమెరాను ముట్టుకోలేదు. అయితే నేను సామాన్యుణ్ణి కేంద్రంగా చేసుకుని రచించిన కథనాలు అంతర్జాతీయ స్థాయి ఫోటోగ్రాఫర్ రఘురాయ్‌కి నచ్చడంతో, ఆయన జీవితగాథను రచించే అవకాశం దక్కింది. ఆయనే నాకు గురువుగా మారిపోయారు. ఆయన తన ఫోటోగ్రఫీలో భారతీయ జీవనశైలిని చూపుతూ సగటు మనిషి జీవితాన్ని తన కెమెరాల్లో బంధించే వారు. ఢిల్లీలో ఆయనతో పనిచేస్తున్న క్రమంలోనే సామాన్యుడి జీవితంలోని చీకటి కోణాల్నే కాకుండా, అతని జీవితంలోని కాంతిమంతమైన కోణాల్ని కూడా ప్రపంచానికి పరిచయం చేయాలని నాకు అర్థమైంది. జీవితం మాత్రమే ప్రధానమైంది, అందులో సామాన్యత అనేది ఎనభై శాతం ఉంటే ఉండవచ్చు గాక, అదే జీవితం కాదని, జీవితాన్ని ఎలాంటి సందేశాలు లేకుండా ఉన్నదున్నట్టు వ్యక్తీకరించడమే నిజమైన కళాకారుని లక్షణం అని నాకు రఘురాయ్ సాంగత్యం వల్ల తెలిసి వచ్చింది. జీవితం సహజంగా, సుందరంగా ఉంటుందని అర్థమైంది. అప్పటి నుంచి సామాన్యుల్ని నా కెమెరా ద్వారా ఆనందకరమైన వ్యక్తులుగా చిత్రీకరించడానికి నేను నడుంబిగించాలని తెలుసుకున్నాను. ఫోటో జర్నలిస్టుగా మారాను. ఇది చిన్న సామగ్రితో మొదలయ్యే పెద్ద ప్రయాణమని నాకు తెలుసు. ఇది నా ఆరో ఫోటోగ్రఫీ ప్రదర్శన. ఫోటోజర్నలిస్టుగా మారిన తరువాత నేను తీసిన ఫోటోల్ని ప్రదర్శించడానికి సుప్రసిద్ధ గ్యాలరీల్ని సంప్రదించాను. కానీ ఆ గ్యాలరీలు సామాన్యుణ్ణి ఫోటోలుగా తీయడం, వాటిని తక్కువ ధరకు అమ్మడం వంటి నా ప్రతిపాదనల్ని అంగీకరించలేదు. అవి ధనార్జనే లక్ష్యంగా ఏర్పాటైన గ్యాలరీలు. అందుకే నేను స్వయంగా గ్యాలరీ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. మిత్రులు, భార్య సహాయ సహకారాల్ని అందించడంతో మూడు లక్షల రూపాయలతో 'సామాన్య శాస్త్రం' గ్యాలరీని ప్రారంభించాను. ఆర్టిస్టుకు స్టూడియో ఉన్నట్టు ఫోటోగ్రాఫర్‌కి గ్యాలరీ ఉండాలని నేను అభిప్రాయ పడ్డాను. ఇలాంటి ఆలోచన ఇదే మొదటిదని నేను సగర్వంగా చెప్పగలను. నా గ్యాలరీకి 365 రోజులు సందర్శకులు వస్తూనే ఉంటారు. నేను ఇప్పటి దాకా 70 నుంచి 80 ఫోటోల్ని అమ్మగలిగాను. ఒక ఫోటోగ్రాఫర్‌గా ఇది నా విజయంగానే భావిస్తున్నాను.



నేను ఫేస్‌బుక్‌లో 'మై సిటీ- మై పీపుల్' శీర్షికన ఫోటోల్ని పోస్ట్ చేస్తుంటాను. దానికి కూడా మంచి ఆదరణ లభించింది. సగటు మనిషి జీవితంలోని సామాన్య గుణానికి నేను వైభవాన్ని కల్పించాను. నా ఫోటోల్లో విశ్రమించిన మహిళల పాదాలు కనిపిస్తాయి, పరిశ్రమించే చేతులు కనిపిస్తా యి. దేహభాషను ఫోటోల్లో పలికిస్తున్నాను. ఫోటోలో ఒక్క వ్యక్తి మాత్రమే కనిపించినప్పటికీ ఆ వ్యక్తి సమష్టి వ్యక్తీకరణకు ప్రతీక అవుతుంది. పిల్లలు, పెద్దలు, మహిళలనే నేను ఎక్కువగా ఫోటోలు తీస్తుంటాను. రోజువారీ జీవితంలోని ఘడియల్ని నా కెమెరాలో బంధిస్తుంటాను. పాలమూరు, నిజామా బాద్‌లతో పాటు పలు తెలంగాణ గ్రామాల్లో నేను పర్యటించాను. తెలంగాణ పల్లె జీవితాన్ని నేను శ్రద్ధగా చిత్రించాను. ఇలా పర్యటిస్తున్నపుడు నాకు తెలంగాణ పల్లె ప్రజల జీవితంలో 'తీరుబాటు'ను చూశాను. సౌందర్య ఆరాధన అన్నది స్త్రీల దగ్గరే లభిస్తుంది. నేను దీన్ని జీవకళ అని అంటాను.

నేను ఈ ప్రదర్శనలో రోజువారీ జీవితాన్ని కెమెరాలో బంధించాను. రోజువారీ జీవితంలో ఏముంటుందీ అని అనిపించవచ్చు. రోజువారీ జీవితంలోనే ముచ్చట ఉంటుంది. ముచ్చట వేరు, సంభాషణ వేరు, ముచ్చట వేరు. ముచ్చట అన్నది భావవ్యక్తీకరణకు సంబంధించింది. పితృస్వామ్య భావజాలం వల్ల మహిళల ముచ్చట్లను 'అమ్మలక్కల ముచ్చట్లు' అంటూ ఎద్దేవా చేయడాన్ని మనం చూస్తుంటాం. వీరి ముచ్చట్లని చులకన భావంతో చూసేది సుప్రసిద్ధుల సమాజమే. వీళ్ళకు ఈ మహిళల ముచ్చట్లలోని తాత్విక జీవనకోణం తెలియదు. వారి ముచ్చట్లలో వృత్తి, ఉపాధి, కుటుంబం, మంచీ చెడు, అన్నీ ఉంటాయి. ముచ్చట్ల ద్వారానే వాళ్ళు అన్నీ తెలుసుకుంటారు. అది వారి 'వాట్సప్'. ముచ్చట్ల పట్ల ఉన్న చులకన భావాన్ని రద్దు చేసేందుకే నేను ఈ ఫోటోల్ని తీశాను. మరో మహిళ బస్టాండులో బస్సుకోసం వేచి చూస్తూ, కాసేపు కునుకు తీస్తున్న ఫోటోని తీశాను. ఈ ఫోటోలో ఆమె గాజులు, చేతి మీది పచ్చబొట్టు వంటి అలంకారాలన్నీ ఎంతో హృద్యంగా ఉంటాయి. మరోచోట ఉగాదినాడు వేపపూతను అమ్మే మహిళను ఫోటో తీశాను. ఆమె నడుమ్మీద చేయి పెట్టుకుని తీరుబాటును అనుభవిస్తుంది. పనిపాటా అన్నవి వారి రోజువారీ జీవితంలో భాగం. తీరుబాటు కోసం వాళ్ళు వసతుల్ని చూసుకోరు. నిలుచుని, కూర్చుని, రోడ్డు మీద ఏ కాసింత చోటు దొరికినా, పరిసరాల్ని పట్టించుకోకుండా వాళ్ళు విశ్రమిస్తారు. గ్రామీణ మహిళల జీవితంలో విశ్రమించడమన్నది ఒక జీవ లక్షణం!'

ఈ ప్రదర్శన రానున్న ఏప్రిల్ 6 వ తారీఖు వరకు ఉంటుంది. మహిళల అనాది సుఖశాంతుల, సుఖదుఃఖాల గొలుసుకట్టు ఈ ప్రదర్శన; .... చూడాలనుకుంటున్నారా...'సెకండ్‌ఫ్లోర్, 8-1-284/ ఒయు/227, అలంకార్ హోటల్ దగ్గర, ఓయూ కాలనీ, మణికొండరోడ్డు, షేక్‌పేట్, హైదరాబాద్- 500008' చిరునామాలోని 'సామాన్య శాస్త్రం' గ్యాలరీని సందర్శించండి.

- పసుపులేటి గీత



సాగును ఉపాధితో అనుసంధానించండి

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తూ పార్లమెంట్ ప్రధాన ద్వారం ముందు నిరసనకు దిగారు. 'ఒకే దేశం.. ఒకే చట్టం', 'జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సాగుకు అనుసంధానించాలి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. అంతకుముందు ఉభయ సభల్లోనూ.. ఎంపీలు ఆందోళను దిగారు. రిజర్వేషన్లను పెంచుకునే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లి పెద్దపెట్టున నినదించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ తమ స్థానాల్లో కూర్చోవాలని లోకసభ స్పీకర్ పలుమార్లు విజ్ఞప్తులు చేసినా.. వారు వెనక్కి తగ్గలేదు. రాజ్యసభలోనూ ఇదే దృశ్యం ఆవిష్కృతమైంది. పార్లమెంట్ ఆవరణలో టీఆర్ఎస్ ఎంపీలు మాట్లాడుతూ.. దేశమంతటా ఒకే రిజర్వేషన్ కోరుతూ రెండు వారాలుగా పార్లమెంట్‌లో నిరసన తెలుపుతున్నా కేంద్రం పట్టించేకోవడం లేదని టీఆర్ఎస్ ఎంపీలు విమర్శించారు. కనీసం పిలిచి మాట్లాడలేకపోయిందని ఆరోపించారు.

అన్నీ రాష్ట్రాలకు ఒకే నీతి ఉండాలని తాము పోరాటం చేస్తున్నామని అన్నారు. తమిళనాడులో రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చుతారని, వేరే రాష్ట్రాల్లో అలా ఎందుకు చేయరని ఎంపీలు ప్రశ్నించారు. రైతులతోపాటే ఉన్నామని, వారికి పెద్ద పీట వేస్తున్నామని బీజేపీ చెబుతోందని.. కానీ ఉపాధి హామీ కింద ఎన్నో అవార్డులు, కోట్ల రూపాయలు వ్యర్థంగా పోతున్నాయని విమర్శించారు. 'వన్ నేషన్, వన్ లా' అనే పద్ధతి అమలు చేయాలని కోరుతూ తాము రెండు వారాలుగా ఆందోళనలు చేస్తున్నామని, కనీసం ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో ఎంపీలు కవిత, కేకే, జితేందర్‌రెడ్డి, బాల్క సుమన్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీపాటిల్ పాల్గొన్నారు.

మద్దతు.. ప్లీజ్!

(మొదటిపేజీ తరువాయి)

బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఆయన కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం హరీశ్ రావు నేతృత్వంలో ఎంపీల బృందం కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, రాధామోహన్ సింగ్‌లను కలిశారు. కందుల కొనుగోలులో కేంద్ర వాటా పెంచాలంటూ కేంద్ర మంత్రులను హరీశ్ రావు కోరారు. శనగల కొనుగోలుకు సంబంధించిన బకాయిల విషయాన్నీ ఈ సందర్భంగా మంత్రికి గుర్తుచేశారు. అనంతరం మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కందుల కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం అందలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. తెలంగాణలో రూ.1400ల కోట్ల కందులు కొనుగోలు చేయగా.. అందులో కేవలం రూ.400ల కోట్లకు మాత్రమే కేంద్రం సహకారం దక్కిందని చెప్పారు. సీఎం కేసీఆర్ బ్యాంక్ గ్యారంటీతో వెయ్యి కోట్ల విలువైన 2.54 లక్షల టన్నుల కందులు కొనుగోలు చేసినట్లు వివరించారు. కేంద్రం కేవలం 75 వేల టన్నుల కందులను కొనుగోలు చేసిందని, దానికి సంబంధించిన డబ్బులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ కందులకు మొత్తంగా 400 కోట్లు రావాల్సి ఉండగా.. 220 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని తెలిపారు. ఇప్పటికి 45 రోజులు గడుస్తున్నా మిగతా 180 కోట్లు విడుదల కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చేస్తున్నారని వివరించారు. ఈ బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేయగా.. మూడు రోజుల్లో నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని హరీశ్ రావు వివరించారు. శనగల కొనుగోలుకు సంబంధించిన బకాయిల విషయాన్ని గుర్తుచేయగా.. వాటిని కూడా విడుదల చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. కాగా, యాసంగి సీజన్ లో మినుములు, పొద్దుతిరుగుడు, పెసర్ల ఉత్పత్తి పెరిగిందని హరీశ్ రావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ పంటలకు మద్దతు ధర కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరామన్నారు. రైతుకు నష్టం కలిగించకుండా తెలంగాణ ప్రభుత్వం అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు.

రివర్స్ నావిగేషన్..

కాళేశ్వరం నుంచి గోదావరి ప్రాణహిత మహారాష్ట్రలో విదర్భ నుంచి సముద్ర ప్రయాణానికి సంబంధించి రివర్స్ నావిగేషన్ అంశంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్లు హరీశ్ రావు పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే ఒక మీటింగ్ పెట్టి చర్చిస్తామని చెబుతూ ఓ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తయారుచేయాలని సూచించారని తెలిపారు. మిషన్ కాకతీయలో భాగంగా 185 కోట్లతో 176 చెరువులకు ప్రతిపాదనలు రూపొందించగా.. వాటిని పరిశీలించి వెంటనే నిధులు మంజూరు చేయాలంటూ గడ్కరీ అధికారులకు ఆదేశాలిచ్చారని చెప్పారు. ఇక ఏఐబీపీలో దేవాదుల ప్రాజెక్ట్‌కు ఆగిపోయిన నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు గడ్కరీ తెలిపారు.

హీటెక్కిన హస్తిన



(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీలోనే ప్రకటించడం.. తెల్లవారిన తర్వాత ఉన్నట్టుండి తామే తీర్మానం పెడుతున్నట్లు తెలపడంతో ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు. చంద్రబాబు సరికొత్త నాటకానికి తెరతీశారని మండిపడిన వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి.. చివరకు తమ బాటలోకే టీడీపీ కూడా వచ్చిందని చెప్పారు. టీడీపీ ప్రవేశపెట్టిన తీర్మానానికి తమ మద్దతు కూడా ఉంటుందని వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు అన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు, టీఎంసీ, బీజేడీ.. ఇలాంటి మరికొన్ని పార్టీలు కూడా జత కలవడంతో కనీసం 50 మంది కావాలనుకున్న చోట 162 మంది మద్దతు లభించింది. దాంతో అసలేం జరుగుతోందని ఒక్కసారిగా జాతీయ మీడియా సైతం ఏపీ రాజకీయాలపై దృష్టి సారించింది. అయితే... అవిశ్వాస తీర్మానం విషయాన్ని స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రస్తావించిన సమయానికి టీడీపీ, టీఆర్ఎస్ తదితర పార్టీలకు చెందిన పలువురు సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ప్లకార్డులతో నిరసన తెలుపుతున్నారు. అవిశ్వాసానికి ఎంతమంది మద్దతు ఉందో తెలుసుకోవాలంటే మీరంతా మీ మీ స్థానాలలోకి వెళ్లాలని ఆమె కోరినా వాళ్లు మాత్రం అక్కడినుంచి కదల్లేదు. దాంతో ప్రస్తుతం సభ అదుపులో లేదని, అందువల్ల సభను సోమవారానికి వాయిదా వేస్తున్నానని ఆమె ప్రకటించడంతో ఇక అవిశ్వాస తీర్మానాల సంగతి అటకెక్కినట్లయింది. దాంతో టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ రెండు పార్టీలూ మరోసారి అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చి, దానిపై ఎట్టి పరిస్థితుల్లోనూ సోమవారం చర్చ జరపాలని కోరాయి.

మరోవైపు, పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం అంశం చర్చకు వస్తే తమ పార్టీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు.

ఇవీ బలాబలాలు..

ఎన్డీయేపై టీడీపీ, వైసీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 9 పార్టీలు పార్లమెంట్‌లో మద్దతుగా నిలిచాయి. కాంగ్రెస్ – 48, శివసేన – 18, సమాజ్ వాదీ పార్టీ – 7, ఆమ్ ఆద్మీ పార్టీ – 4, తృణమూల్ కాంగ్రెస్ – 34, సీపీఐ – 1, సీపీఎం – 9, టీఆర్ఎస్ – 11, ఎంఐఎం – 1, వైసీపీ – 9, టీడీపీ – 17, ఆర్జేడీ – 3, ఎన్సీపీ – 6. ఇలా అవిశ్వాసానికి మద్దతు ఇస్తున్న పార్టీల బలం 168గా వుంది. అవిశ్వాసానికి అన్నాడీఎంకే మద్దతు ఇస్తే బలం 205 కు చేరుకోనుంది. జనతాదళ్ (ఎస్) పార్టీ మద్దతు ఇస్తే 207 కు చేరుకోనుంది. అయినా అప్పటికీ ఎన్డీయేకు మద్దతు దాదాపు 336 అవుతుంది. ఒకవేళ కొంతమంది తటస్థంగా మిగిలినా కనీసం 300 మంది వరకు ఉంటారు.

అనుసరించే వైఖరిని తమ పార్టీ ఎంపీ వినోద్ స్పష్టం చేశారన్నారు.

చక్రం తిప్పిన బాబు

అవిశ్వాస తీర్మానం పేరుతో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ హస్తిన రాజకీయాల్లో చక్రం తిప్పారు. శుక్రవారం ఉదయం అందరూ ఊహించినట్లే ఎన్డీఏ నుంచి బయటకు రావడమే కాక.. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై స్వయంగా అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభలో పార్టీ నేత తోట నరసింహం ఇచ్చిన గంట లోపలే ఆ తీర్మానానికి గట్టి మద్దతు లభించింది. ములాయం సింగ్ యాదవ్, మమతా బెనర్జీ, లాలూ ప్రసాద్, శరద్ పవార్, మాయావతి, ఎంఐఎం, వామపక్షాలతో పాటు పలు చిన్నాచితకా పార్టీల నేతలు కూడా అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చారు. ఏకంగా కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతిచ్చేందుకు సిద్ధమైంది. ఓటింగ్ జరిగితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తామంటూ టీఆర్ఎస్ సైతం ప్రకటించింది. బీజేపీ మిత్రపక్షాలైన అకాలీదళ్, శివసేనలు ఒక దశలో టీడీపీకి మద్దతిచ్చేందుకు సిద్ధం కాగా, బీజేపీ నాయకత్వం చకచకా పావులు కదపడంతో అకాలీదళ్ మౌనం వహించింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ జరిపిన రాయబారాల్లో భాగంగా శివసేన తటస్థంగా ఉండే అవకాశం ఉంది. ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్ (బీజేడీ), తమిళనాడులోని అన్నాడీఎంకేలతో కూడా కేంద్ర బీజేపీ నాయకత్వం సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం.

మా బాటలోనే చంద్రబాబు: జగన్

తాము ముందుగానే అవిశ్వాస తీర్మానం ఇచ్చామని, తమ పార్టీ నుంచి కొనుగోలు చేసిన ముగ్గురు ఎంపీల పదవులను కాపాడుకోవాలనే చంద్రబాబు తాజాగా అవిశ్వాస నాటకానికి తెరతీశారని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే తమ నాలుగేళ్ల పోరాటానికి కృషిగా టీడీపీ తమ బాటలోనే పయనిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అవిశ్వాసం పెడితే వంద మంది సభ్యుల మద్దతు కూడగడతానన్న జనసేనాని పవన్ కల్యాణ్ ఆ విషయం మరిచిపోయి విజయవాడ, గుంటూరు పర్యటనలకే పరిమితమయ్యారని.. అంతే కాక టీడీపీ ఇంత సడన్‌గా అవిశ్వాసం పెట్టడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయినా తమ ఎంపీల మద్దతు మాత్రం అవిశ్వాసానికి ఉంటుందన్నారు. పనిలో పనిగా సోమవారం మరోసారి అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలంటూ తమ ఎంపీలతో స్పీకర్ కార్యాలయానికి మరోసారి నోటీసు పంపారు.

ఫెడరల్ ఫ్రంట్?

జాతీయస్థాయిలో చంద్రబాబు సారథ్యంలో ఫెడరల్ ఫ్రంట్ ఆవిర్భావం కానున్నదని జాతీయ మీడియా పదే పదే కథనాలు ప్రసారం చేస్తోంది. కానీ విశ్వసనీయ సమాచారం మేరకు మూడు నాలుగు నెలలకు ముందు నుంచే చంద్రబాబు కేంద్ర మంత్రివర్గం నుంచి, ఎన్డీఏ నుంచి బయటకొచ్చేందుకు తెరవెనుక భారీ కసరత్తే చేశారని చెబుతున్నారు. మంత్రి పదవులు వదులుకున్నప్పటి నుంచే జాతీయస్థాయిలోని ప్రతిపక్ష ప్రముఖులతో నిత్యం టచ్‌లోకి వెళ్లేవారని, ఎప్పటికప్పుడు వ్యూహాన్ని మార్చుకున్నారని తెలుస్తోంది. టీడీపీ అవిశ్వాస తీర్మానం ఇచ్చిన కొద్దిసేపటికే దానికి అనూహ్య మద్దతు లభించడానికి అదే కారణమంటున్నారు.


లీకవుతున్న బాబు సమాచారం?

చంద్రబాబు ఎత్తుగడలు ముందుగానే బీజేపీ అధినాయకత్వానికి ఇటీవల కాలంలో చకచకా చేరిపోతున్నాయి. ఆయన వేసే ఎత్తుకు పైఎత్తుగా రాష్ట్ర బీజేపీ లేక విపక్షం మాట్లాడుతున్నాయి. చంద్రబాబు కేంద్ర మంత్రివర్గం నుంచి బయటికి రావడం, ఎన్డీఏకి రాంరాం చెప్పడం లాంటి అంశాలపై బీజేపీ అధినాయకత్వానికి ముందుగానే ఉప్పందేదని, అందుకే వాళ్లు ఏపీ విషయంలో కఠినంగా వ్యవహరించసాగారని చెబుతున్నారు. అరుణ్‌జైట్లీ విలేకరుల సమావేశంలో అంత కఠినంగా మాట్లాడటానికీ అదే కారణమన్నారు. జాతీయస్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ లేక తృతీయ ఫ్రంట్‌కు కేసీఆర్ ప్రకటించినప్పుడు కూడా తన సొంత ఎత్తుగడ తనకు ఉండటంతో చంద్రబాబు మౌనం వహించారు. అయితే అమరావతి రాజకీయవర్గాలు పేర్కొంటున్న మేరకు బాబు సమాచారం లీకులు కాకుండా చూసుకోవాల్సిన అగత్యం ఎంతైనా ఉందంటున్నారు.

పాతమిత్రుల విముఖత?

జాతీయ స్థాయిలో నాలుగు దశాబ్దాల నాడు జనతా పార్టీ ప్రయోగం విఫలం కావడం, 1989లో నేషనల్ ఫ్రంట్, 1996–97లో యునైటెడ్ ఫ్రంట్‌లు వైఫల్యం చెందిన నేపథ్యంలో తృతీయఫ్రంట్‌కి చంద్రబాబు, ఆయన పాతమిత్రులు సుముఖంగా లేరని అంటున్నారు. బీజేపీకి జాతీయ స్థాయిలో ఓ 'వ్యతిరేక కూటమి'ని ఏర్పాటు చేసి తద్వారా ముక్కోణపు పోటీలు నివారించి బీజేపీని దెబ్బతీయాలనేది చంద్రబాబు వ్యూహం. బలాబలాలు, ఎత్తుకు పైఎత్తులతో సాగుతున్న ఈ నెంబర్ గేమ్‌లో విపక్షాల కృషి ఫలిస్తే లోక్‌సభలో బలాబలాలు 293 – 216గా ఉండచ్చు. బీజేపీ అధినాయకత్వం సమాలోచనలు ఫలిస్తే వారి బలం మరింత పెరుగుతుంది.

అవిశ్వాసానికి మద్దతిస్తాం: కర్నె



కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పార్లమెంట్‌లో చర్చకు వస్తే టీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేయనున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ.. రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిందన్నారు. బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సీఎం కేసీఆర్ మాటలు అక్షర సత్యాలుగా అమలవుతాయని బడ్జెట్ మరోమారు నిరూపించిందని కొనియాడారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే దూసుకుపోతోందన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో 5 శాతంగా నమోదయ్యే జీడీపీ ఇప్పుడు రెండంకెల స్థాయిని దాటిందని తెలిపారు. 2017–18 బడ్జెట్‌లో ప్రతిపాదించిన కేటాయింపుల్లో 95 శాతం ఖర్చు చేసిన ఘనత తెలంగాణదేనని కర్నె వివరించారు. బడ్జెట్ ఇంత బాగా ఉంటే కాంగ్రెస్ నేతలు దొంగ దీక్షలు చేస్తూ పిల్లి శాపాలు పెడుతున్నరని ఆయన దుయ్యబట్టారు. కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ వచ్చిందని ప్రజలు గత ఎన్నికల్లో తీర్పు ఇచ్చారన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణను కాంగ్రెస్ నేతలు ఎప్పుడో అమ్మేసేవాళ్లని కర్నె విమర్శించారు. జైపాల్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమన్నారు. కేసీఆర్ శక్తి ఏమిటో త్వరలోనే దేశం చూడబోతుందని కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు.

గవర్నర్ ప్రసంగం ఫుటేజి ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో శాసన సభలో హెడ్‌ఫోన్ విసిరి మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను గాయపరిచారని పేర్కొంటూ కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్‌కుమార్ శాసన సభ్యత్వాన్ని స్పీకర్ రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే.. 11 మంది ఎమ్మెల్యేలను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో స్వామిగౌడ్‌కు తగిలిన గాయానికి సంబంధించి దృశ్యాలను బయటపెట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. 12వ తేదీ శాసన సభ మొత్తం వీడియో ఫుటేజీను ఇవ్వాల్సిందిగా ఇప్పటికే కాంగ్రెస్ శాసన సభాపక్ష నాయకుడు జానారెడ్డి, మండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్‌అలీ స్పీకర్‌కు లేఖ రాశారు. స్పీకర్ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో తాజాగా కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు.



కోమటిరెడ్డి, సంపత్ పిటిషన్లపై హైకోర్టులో విచారణ

కాంగ్రెస్ ఎమ్మెల్యేల అనర్హత వేటు కేసు శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. అన్యాయంగా, రాజ్యాంగ విరుద్ధంగా తమ శాసన సభ్యత్వాలను రద్దు చేశారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. 12వ తేదీన అసెంబ్లీ లో గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారని, ఆ సమయంలో సభ గవర్నర్ అధీనంలో ఉంటుందని, 13వ తేదీ నుంచే సభ స్పీకర్ పరిధిలోకి వస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. స్పీకర్ అధికారాలను, పరిధిని ప్రశ్నించారు. కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫున న్యాయవాది రవి శంకర్ జంధ్యాల వాదిస్తూ.. ఇద్దరు సభ్యుల సభ్యత్వం రద్దు చేయడమనే అంశం తీవ్రమైన రాజ్యాంగ పరమైన అంశమని పేర్కొన్నారు. బిజినెస్ రూల్స్ ప్రకారం సభ్యత్వాలను రద్దు చేశారని, అయితే ఈ నిబంధనలు సభ నడుస్తున్నప్పుడు మాత్రమే అమలులో ఉంటాయని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం 'అసెంబ్లీ ప్రొసీడింగ్స్' కిందకు రాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. అలాంటప్పుడు బిజినెస్ రూల్స్ కింద సభ్యుల సభ్యత్వాన్ని ఎలా రద్దు చేస్తారో అర్థం కావట్లేదన్నారు. అలాగే.. శాసనసభ్యుల సభ్యత్వం రద్దుకు సంబంధించి రాజ్యాంగంలోనూ ఎలాంటి నిబంధనలు లేవన్నారు. అధికారంలో ఉన్న వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగ స్ఫూర్తిని పట్టించుకోలేదన్నారు. రాజ్యాంగంలోని 14, 19 అధికరణలు కూడా చట్టసభల్లోనూ వర్తిస్తాయని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ చలమేశ్వర్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందన్నారు. అలాగే, కోమటిరెడ్డికి, సంపత్‌కుమార్‌కు వివరణ ఇచ్చేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని, నోటీసులు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. కాగా, ఈ కేసులో పూర్తి వివరాల కోసం తమకు కొంత సమయం ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి కోర్టును అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన కోర్టు.. కేసు విచారణను సోమవారానికి వాయిదా వేసింది.


ఇంత ఆలస్యమా.. ఇలాగైతే నీళ్లిచ్చేదెలా?

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పనులు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని, రాష్ట్రంలో అందరి కంటే ముందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని, వారంలో ఒకరోజు మిషన్ భగీరథ పనులకు కేటాయించాలని సూచించారు. మిషన్ భగీరథ పనులలో కొంతమంది అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏప్రిల్ 30వ తేదీలోగా జనగామ జిల్లాలోని ప్రతి ఇంటికి నల్లా నీళ్లు ఇచ్చే పని పూర్తిచేయాలని గడువు విధించారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలపై హన్మకొండలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలు. వీటిని దేశం మొత్తం ప్రశంసిస్తోందని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎజెండానే కలెక్టర్ల ఎజెండాగా చేసుకుని ప్రభుత్వ పథకాలే మీ పథకాలుగా చేసుకుని వాటిని వేగంగా పూర్తిచేసి ప్రజాసంక్షేమానికి పాటుపడాలని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పనిచేసినా ప్రభుత్వం సహకరిస్తుందని, ప్రయోగాత్మక పనులను చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాలోని మానవ, ఆర్థిక వనరులను వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు అనుకూలంగా ఉంటూ ప్రజాప్రతినిధులకు సహకరిస్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారం, అవగాహనతో ముందుకువెళితే పనులు మరింత వేగవంతమవుతాయని చెప్పారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 15వ తేదీలోగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని గ్రామాలకు నీరు సరఫరా కావాలని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ 30వ తేదీలోగా ఇంట్రావర్క్స్ పూర్తిచేయాలని, జూలై 31వ తేదీలోగా కార్పొరేషన్, భూపాలపల్లి జిల్లాలో పూర్తిచేయాలని చెప్పారు. బిల్లులకు ఇబ్బంది లేదని, సకాలంలో బిల్లులు వస్తాయని, ట్రయల్ రన్ చేసేటప్పుడు సమస్యలు వస్తున్నాయని, వాటిని పరిష్కరించిన తరువాత తిరిగి ఆ సమస్య ఉత్పన్నమైతే అది కాంట్రాక్టర్ల సమస్యగా పరిగణిస్తామన్నారు. ప్రత్యేకంగా వరంగల్ అర్బన్ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా వాటర్ బల్క్ సప్లైని 24గంటలు ఇచ్చేలా సమగ్ర ప్రణాళిక ఉండాలని, ప్రతి ఇంటికి నీళ్లు ఇచ్చేలా చూడాలన్నారు. వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ.. ఈనెల 31లోగా పరకాలలోని అన్ని ఇళ్లకు నల్లా నీటిని అందిస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోగా నీరిస్తే కలెక్టర్ హరితను సన్మానిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీలోగా భూపాలపల్లి జిల్లాలోని ప్రతి గ్రామానికి బల్క్ వాటర్ సప్లై చేసేలా ప్లాన్ చేస్తున్నామని కలెక్టర్ అమోయ్‌కుమార్ తెలిపారు. ప్రతి బుధవారం మిషన్ భగీరథ పనుల సమీక్ష, క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ములుగు, ఘన్‌పూర్‌లలో గతంలో 150మీటర్ల బోర్ వేస్తే నీళ్లు వచ్చేవని, ఇప్పుడు 600మీటర్లు వేసినా నీళ్లు రావడం లేదని కలెక్టర్ తెలిపారు. జూన్ 30వ తేదీలోగా ఇంట్రా పైప్‌లైన్లు వేస్తామని చెప్పారు. వరంగల్ అర్బన్ జిల్లాలో ప్రతి గ్రామానికి ఏప్రిల్ 15వ తేదీలోగా బల్క్ వాటర్ సప్లై చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.దయానంద్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో లక్షా 10వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయని, ఇంకా 65వేల కనెక్షన్లు ఇవ్వాలని మేయర్ నన్నపునేని నరేందర్ తెలిపారు. అనంతరం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన తీయనైన తెలుగు–తెలంగాణ వెలుగు అనే ఉగాది పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సమీక్ష సమావేశంలో గిరిజన, పర్యాటకశాఖ మంత్రి ఎ.చందూలాల్, ప్రభుత్వ చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, నగర మేయర్ నన్నపునేని నరేందర్, ప్రభుత్వ చీఫ్ విప్ బొడకుంటి వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్లూవేల్ ఉనికి నిజమే!

- ఐదు టాస్కులు పూర్తిచేశాక గుర్తించాం
- మెడికల్ జర్నల్‌కు పరిశోధనా పత్రం
- ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 16:

సరదా టాస్క్‌లతో ప్రారంభించి సస్పెన్స్ థ్రిల్లర్‌లా మరిపించి చివరకు ఆత్మహత్యకు ప్రేరేపించే ప్రమాదకరమైన ఆట బ్లూవేల్ ఛాలెంజ్ నిజంగానే ఉందని ఎయిమ్స్ వైద్యులు స్పష్టంచేశారు. కొన్ని రోజుల క్రితం చిన్నారుల తల్లిదండ్రులలో భయాందోళనలను రేకెత్తించిన ఈ గేమ్ కాస్త సద్దుమణిగాక.. అబ్బే అదంతా ఉట్టి హంబక్ అన్న ప్రచారం మొదలైంది. పలు కేసుల్లో బాధితులు అబద్ధం చెప్పారన్న వార్తలతో బ్లూవేల్ ఛాలెంజ్ ఉనికిపై సందేహాలు వ్యక్తమయ్యాయి. తాజాగా ఈ ప్రమాదకరమైన ఆట నిజంగానే ఉందని ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు తేల్చారు. స్కూలు, కాలేజీ విద్యార్థుల ప్రాణాలను తీస్తోందంటూ ఈ ఆటపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైన విషయం తెలిసిందే! దీనిని నిషేధించాలంటూ డిమాండ్లు వెల్లువెత్తాయి. అయితే, ఫేస్‌బుక్ లింక్ రూపంలో వ్యాపించిన బ్లూవేల్‌ను నియంత్రించడం పూర్తిస్థాయిలో సాధ్యంకాలేదు. యాభై రోజుల పాటు సాగే ఈ ఆటలో రోజుకో ప్రమాదకరమైన టాస్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. చివరి రోజు ఆత్మహత్యకు పాల్పడాలంటూ మెంటర్ ఆదేశిస్తారు. ఈ ఆట కారణంగా పలువురు చిన్నారులు ప్రాణాలు పోగొట్టుకోవడంతో బ్లూవేల్ పేరు వింటేనే వణికిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. తర్వాత జరిగిన పరిశోధనలలో బ్లూవేల్ ఛాలెంజ్ ఉనికిపై సందేహాలు ఏర్పడ్డాయి. ఈ ఆట నిజంగా లేదేమోననే అభిప్రాయాలను పలువురు వెల్లడించారు. బ్లూవేల్ గేమ్ ఆడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డారన్న కేసులను పరిశీలించి బ్లూవేల్ వట్టిదేనని పోలీసులు తేల్చారు. ఈ అభిప్రాయం తప్పని, బ్లూవేల్ ఛాలెంజ్ నిజంగానే ఉందని తాజాగా నిరూపణ అయింది. ఎయిమ్స్ వైద్యులు పంపించిన ఓ పరిశోధనా పత్రాన్ని ఆసియా పసిఫిక్ సైకియాట్రి అనే జర్నల్ ప్రచురించింది. ఇందులో బాధిత విద్యార్థి ఎదుర్కొన్న పరిస్థితిని వారు విపులంగా వివరించారు.

ఐదు టాస్క్‌లు పూర్తి చేశా..

కోలుకున్న తర్వాత ఆ విద్యార్థి వెల్లడించిన వివరాలు.. 'సామాజిక మాధ్యమంలో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేయగానే నా మొబైల్‌లో బ్లూవేల్ గేమ్ డౌన్‌లోడ్ అయింది. మొదటి టాస్క్‌గా చెంప దెబ్బ కొట్టుకుని నేను చాలా బలవంతుడినని చెప్పమని అడిగింది. అలాగే చేశాను.. రెండో టాస్క్ గుర్తులేదు. మూడోరోజు ఏదైనా పదునైన వస్తువుతో ముంజేతిపై ఎఫ్15 అని చెక్కుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాతి రోజు బాల్కనీలో రెండు నుంచి మూడు గంటల పాటు ఒంటరిగా నిల్చోవాలని, తర్వాతి రోజు కత్తితో చేతిపై బ్లూవేల్ బొమ్మ చెక్కుకోవాలంటూ ఆదేశించారు. ఐదు టాస్క్‌లను విజయవంతంగా పూర్తిచేశాను' అని బాధిత విద్యార్థి వెల్లడించారు.

కౌన్సెలింగ్‌తో..

కొడుకు చేతిపై బ్లూవేల్ బొమ్మ గమనించిన తండ్రి వెంటనే ఆస్పత్రికి తీసుకొచ్చాడని వైద్యులు తెలిపారు. బాలుడిని పరీక్షిస్తే మానసిక ఆందోళన(డిప్రెషన్)తో బాధపడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. ఆ డిప్రెషన్ నుంచి బయటికి తీసుకొచ్చేందుకు, బ్లూవేల్ ఆటపై కలిగిన ఆసక్తిని పోగొట్టేందుకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. దీంతో నెమ్మదిగా బ్లూవేల్ మత్తు నుంచి కుర్రాడు బయటపడ్డాడని చెప్పారు.

రామసేతుకు నష్టం వాటిల్లనివ్వం

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం.. సుప్రీంలో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్

న్యూఢిల్లీ, మార్చి 16: సేతు సముద్ర ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా.. రామసేతుకు ఎలాంటి నష్టం కలిగించబోమని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ''భారతీయ పురాణాల ప్రకారం రామసేతుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. జాతి ప్రయోజనాల దృష్ట్యా రామసేతుకు ఎలాంటి నష్టం కలిగించం'' అని కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ ఈ మేరకు సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నౌకాయానానికి వీలుగా రామసేతు ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం సేతు సముద్రం షిప్ చానల్ ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. అయితే..ఈ ప్రాజెక్టుతో రామాయణ కాలంనాటిదిగా భావిస్తున్న రామసేతు లేదా ఆడమ్స్ బ్రిడ్జ్‌కు నష్ట వాటిల్లుతుందని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారించింది. '' గతంలో ప్రతిపాదించిన సేతు సముద్రం ప్రాజెక్టులో పలు మార్పులు చేశాం. దేశ వాసుల మనోగతానికి, సెంటిమెంట్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. రామసేతుకు ఎట్టిపరిస్థితుల్లోనూ నష్టం కలగనివ్వబోం. ఆ మేరకు రామసేతు ప్రాజెక్టును నిర్మిస్తాం'' అని అఫిడవిట్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆడమ్స్ వంతెనగా పేరొందిన రామ సేతు తమిళనాడులోని రామేశ్వరానికి సమీపంలోని పంబన్ ద్వీపం నుంచి శ్రీలంక ఉత్తర తీరంలోని మన్నార్ ద్వీపం వరకు ఉంటుంది. భూగర్భ సిద్ధాంతాల ప్రకారం ఈ నిర్మాణం సహజంగా ఏర్పడిందని కొందరు వాదిస్తుండగా, మరికొందరు మాత్రం రావణుడితో శ్రీరాముడు యుద్ధం చేయడానికి లంకకు వెళ్లేందుకు రామసైన్యం దీన్ని నిర్మించిందని వాదిస్తున్నారు.రామసేతు ఉన్న ప్రాంతంలో గతంలో సేతు సముద్రం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1990లలో దానిపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత 1997లో ప్రాజెక్టుపై ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2005లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు తుది దశకు వచ్చింది. ఈ ప్రాజెక్టు వల్ల దాదాపు 350 నాటికల్ మైళ్ల ప్రయాణం తగ్గుతుందని, భారత్‌లో సుమారు 13 చిన్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఇతర మౌలిక సదుపాయాలు శ్రీలంక, భారత్‌లలో నిర్మించొచ్చని భావించారు. అయితే ఈ ప్రాజెక్టుతో రామసేతు ధ్వంసం అవుతుందని అప్పట్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే వర్గాలు వ్యతిరేకించాయి. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లారు. రామసేతు విషయంలో మతపరమైన విశ్వాసాలు ఉన్నందున ప్రాజెక్టు కట్టకూడదని, దానికి జాతీయ వారసత్వ హోదా ఇవ్వాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు.



దలేర్ మెహందీకి రెండేళ్ల జైలు

- మనుషుల అక్రమ రవాణా కేసు
- 2003 నాటి కేసులో కోర్టు తీర్పు
- శిక్ష విధింపు.. వెంటనే బెయిల్



పాటియాలా, మార్చి 16: ప్రముఖ పంజాబీ పాప్ గాయకుడు దలేర్ మెహందీకి పాటియాలా కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. 2003 నాటి మనుషుల అక్రమ రవాణా కేసులో ఆయనను దోషిగా తేల్చి ఈ శిక్ష వేశారు. అంతరం బెయిల్ మంజూరు చేశారు. దలేర్ మెహందీ, ఆయన సోదరుడు షంషేర్, ఇతరులు కలిసి కొంతమంది వ్యక్తులను తమ బృందంలో సభ్యులుగా చూపిస్తూ అక్రమంగా విదేశాలకు పంపేవారని ఆరోపణలు వచ్చాయి. దానికి బదులు వారి నుంచి కోటి రూపాయలు తీసుకునేవారని, పంపడం కుదరకపోయినా ఎప్పటికీ డబ్బులు మాత్రం తిరిగివ్వలేదని ఫిర్యాదులున్నాయి. మెహందీ సోదరులు 1998, 1999 సంవత్సరాలలో అమెరికాకు రెండుసార్లు బృందాలతో వెళ్లారని, అక్కడ 10 మందిని అక్రమంగా వదిలేసి వచ్చారని కూడా ఫిర్యాదులలో పేర్కొన్నారు. వీటిపై 2003 సంవత్సరంలో పాటియాలా సదర్ పోలీసు స్టేషన్‌లో పాటియాలా జిల్లాలోని బల్‌భేరా గ్రామానికి చెందిన బక్షీష్ సింగ్ ఫిర్యాదుచేవారు. కేసు నమోదైన తర్వాత దలేర్ మెహందీని అరెస్టు చేసినా.. కొన్ని రోజుల తర్వాత బెయిల్ మీద విడుదల చేశారు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత కేసు విచారణ పూర్తి కావడం, దలేర్‌ను దోషిగా తేల్చడంతో ఆయనకు జైలుశిక్ష విధించారు. పై కోర్టులో అప్పీలు చేసుకోడానికి వీలుగా బెయిల్ మంజూరు చేశారు.



ఆ వాహనాలకు చెల్లుచీటీ!

- **2000కు మునుపు వాణిజ్య వాహనాల రిజిస్ట్రేషన్లు 2020లో రద్దు?**
- **కాలుష్య నివారణకు కేంద్రం నిర్ణయం**
- **అమలైతే 7 లక్షల వాహనాలపై ప్రభావం**


న్యూఢిల్లీ, మార్చి 16: కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారీ కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలు రోడ్లపై తిరగకుండా ఉండేలా వాటిక్ చెక్ పెట్టనుంది. కాలం చెల్లిన వాహనాలను నియంత్రించేందుకు వాణిజ్యవాహనాల జీవిత కాలాన్ని 20 ఏళ్లకు పరిమితం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భాగంగా 2000 సంవత్సరానికి మునుపు రిజిస్ట్రేషన్ అయిన వాణిజ్య వాహనాలు..అంటే.. ట్యాక్సీలు, ట్రక్కులు, బస్సులు తదితర వాహనాలు 2020 తరువాత రోడ్లపై తిరిగేందుకు అనుమతి ఉండదు. ఆ సంవత్సరం తర్వాత ఈ వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు కానున్నాయి. మేరకు ఓ ఉన్నతస్థాయి సమావేశంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నారు. అయితే.. వ్యక్తిగత వాహనాలకు ఎలాంటి వయస్సు పరిమితి విధించనట్లు తెలిసింది. ఫిట్‌నెస్ టెస్టు సాధిస్తే ఈ వాహనాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ మధ్యే ప్రధాన మంత్రి కార్యాలయంలో(పీఎంవో)లోజరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇందులో నీతిఅయోగ్, ట్రాన్స్‌పోర్ట్, హెవీ ఇండస్ట్రీస్, ఆర్థిక, పర్యావరణ మంత్రిత్వశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారని ఆ వర్గాలు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 2000 సంవత్సరంలోపు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలు దాదాపు 7 లక్షల వరకు ఉన్నట్లు భావిస్తున్నారు. 2020 వరకు ఈ వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు కానున్నాయి. అంటే.. దాదాపు వీటిపై నిషేధం విధించినట్లేనని అధికార వర్గాలు పేర్కొన్నారు.

'పీఎన్‌బీ' దర్యాప్తు ఎంతవరకు వచ్చిందో వివరాలు ఎందుకివ్వాలి?

- **కోర్టుల సమాంతర దర్యాప్తు వద్దు**
- **దర్యాప్తు సంస్థల స్థైర్యం దెబ్బతింటుంది**
- **సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం వాదన**

న్యూఢిల్లీ, మార్చి 16: వేల కోట్ల రూపాయల పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కేసులో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం సంచలన వాదనలు చేసింది. ఈ కేసు పురోగతి ఎంతవరకు వచ్చిందో సుప్రీంకోర్టుకు ఎందుకు వెల్లడించాలని ప్రశ్నించింది. ఈ కేసులో సమాంతర దర్యాప్తు వద్దని సూచించింది. దాదాపు.. సుప్రీంకోర్టు ఈ కేసులో జోక్యం చేసుకోకూడదనే స్థాయిలో వాదనలు వినిపించింది. పీఎన్‌బీ కేసును సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ తన వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు ఎంతవరకు వచ్చిందో సీల్డ్ కవర్‌లో అందించాలని ధర్మాసనం చేసిన విజ్ఞప్తిని అటార్నీ జనరల్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కేసులో ఏం చేస్తున్నారో చెప్పాలని దర్యాప్తు సంస్థలను కోరడం సమంజసం కాదని వాదించారు. '' ఎవరైనా కోర్టుకు వచ్చి.. ఓ పిల్ దాఖలు చేసి.. దర్యాప్తు ఎంతవరకు వచ్చిందోనని ప్రశ్నిస్తే.. దానికి హేతబద్ధత ఉందా? దర్యాప్తు సంస్థలకు సమాంతరంగా కోర్టుల తనిఖీలు లేదా పరిశోధనలు ఉండకూడదు'' అని ఏజీ పేర్కొన్నారు. ఆయా కేసుల్లో తరచుగా కోర్టులు ఇలాంటి ఆదేశాలు జారీ చేస్తున్నాయని, దీనివల్ల దర్యాప్తు సంస్థల నైతిక స్థైర్యం దెబ్బతింటోందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పిటిషన్లను అనుమతించకూడదని కోర్టుకు సూచించారు.


2025 నాటికి క్షయ నిర్మూలన



వ్యాధుల నివారణకు శాస్త్రవేత్తలు కృషి చేయాలి

- **విద్యార్థులతో విజ్ఞాన విశేషాలు పంచుకోవాలి**
- **అంతరిక్ష శాస్త్ర పరిశోధనల్లో మనోళ్లు భేష్**
- **సాంకేతిక వినియోగం ఎంతో కీలకం**
- **ఇంఫాల్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ**
- **ఈశాన్యానికి 10 రిజర్వ్ బెటాలియన్లు మంజూరు**
- **మణిపూర్‌కి రెండు.. 2 వేలమందికి ఉద్యోగాలు**

ఇంఫాల్, మార్చి 16: ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 నాటికి అంతర్జాతీయంగా క్షయ మహమ్మారిని రూపుమాపాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుందని, అంతకంటే ముందే 2025 నాటికి దేశంలో క్షయను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ మణిపూర్‌లో పర్యటించారు. ఇంఫాల్‌లో జరుగుతున్న 105 ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మణిపూర్ యూనివర్సిటీలో 5 రోజుల పాటు జరిగే ఈ సదస్సును మోదీ ప్రారంభించారు. గత 100 ఏళ్లలో ఈశాన్య ప్రాంతంలో జరుగుతున్న రెండో సైన్స్ కాంగ్రెస్ సమావేశం ఇదేనని మోదీ పేర్కొన్నారు. పౌష్టికారలోపం వంటి సమస్యలను అధిగమించడానికి, మలేరియా, జపనీస్ ఎన్సెఫాలిటీస్ వంటి వ్యాధుల నివారణకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిశోధనల్లో, శాస్త్ర, సాంకేతిక వినియోగంలో భారత్‌కు సుదీర్ఘమైన చరిత్ర ఉందని పేర్కొన్నారు. అంతరిక్ష శాస్త్రం పరిశోధనల్లో భారత శాస్త్రవేత్తల కృషి ఎనలేనిదని నరేంద్ర మోదీ అభినందించారు. సైన్స్ రంగంలో మన దేశం మరిన్ని విజయాల్ని సాధించాలంటే ప్రతి శాస్త్రవేత్త పాఠశాల విద్యార్థులతో తమ అనుభవాల్ని పంచుకోవాలని కోరారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులతో ప్రతి శాస్త్రవేత్త ఏడాదికి 100 గంటల చొప్పున వారి విజ్ఞాన యాత్రా విశేషాల్ని పంచుకోవాలి అని సూచించారు. మణిపూర్‌లో బాలికల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని మోదీ ప్రశంసించారు. కొండ, గిరిజన ప్రాంతాల్లో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను నివారించడానికి కృషిచేస్తోందన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో బాలికలకు హాస్టళ్లను నిర్మిస్తోందని తెలిపారు. దేశ సంపదను, వృద్ధిరేటును పెంచేందుకు సాంకేతికను వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం బ్యాంకింగ్, హెల్త్‌కేర్, విద్యా రంగాల్లో సాంకేతికత చాలా కీలకంగా మారిందని మోదీ పేర్కొన్నారు. మన శాస్త్రవేత్తలు సాధించిన విజయాలను సమాజానికి తెలియజేయాల్సిన అవసరముందని అన్నారు. 2022 నాటికి 100 గిగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మోదీ చెప్పారు. చౌక ధరతో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చునని, దీని ద్వారా పర్యావరణాకి హాని ఉండదని పేర్కొన్నారు. ఈ సదస్సుకు 2 వేలమంది పరిశోధకులు, శాస్త్రవేత్తలు సహా 5 వేలమంది ఆహ్వానితులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈశాన్య రాష్ట్రాలకు శుక్రవారం కానుక ప్రకటించారు. ఈశాన్య రాష్ట్రాలకు 10 భారత రిజర్వ్ బెటాలియన్లను మంజూరు చేశారు. ఇందులో రెండింటిని మణిపూర్‌లో ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా దాదాపు 2 వేల మంది యువతకు ఉద్యోగాలు రానున్నాయి.






కేజ్రీ క్షమాపణ ఎఫెక్ట్..
ఆప్‌కు భగవంత్ మాన్ రాజీనామా

డ్రగ్స్ వ్యవహారంలో మజీతియాపై ఆరోపణలు.. ఉపసంహరించుకుంటున్నట్లు లేఖ.. క్షమాపణ
పరువునష్టం దావా నుంచి బయటపడేందుకే.. పంజాబ్ 'ఆప్'లో ప్రకంపనలు.. పలువురి అసంతృప్తి

న్యూఢిల్లీ, మార్చి 16: అకాలీదళ్ నాయకుడు విక్రమ్ సింగ్ మజీతియాకు పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణ చెప్పడానికి నిరసనగా.. ఆ పార్టీ పంజాబ్ అధ్యక్ష పదవికి భగవంత్ మాన్ రాజీనామా చేశారు. ''నేను ఆప్ పంజాబ్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నాను. కానీ డ్రగ్ మాఫియాపైన, పంజాబ్‌లో అన్ని రకాల అవినీతిపైన నా పోరాటం 'పంజాబ్ ఆమ్ ఆద్మీ'గా కొనసాగుతుంది'' అని ఆయన ట్వీట్ చేశారు. పంజాబ్ మాజీమంత్రి మజీతియా డ్రగ్ రాకెట్‌లో ఉన్నారంటూ తాను గతంలో చేసిన ఆరోపణలను అరవింద్ కేజ్రీవాల్ ఉపసంహరించుకోవడంతో పాటు.. ఆయనకు క్షమాపణలు చెప్పారు. దీనిపై పార్టీ పంజాబ్ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మజీతియా జైల్లో ఉండాల్సిన మనిషని.. అలాంటి వ్యక్తికి కేజ్రీవాల్ క్షమాపణ చెప్పడం చాలా మందిని అసంతృప్తికి గురిచేసిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా.. కేజ్రీవాల్ క్షమాపణ లేఖతోఆమ్ ఆద్మీ పార్టీ నీచ రాజకీయాలు బయటపడ్డాయని కేంద్రమంత్రి హర్ సిమ్రత్‌కౌర్ బాదల్ అన్నారు. వాళ్లు ముందు తప్పుడు ప్రచారం చేశారని, తమ ఎన్నికల ప్రచారం మొత్తం ఒక అబద్ధం ఆధారంగానే నడిపించారని.. కనీసం ఇప్పటికైనా దాన్ని అబద్ధమని ఒప్పుకొన్నారని ఆమె అన్నారు. మజీతియాపై తాను చేసిన ఆరోపణల గురించి అరవింద్ కేజ్రీవాల్ అమృతసర్ కోర్టుకు ఒక లేఖ పంపారు. ''ఇటీవలి కాలంలో.. డ్రగ్స్ వ్యాపారంలో మీ పాత్ర ఉన్నట్లు నేను కొన్ని ఆరోపణలు చేశాను. అవి రాజకీయ దుమారం రేపాయి. కానీ ఇప్పుడా ఆరోపణలలో పసలేదని నాకు తెలిసింది. నా ఆరోపణలు, ప్రకటనలన్నింటినీ నేను ఉపసంహరించుకుంటూ.. ఆరోపణలు చేసినందుకు క్షమాపణలు కోరుతున్నాను'' అని ఆ లేఖలో పేర్కొన్నారు. కేజ్రీవాల్‌తో పాటు ఆప్ నాయకులు సంజయ్ సింగ్, ఆశిష్ ఖేతాన్ తదితరులపై మజీతియా 2016లో పరువు నష్టం దావా వేశారు. కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడంతో తాను కేసును ఉపసంహరించుకుంటానని మజీతియా అన్నారు.

బీజేపీకి 110 సీట్లు తగ్గుతాయి

- **2019 ఎన్నికలపై శివసేన జోష్యం**
- **'ఉప' పరాజయాలపై సామ్నా విశ్లేషణ**



ముంబై, మార్చి 16: ఉప ఎన్నికల్లో బీజేపీ పరాజయాలు ఆ పార్టీని ఆకాశం నుంచి అమాంతం నేలకు దించాయని శివసేన అభిప్రాయపడింది. ఇది ఇలానే కొనసాగితే గత ఎన్నికల్లో వచ్చిన 282 సీట్ల నుంచి బీజేపీ గణనీయంగా దిగజారిపోతుందని పేర్కొంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఇప్పటి కన్నా 100-110 సీట్ల వరకు తగ్గుతాయని జోష్యం చెప్పింది. త్రిపుర వంటి చిన్న రాష్ట్రాల్లో ఘన విజయాల ఆనందం కన్నా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటమితో వచ్చిన భయమే ఎక్కువగా ఉందని పేర్కొంది. వచ్చే ఎన్నికల్లో పోరాడాల్సింది భారత్‌లోనే కానీ అమెరికా, ఫ్రాన్స్, కెనడా, రష్యా దేశాల్లో కాదంటూ మోదీపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. శివసేన తన పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో ఉప ఎన్నికల ఫలితాలపై విశ్లేషిస్తూ కథనం రాసింది. ఇందులో మోదీ, బీజేపీ హవా మాయమైందని అభిప్రాయపడింది. ఉప ఎన్నికలు దేశ ప్రజల మనోభావాలను ప్రతిబింబించవని బీజేపీ చెప్పుకొంటోందని, కానీ మోదీ ప్రధాని అయిన నాటి నుంచి జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయాల్నే ఎక్కువగా చవిచూసిందని శివసేన పేర్కొంది. 2014లో 282 ఎంపీ స్థానాలతో లోక్‌సభలో అడుగుపెట్టిన ఆ పార్టీ ఇప్పుడు 272 స్థానాలకు పడిపోయిందని వివరించింది.

మాకూ 'హోదా' కావాల్సిందే

- **పోరు సాగిస్తాం.. జేడీయూ డిమాండ్**


పట్నా, మార్చి 16: ఓ వైపు యూపీ, బిహార్ ఉప ఎన్నికల్లో ఓటమి.. మరోవైపు మిత్రపక్షం టీడీపీ ఎన్డీ యే నుంచి వైదొలగడం తో సతమతమైపోతున్న బీజేపీపై మరో మిత్రపక్షమైన జేడీయూ పోరుకు సిద్ధమవ ుతోంది. ఏపీకి ప్రత్యేక హోదా కావాలని కోరుతున్న తరుణంలో బిహార్‌కు కూడా హోదా ఇచ్చి తీరాల్సిందేనని జేడీయూ డిమాండ్ చేస్తోంది. బిహార్‌కు హోదా కోసం ఉద్ధ ృతంగా పోరాటం చేస్తామని ఆ పార్టీ నేత కేసీ త్యాగి ఢిల్లీలో మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా ఈ మేరకు పలుమార్లు డిమాండ్ చేశారు.

సీఆర్పీఎఫ్, ఉగ్రవాదులు మధ్య కాల్పులు

- **ఇద్దరు మిలిటెంట్లు మృతి**
- **శ్రీనగర్ శివారులో ఘటన**


శ్రీనగర్, మార్చి 16: జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్ శివారులో ఖోన్మోహ్ ప్రాంతంలో గురువారం భద్రత బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మిలిటెంట్లు మరణించగా, ఓ సీఆర్పీఎఫ్ జవాను గాయపడ్డారు. ఖోన్మోహ్ ప్రాంతంలోని బాలహమాలో ఓ గృహ సముదాయంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం మేరకు సీఆర్పీఎఫ్ బలగాలు ఆ ప్రాంతాన్ని ముట్టడించాయి. ఇంట్లో దాగి ఉన్న ఉగ్రవాదులు భద్రత బలగాలపై కాల్పులు ప్రారంభించగా, భద్రతా సిబ్బంది ఎదురుదాడికి దిగారు.

630 విమానాలు రద్దు



- **సంక్షోభంలో దేశీయ విమానరంగం**
- **డోలాయమానంలో లక్షమంది ప్రయాణికులు**

ముంబై, మార్చి 16: ఇండిగో, గోఎయిర్ దేశీయ విమానయాన సంస్థలు ఈ నెలలో 630 దేశీయ విమానాలను రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు గురువారం ఈ ఎయిర్‌లైన్స్ సమర్పించిన షెడ్యూల్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఇండిగో 488 విమానాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించగా.. గోఎయిర్ 138 విమానాలను రద్దు చేయబోతున్నట్టు పేర్కొంది. రద్దు అయిన విమానాల జాబితాలను ఈ విమానయాన సంస్థలు తమ తమ వెబ్‌సైట్లలో పొందుపరిచాయి. ఈ రెండు విమానయాన సంస్థలు ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమానాలను ఆఫర్ చేస్తుండటంతో పాటు, మొత్తం నగదును రీఫండ్ చేస్తున్నాయి. ఈ రద్దుతో దాదాపు లక్ష మంది ప్రయాణికులు ప్రభావితం కానున్నారు. వచ్చే నెల నుంచి వేసవి సెలవుల షెడ్యూల్ ప్రారంభం కానుండటంతో, ఈ రద్దు ప్రభావం టూరిస్టులపై తీవ్రంగా ఉండబోతోంది. విమానాల రద్దు కారణంగా టికెట్ ధరలు విపరీతంగా పెరిగే సూచనలు ఉన్నాయి. ఇండిగో, గోఎయిర్ కలిసి రోజూ 1200 విమానాలను నడుపుతున్నాయి. దేశంలోని 50 శాతం విమాన ప్రయాణికులను గమ్యస్థానాలకు ఇండిగో, గోఎయిర్ విమాన సర్వీసులే చేరవేస్తున్నాయి. ప్రాట్ అండ్ విట్నీ తయారు చేసిన ఇంజిన్లలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా డీజీసీఏ ఆదేశాలకు అనుగుణంగా రెండు సంస్థలు విమానాలను రద్దు చేసే నిర్ణయం తీసుకోక తప్పలేదు. మార్చి 15 నుంచి 31 మధ్యలో ఇండిగో 488 విమానాలను క్యాన్సిల్ చేయగా.. గోఎయిర్ మార్చి 15 నుంచి 22 వరకు 138 విమానాలను రద్దు చేసింది.



6 గంటల్లో కట్టిన బ్రిడ్జి.. 6 రోజుల్లో కూలింది

- **ఫ్లోరిడాలో కుప్పకూలిన పాదచారుల వంతెన, ఆరుగురు మృతి**

ఫ్లోరిడా, మార్చి 16: ఫ్లోరిడాలో బ్రిడ్జి కుప్పకూలిన ఘోర ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరికొంత మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వద్ద కొత్తగా నిర్మించిన పాదచారుల వంతెన ఉన్నట్టుండి కుప్పకూలడంతో శిథిలాల కింద పలు వాహనాలు చిక్కుకున్నాయి. శిథిలాలకింద ఇంకా చిక్కుకున్న వారిని గుర్తించేందుకు జాగిలాల ద్వారా పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. 950 టన్నుల బరువైన బ్రిడ్జి కింద పలు వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఫ్లోరిడాలోనే అత్యంత రద్దీ అయిన రోడ్డుపై జరిగిన ప్రమాదం కావడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే సూచన ఉన్నట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు. ప్రమాదంలో గాయపడ్డ పది మందిని ఇప్పటికే స్థానిక ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

ఏబీసీ విధానంలో నిర్మించిన బ్రిడ్జి

యూనివర్సిటీని, నగరాన్ని అనుసంధానం చేసేలా 174 అడుగుల (53 మీటర్లు) ఎత్తున్న ఈ బ్రిడ్జి నిర్మించారు. 8 లైన్ల హైవేపై ఆరుగంటల్లోనే ఈ బ్రిడ్జిని శనివారం నిర్మించారు. గత ఆగస్టులో ఇక్కడి బిజీ రోడ్డును దాటుతుండగా యూనివర్సిటీ విద్యార్థి మృతి చెందిన కారణంగా పాదచారుల వంతెనను నిర్మించాల్సి వచ్చింది. బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్న కారణంతో యాక్సలరేటెడ్ బ్రిడ్జి కన్‌స్ట్రక్షన్ (ఏబీసీ) విధానంలో, 14.2 మిలియన్ డాలర్లతో దీన్ని నిర్మించారు. సెల్ఫ్ ప్రొపెల్డ్ మాడ్యులర్ ట్రాన్స్‌పోర్టేషన్ విధానంలో అమెరికాలో నిర్మించిన తొలి బ్రిడ్జి ఇదే. కనీసం 100 ఏళ్ల పాటు మనగలిగేలా దీన్ని నిర్మించినప్పటికీ ఇలా కుప్పకూలడం వెనుక కారణాలేమై ఉంటాయని ప్రభుత్వం యోచిస్తోంది.

విడుదలకు ముందే రికార్డులు


● మహేష్

భారీ అంచనాల నడుమ ఏప్రిల్ 20న విడుదలకు సిద్ధమవుతున్న మహేష్ కొత్త సినిమా 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల ది విజన్ ఆఫ్ భరత్ పేరుతో విడుదలైన టీజర్‌కి వస్తున్న స్పందన చూస్తుంటే సినిమా కోసం అందరూ ఎంతగా ఎదురుచూస్తున్నారో అర్థమవుతుంది. మార్చి 6న విడుదలైన ఈ టీజర్‌కి యూ ట్యూబ్‌లో ఇప్పటివరకు దాదాపు 1 కోటి 50 లక్షల వ్యూస్, 5 లక్షల 26 వేల లైక్‌లు సంపాదించుకోవడం విశేషం. ఈ రికార్డు ఇప్పటివరకు పవన్‌కళ్యాణ్ చిత్రం 'అజ్ఞాతవాసి' పేరిట ఉంది. దాన్ని 'భరత్ అనే నేను' అధిగమించింది. ఈ చిత్రంలో మహేష్ సరసన కైరా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

ఫిలింసిటీలో స్పెషల్ సెట్


● కమల్ హాసన్


● శంకర్

కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లో 1996లో రూపొందిన చిత్రం 'భారతీయుడు'. లంచగొండి అధికారులపై ఓ స్వాంతంత్ర్య పోరాట యోధుడు చేసే పోరాటంతో సినిమా రూపొందింది. అప్పట్లో సినిమా సెన్సేషనల్ హిట్ అయ్యింది. దాదాపు 22 ఏళ్ల తర్వాత ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందనుంది. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా స్టోరీ డిస్కషన్స్ థాయ్‌లాండ్‌లో జరిగాయి. శంకర్ దర్శకత్వం అంటే గ్రాండియర్ తెరపై ఆవిష్కృతమవుతుంది. అందుకోసమని త్వరలోనే ప్రారంభం కానున్న ఈ సినిమా కోసం రామోజీ ఫిలిం సిటీలో ఓ భారీ సెట్‌ను నిర్మిస్తున్నారట. సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం శంకర్ '2.0' పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు.

'సవ్యసాచి' ఫస్ట్ పంచ్


● నాగచైతన్య

నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్ నిర్మిస్తున్న చిత్రం 'సవ్యసాచి'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''రెండు చేతులను సమర్థవంతంగా, సమానంగా ఉపయోగించే అర్జునుడ్ని 'సవ్యసాచి' అంటారు. ఈ సినిమా టైటిల్‌కి తగ్గట్టుగానే నాగచైతన్య క్యారెక్టరైజేషన్ ఉంటుంది. ఈ సినిమాలో నాగచైతన్య మాస్ అప్పీల్ చాలా కొత్తగా అనిపిస్తుంది. నిధి అగర్వాల్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. మాధవన్, భూమిక ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తారు. ఇక్కడ షూటింగ్ పూర్తయిన తర్వాత అమెరికాలో షెడ్యూల్ చేస్తాం. జూన్ 14న సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. 'బాహుబలి' తర్వాత కీరవాణి సంగీతం అందిస్తున్న సినిమా 'సవ్యసాచి' కావడం విశేషం'' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: యువరాజ్, ఫైట్స్: రామ్ లక్ష్మణ్, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.


● కేథరిన్

మ..మ.. మాస్

అభిమానులు ముద్దుగా మాస్ మహారాజాగా పిలుచుకునే రవితేజ.. ఇప్పుడు విరామం లేకుండా సినిమాలు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం రవితేజ హీరోగా సంతోశ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా కేథరిన్ త్రెసాను హీరోయిన్‌గా ఎంపిక చేశారనే వార్తలు వినపడుతున్నాయి. నిజానికి సంతోశ్ శ్రీనివాస్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ సినిమా చేయాల్సింది. కానీ పవన్ రాజకీయాలో బిజీగా అయిపోవడంతో ఆయన స్థానంలో ఇప్పుడు ఆ సినిమాను రవితేజ చేయబోతున్నారట. ఈ సినిమాలో లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నటిస్తుందని వార్తలు వచ్చినా.. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కేథరిన్ త్రెసానే రవి తేజతో నటించనుంది. రవితేజ ప్రస్తుతం కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. అలాగే తదుపరిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో 'అమర్ అక్బర్ ఆంటోని' సినిమా చేయబోతున్నారు. ఈ రెండు సినిమాలు ముగిసిన తర్వాతే సంతోశ్ శ్రీనివాస్ సినిమా స్టార్ట్ అవుతుందని అంటున్నాయి సినీ వర్గాలు.

మనం రివ్యూ

కొంచెం కిరాకు.. కొంచెం చిరాకు

'హ్యాపీడేస్'తో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నిఖిల్. 'యువత' తరువాత ట్రాక్ తప్పిన ఈ యువ కథానాయకుడికి.. 'స్వామి రారా, కార్తికేయ, ఎక్కడికి పోతావు చిన్నవాడా' చిత్రాల విజయం కొత్త ఉత్సాహాన్ని అందించింది. ఈ నేపథ్యంలో.. మళ్ళీ చాన్నాళ్ళ తరువాత కళాశాల నేపథ్యంలో నిఖిల్ ఓ సినిమా చేశాడు. అదే.. 'కిరాక్ పార్టీ'. నూతన దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా శుక్రవారం తెరపైకి వచ్చింది. ఈ సినిమాపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం..

కథాంశం

కృష్ణ (నిఖిల్) మెకానికల్ ఇంజినీరింగ్ స్టూడెంట్. ఉషారామ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చదువుతున్న కృష్ణకి అదే కళాశాలలో వివిధ బ్రాంచెస్‌లో ఫ్రెండ్స్ ఉంటారు. మొత్తం ఆరు మంది ఉన్న ఆ బ్యాచ్.. కాలేజ్ లైఫ్‌ను బాగానే ఎంజాయ్ చేస్తుంటుంది. ఇదిలా ఉంటే.. ఫైనల్ ఇయర్ స్టూడెంట్ మీరా (సిమ్రాన్ పరింజా)తో ప్రేమలో పడతాడు కృష్ణ. ఆమెని ఇంప్రెస్ చేయడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తాడు. ఈ క్రమంలో.. అతని సరదా చేష్టలకి, మంచి తనానికి ఇంప్రెస్ అయిన మీరా కూడా కృష్ణని ఇష్టపడుతుంది. అయితే ఆ విషయాన్ని కృష్ణతో నేరుగా చెప్పదు. మీరా కూడా తనని ప్రేమిస్తుందన్న విషయం కృష్ణకి తెలిసిన మరుసటి రోజే.. మీరా మృతదేహాన్ని చూసి షాకవుతాడు. ఆమె మరణం.. కృష్ణని కుంగదీస్తుంది. అంతేగాకుండా.. సాఫ్ట్‌గా ఉండే అతను రఫ్ అండ్ టఫ్‌గా మారిపోతాడు. కట్ చేస్తే.. ఇప్పుడు కృష్ణ ఫైనల్ ఇయర్. అతని ఫ్రెండ్స్‌లో ఒకడైన అర్జున్ (రాకేందు మౌళి)తో విబేధాలు వచ్చి ఉండడం వల్ల.. ఆ ఇద్దరూ కాలేజ్ ఎలక్షన్స్‌లో పోటీ చేస్తారు. ఈ పోటీలో కృష్ణ గెలుస్తాడు. ఇదే సమయంలో.. కృష్ణ ప్రవర్తన నచ్చి ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ సత్య (సంయుక్తా హెగ్డే) అతనితో ప్రేమలో పడుతుంది. కృష్ణ ఆమెని పెద్దగా పట్టించుకోడు. అయితే.. సత్య మాత్రం తన ప్రయత్నాన్ని మానుకోదు. ఇంతకీ సత్య.. కృష్ణ ప్రేమని గెలుచుకుందా? మనస్పర్థల కారణంగా విడిపోయిన కృష్ణ, అర్జున్ మళ్ళీ కలుస్తారా? అసలు మీరా ఎందుకు చనిపోయింది? తదితర ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం.


● నిఖిల్

విశ్లేషణ

కన్నడంలో విజయం సాధించిన 'కిరిక్ పార్టీ'కి రీమేక్‌గా ఈ సినిమా రూపొందింది. అయితే.. హ్యాపీడేస్‌తో మొదలు పెట్టి.. ఆ చిత్రానికి ముందు, తరువాత వచ్చిన అనేక తెలుగు చిత్రాల కలబోతలా ఈ సినిమా ఉంటుందే తప్ప ఫ్రెష్‌గా మాత్రం ఉండదు. కన్నడ వారికి ఈ తరహా సినిమాలు తక్కువ కాబట్టి.. వారికి ఈ సబ్జెక్ట్ బాగా కనెక్ట్ అయి ఉండొచ్చు. అయితే.. ఇలాంటి ఎన్నో సినిమాలను చూసేసిన మనవాళ్ళకు ఇందులో కొత్తదనం వెతికినా కనబడదు. ఏవో కొన్ని సరదా సన్నివేశాలు (కారు డిక్కీ, కృష్ణ తాతయ్య ఫ్లాష్ బ్యాక్), కొన్ని ఎమోషనల్ సీన్స్ మాత్రమే మెప్పిస్తాయి. అయితే.. స్నేహం, ప్రేమ, కాలేజ్ ఎలెక్షన్స్.. ఇలా పలు అంశాలతో సినిమా కాస్త గందరగోళంగా తయారయ్యింది. దర్శకుడు సుధీర్ వర్మ అందించిన స్క్రీన్‌ప్లే కూడా అంత ఇంప్రెసివ్‌గా అనిపించదు. అలాగే చందు మొండేటి మాటల్లోనూ మెరుపుల్లేవు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం కూడా అంతంత మాత్రమే. ఇక చిన్న చిన్న లాజిక్‌లను కూడా గాలికొదిలేశారు. కృష్ణ ఇంజినీరింగ్ చదివేది 2012లో అయితే.. 2015లో వచ్చిన 'బాహుబలి' తాలుకూ స్పూఫ్ డైలాగ్స్ వినిపిస్తుంటాయి. అలాగే కృష్ణ ఫైనల్ ఇయర్ చదివేది 2016లో అయితే.. 2017లో వచ్చిన 'ఖైదీ నెం.150, గౌతమిపుత్ర శాతకర్ణి, కాటమరాయుడు' చిత్రాల పోస్టర్లు తెరపై కనిపిస్తుంటాయి. అలాగే కాలేజ్ ఉండేది విజయవాడలో అయితే.. తెలంగాణకు చెందిన బైక్ మీద హీరో తెగ తిరిగేస్తుంటాడు. ఇవన్నీ చిన్న చిన్న విషయాలే కానీ.. ఇలాంటి విషయాలను కూడా గాలికొదిలేశారంటే దర్శకుడు ఎంత జాగ్రత్తగా ఈ సినిమాని తీశారో అర్థం చేసుకోవచ్చు.

నటీనటుల విషయానికి వస్తే.. నిఖిల్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్‌గానూ, ఫైనల్ ఇయర్ స్టూడెంట్‌గానూ లుక్స్ పరంగా వేరియేషన్ చూపించాడు. అలాగే నటన కూడా బాగుంది. కథానాయిక సిమ్రాన్ పరీంజాది ప్రథమార్థానికే పరిమితమైనపాత్ర. క్యూట్‌గా కనిపించడమే కాకుండా, చక్కగా నటించింది కూడా. ఇక రెండో హీరోయిన్ సంయుక్తా హెగ్డేది ఎనర్జిటిక్ క్యారెక్టర్. నటన, నర్తన.. ఇలా అన్ని అంశాల్లోనూ మెప్పించింది. అలాగే సిమ్రాన్ తండ్రిగా సిజ్జు నటన కూడా మెప్పిస్తుంది. మిగిలిన వాళ్ళు తమ పరిధి మేర ఓకే అనిపించుకుంటారు.

సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే.. బి.అజనీష్ లోక్‌నాథ్ సంగీతంలో 'ఎన్నెన్నో గురుతులు', 'గురువారం సాయంకాలం', 'ప్రాణమంతా సుప్రభాతం సంధ్యారాగాల కోలాహలం', 'నీలో నేను' పాటలు సాహిత్యపరంగానూ, సంగీతం పరంగానూ, విజువల్స్ పరంగానూ బాగున్నాయి. నేపథ్య సంగీతం కొన్ని చోట్ల బాగున్నా.. చాలా చోట్ల అవసరానికి మించిన బిల్డప్‌తో ఉండి చిరాకు పుట్టిస్తుంది. అద్వైత గురుమూర్తి కెమెరా వర్క్ బాగుంది. 'తను చనిపోయిన దానికంటే.. చనిపోయిన విధానమే నన్ను ఎక్కువ బాధపెట్టింది' వంటి ఒకటీ అరా డైలాగులను మినహాయిస్తే.. చెప్పుకోదగ్గ డైలాగ్స్ లేవు. నిర్మాణ విలువలు బాగున్నాయి.

చివరగా: కొంచెం కిరాకు.. కొంచెం చిరాకు

రేటింగ్: 2.5/5

-మల్లిక్ పైడి

మీ దీవెనలు పంపిస్తూనే ఉండండి..


● ఇర్ఫాన్ ఖాన్

ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్ అరుదైన వ్యాధితో బాధపడుతున్నారని.. క్యాన్సర్ అని ఊహాగానాలు ఊపందుకున్నాయి. అప్పట్లో ఇర్ఫాన్ ఖాన్ కూడా తనకు అరుదైన వ్యాధి ఉందని.. దీనిపై పది రోజుల్లో తానే వివరాలను వెల్లడిస్తానని తెలిపారు. అన్నట్లుగానే ఆయన తనకు ఎండ్రోకిన్ ట్యూమర్ అనే వ్యాధి ఉందని ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేసే సందర్భంలో మార్గరెట్ మిచెల్ చెప్పిన కొటేషన్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు ఇర్ఫాన్. ''ఒక్కొక్కసారి మనం ఊహించనది మనల్ని పెద్ద వ్యక్తులను చేస్తుంది. నాకు న్యూరో ఎండోక్రిన్ ట్యూమర్ ఉందని తెలియగానే అంగీకరించడానికి కష్టమనిపించింది. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న వారి ప్రేమ, బలం నాలో ఆశలను రేపాయి. మీ దీవెనలు పంపిస్తూనే ఉండండి. నా మాటలు వినడానికి ఎదురు చూసే వారి కోసం మరిన్ని విషయాలు చెప్పడానికి తిరిగొస్తాననని ఆశిస్తున్నాను'' అంటూ ఇర్ఫాన్ మెసేజ్ పోస్ట్ చేశారు. చికిత్స కోసం ఇర్ఫాన్ ఖాన్ విదేశాలకు వెళుతున్నట్లు కూడా తెలియజేశారు.

ఓ మంచి ప్రయత్నం

సినిమా అంటే ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే అనేది చాలా మంది దర్శకుల అభిప్రాయం. అందుకే.. సినిమాని వినోద మాధ్యమంగానే పరిగణిస్తుంటారు. అయితే అతి కొద్ది మంది దర్శకులు మాత్రమే.. సినిమాని వినోదం కోసం కాకుండా సామాజిక బాధ్యతతో కూడిన అర్థవంతమైన ప్రయత్నాలకు వేదికగా మలుచుకుంటారు. వారిలో ఒకరిగా తమిళ దర్శకుడు గోపీ నయనార్‌ను చెప్పుకోవచ్చు. నయనతార ప్రధాన పాత్రలో ఈ దర్శకుడు రూపొందించిన తమిళ చిత్రం 'ఆరమ్' తమిళ నాట ఘనవిజయం సాధించింది. ఇప్పుడు అదే చిత్రం తెలుగులో 'కర్తవ్యం' పేరుతో శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం..

కథాంశం:

నెల్లూరు జిల్లా కలెక్టర్ మధువర్షిణి (నయనతార). ఉద్యోగం అంటే.. ప్రజల కోసమే జీవించడం, పనిచేయడం అని నమ్మే మనిషి. అంతరిక్ష ప్రయోగం జరిపే ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఓ గ్రామానికి వస్తుంది మధు. ఆ ఊరికి త్రాగునీటి సమస్య ఉంటుంది. ఆ సమస్య తీర్చే ప్రయత్నంలో ఉన్నప్పుడే.. వేనాడు గ్రామానికి చెందిన బుల్లెబ్బాయ్ (రామచంద్రన్ దురైరాజ్), సుమతి (సును లక్ష్మి)ల నాలుగేళ్ళ కూతురు ధన్సిక (బేబి మహాలక్ష్మి) బోరు బావిలో పడిపోయిందని తెలుస్తుంది. దాదాపు 146 అడుగుల లోతు ఉన్న ఆ బావి.. కన్వీనర్ బాలకు చెందిన ప్రాంతంలో ఉంటుంది. నీళ్ళు పడకపోవడంతో.. ఆ బోర్ బావిని మూయకుండా అలాగే ఉంచేస్తారు. కూలీ పనికి వచ్చిన సుమతితో పాటు అక్కడికి వచ్చిన ధన్సిక.. ప్రమాదవశాత్తు అందులో పడిపోతుంది. మొదట 36 అడుగుల లోతులో ఉండిపోయిన ఆ పాపని.. అగ్నిమాపక దళం, మెడికల్ టీమ్ సహాయంతో పైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుంది మధు. అయితే.. ఆ ప్రయత్నం విఫలమై మళ్ళీ బావిలో పడుతుంది పాప. ఈ సారి 93 అడుగుల లోతుకి వెళుతుంది. పాపను బయటకు తీసుకురావడానికి సరిపడ సాంకేతిక పరికరాలేవీ అందుబాటులో లేకపోవడంతో.. మధు ఏం చేస్తుంది? చివరకు ఆ పాప బోర్ బావి నుంచి బయటపడిందా? లేదా? అన్నదే ఈ చిత్ర కథాంశం.


● నయనతార

విశ్లేషణ

మనం నిత్యం దినపత్రికల్లోనూ, టీవీ ఛానళ్ళలోనూ చూసే 'బోర్ బావి' దుర్ఘటనల ఆధారంగా అల్లుకున్న కథ ఇది. దీనికి త్రాగునీటి సమస్యని జతచేస్తూ దర్శకుడు గోపీ నయనార్ తయారుచేసుకున్న కథ ఆలోచన రేకెత్తించేలా ఉంది. ఒకవైపు అంతరిక్ష ప్రయోగాల కోసం కోట్లల్లో ఖర్చు పెట్టే ప్రభుత్వం.. మరో వైపు బోర్ బావుల్లో ప్రమాదవశాత్తు పడిపోయిన పిల్లలను కాపాడుకోవడానికి వందల్లో వేలల్లో కూడా ఖర్చు పెట్టకపోవడం గురించి సూటిగా ప్రశ్నించే విధానం ఆలోచింపజేసేలా ఉంటుంది. వాస్తవికతకు అద్దం పడుతూ.. సినిమాని తీర్చిదిద్దిన విధానం ప్రశంసనీయం. అలాగే ఓ మహిళా కలెక్టర్ ఇలాంటి పరిస్థితుల్లో ఎదుర్కొనే సమస్యలను కూడా చక్కగా ఆవిష్కరించారాయన. ప్రజల కోసం ఆలోచించే ఆ కలెక్టర్ పాత్రని ఆయన తీర్చిదిద్దిన తీరు కూడా బాగుంది. ఇలాంటి అధికారులు ఉంటే.. ప్రజలకు ఎదురయ్యే ఎలాంటి సమస్య అయినా పరిష్కారమవుతుందన్నట్లుగా ఆ పాత్రను చూపించారు. అదేవిధంగా.. ప్రభుత్వం అంటే ప్రజలే అని చెప్పే సంభాషణలు ఆకట్టుకునేలా ఉంటాయి. విచారణకి వచ్చిన మాజీ కలెక్టర్, ఓ ప్రభుత్వ అధికారి(రాజా కృష్ణమూర్తి)కి మధ్య నడిచే విచారణ నేపథ్యంలో సినిమాని ఆద్యంతం ఆసక్తికరంగా మలుచుకున్న విధానం బాగుంది. నటీనటుల విషయానికి వస్తే.. కలెక్టర్ మధు వర్షిణి పాత్రలో నయనతార ఒదిగిపోయారనే చెప్పాలి. పాత్రలో చాలా హుందాగా కనిపించారు. ప్రజల సమస్యకి వెంటనే స్పందించే సందర్భాల్లోనూ.. పాపని కాపాడడానికి చర్యలు తీసుకునే సందర్భాల్లోనూ.. రాజకీయ నాయకుల మాటలకు నొచ్చుకునే సందర్భాల్లోనూ.. ధన్సిక అన్న భాను (మాస్టర్ విఘ్నేష్)ని మోటివేట్ చేసే సందర్భంలోనూ.. పాప ప్రాణాలతో బయటపడ్డాక సంతోషాన్ని వ్యక్తం చేసే సందర్భంలో.. ఆమె నటన మెప్పిస్తుంది. పాప తల్లిదండ్రులుగా నటించిన రామచంద్రన్ దురైరాజ్, సును లక్ష్మి నటన కూడా సహజంగా ఉంది. మిగిలిన నటీనటులంతా కూడా ఎవరి పాత్రల్లో వాళ్లు చక్కగా నటించారు. సాంకేతికంగా చూస్తే.. జిబ్రాన్ సంగీతంలో 'పిడుగులు పడినా' పాట సన్నివేశాల్లో గాఢతని పెంచింది. అలాగే నేపథ్య సంగీతం అడుగడుగునా సినిమా మూడ్‌ని ఎలివేట్ చేస్తూనే ఉంది. ఓం ప్రకాశ్ ఛాయాగ్రహణం.. సినిమా చూస్తున్న ఫీలింగ్‌ని కాకుండా.. వాస్తవ పరిస్థితులను కళ్ళ ఎదుటే చూస్తున్నామన్నట్లుగా చక్కగా కుదిరింది. ఎడిటింగ్ కూడా బాగుంది. 'వాంతులు, విరేచనాలకు, కలరాకు మందు ఉంది.. దాహంతో చనిపోయే వాళ్ళకు మందు ఏది? దానికి నీళ్ళే మందు', 'ప్రజలకు ఏది అవసరమో అదే చట్టం కావాలి కానీ మనం ముందే రాసి దాన్ని ప్రజల మీదకు రుద్దకూడదు', 'అంతరిక్షంలోకి వెళ్ళడం గొప్ప కాదు.. అధఃపాతాళానికి వెళ్లి వచ్చేవాడు గొప్ప', 'పదవి వల్ల వచ్చే అధికారం వద్దు.. ప్రజలు ఇచ్చే అధికారం కావాలి', 'నా డ్యూటీ.. పై అధికారులను కన్విన్స్ చేయడం కాదు.. ప్రజలకు సేవ చేయడం' వంటి పలు డైలాగులు అర్థవంతంగా, ఆలోచింపజేసేలా ఉన్నాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి.

చివరగా: ఓ మంచి ప్రయత్నం

రేటింగ్: 3/5

-మల్లిక్ పైడి

ఏక్ దో తీన్...


ఏక్ దో తీన్.. అంటూ 'తేజాబ్' చిత్రం కోసం మాధురీ దీక్షిత్ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఆమె కెరీర్ బెస్ట్ డాన్సింగ్ హిట్స్‌లో ఈ పాట ఒకటి. ఇప్పుడు ఇదే పాటని 'బాఘీ 2' కోసం రీమిక్స్ చేస్తున్నారు. అందాల తార జాక్వలిన్ ఫెర్నాండేజ్ ఈ పాటలో ఆడిపాడనుంది. మల్టీపుల్ కలర్స్ డ్రెస్‌లో హాట్ హాట్‌గా కనిపిస్తున్న జాక్వలిన్. ఈ పాటకి తన డాన్సులతో, అందాలతో కొత్త కలర్ ఇవ్వనుందని తాజాగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ చెప్పకనే చెబుతోంది. మాధురీ దీక్షిత్ కెరీర్‌లోనే ఐకానిక్ సాంగ్‌గా నిలిచిన ఈ పాటలో తను ఎంత కష్టపడి డాన్స్ చేసినా.. ఒరిజనల్ సాంగ్‌ను మించి చేయడం మాత్రం కష్టమేనని నిజాయతీగా ఒప్పేసు కుంది జాక్వలిన్. అహ్మద్ ఖాన్, గణేశ్ ఆచార్య నత్యాలు సమకూర్చిన ఈ పాట.. మాధురికి తాము ఇస్తున్న ప్రేమపూర్వక బహుమతిగా చెప్పుకొస్తోంది చిత్ర యూనిట్. టైగర్ ష్రాఫ్, దిశా పటాని హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి అహ్మద్‌ఖాన్ దర్శకత్వం వహించారు. తెలుగులో విజయం సాధించిన 'క్షణం' ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 30న తెరపైకి రానుంది.


● జాక్వలిన్ ఫెర్నాండేజ్

అవినీతి అంతమెలా?

ఎ1.. ఎ2లకు ప్రధాని అపాయింట్‌మెంటా.. ఇది ప్రజల్లోకి ఎలాంటి సందేశం పంపుతుంది

- పోలవరంపై పవన్ వ్యాఖ్యలు అర్థరహితం
- అమరావతి గురించి ఆయనకేం తెలుసు
- చెడ్డవాడినైతే 40 ఏళ్లు రాజకీయాల్లో ఎలా
- చివరి బడ్జెట్‌లోనూ ఏపీకి తీరని అన్యాయం
- మండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- విభజన హామీలు అమలు చేయాలని తీర్మానం
- శాసనమండలి మంగళవారానికి వాయిదా



అమరావతి, మార్చి 16 (మనం ప్రతినిధి): ఆస్తుల కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఏ1, ఏ2లకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారని, వాళ్లు అలా కలిస్తే ప్రజల్లోకి ఎలాంటి సందేశం వెళ్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనమండలిలో ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి ప్రధానమంత్రిని కలిసిన కొద్దిరోజులకే ఎటాచ్‌మెంట్ తీసేశారని.. ఇలాగైతే అవినీతిపై పోరాటంలో మనం ఏం చెబుతున్నట్లని ఆయన అన్నారు. తన మీద 26 కేసులు పెట్టినా వాటిలో ఒక్కటీ రుజువు చేయలేకపోయారని, నిజంగానే తాను అంత చెడ్డవాడినైతే 40 ఏళ్లు రాజకీయాల్లో ఉండగలనా అని ప్రశ్నించారు. తమ కుటుంబ ఆస్తులన్నీ ప్రతి సంవత్సరం ప్రకటిస్తూనే ఉన్నామని గుర్తుచేశారు. ఇక ఒకో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 25 కోట్లు ఇస్తున్నట్లు పవన్ కల్యాణ్ ఆరోపించారని.. అంత డబ్బు ఎక్కడి నుంచి ఇస్తామని ప్రశ్నించారు. పవన్ ఆరోపణలకు అర్థం లేదన్నారు. తాము ఏం చేసినా పద్ధతి ప్రకారమే చేస్తామంటూ.. ఎన్డీయే నుంచి బయటకు వచ్చి అవిశ్వాసం పెట్టామని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని ఆదుకోవాలని అడిగితే.. రక్షణ శాఖ బడ్జెట్ ప్రస్తావన ఎందుకు తెస్తారని.. దేశ రక్షణను పణంగా పెట్టి ఆదుకోమని అడిగామా, మాకు దేశభక్తి లేదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. పార్లమెంటులో తమ పార్టీకి చెందిన ఎంపీలు ఇన్నాళ్ల నుంచి ఆందోళన చేస్తుంటే.. కనీసం మాట్లాడదాం రండి అని కూడా ప్రధానమంత్రి పిలువలేక పోయారని ఆయన అన్నారు. తాము గతంలో కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినా.. కేంద్ర మంత్రిపదవులు మాత్రం కోరుకోలేదన్నారు. వాళ్లు ఇస్తామంటేనే రెండు మంత్రి పదవులు తీసుకున్నామని చెప్పారు. పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఇక నీటి ఎద్దడే ఉండదని, కరువు అనేదే కనపడదని చెబుతూ.. పోలవరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని దుష్ప్రచారం చేస్తూ, ఆ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పోలవరంపై పవన్‌కు అసలు అవగాహన ఉండే మాట్లాడుతున్నారా లేకుండా మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. అలాగే రాజధానికి 1500 ఎకరాలు చాలని పవన్ కళ్యాణ్ అంటున్నారని.. అమరావతికి 33వేల ఎకరాలు ఎందుకిచ్చారని అంటున్నారని.. వాళ్లు భూములిస్తే మీకు బాధేంటని నిలదీశారు. ఆయనకసలు అవగాహన ఉందా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా కాంట్రాక్టరును కేంద్రమే నిర్ణయిస్తుందని, లేనిపోని అనుమానాలు సృష్టించి అడ్డంకులు పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

రాజధాని నిర్మాణం ఆగదు

రాజధానికి రైతులు 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించాలనుకున్నా.. రాజధాని నిర్మాణం ఆగదని ఆయన స్పష్టం చేశారు. కొత్త రాజధాని నిర్మాణానికి రూ. 15 వేల కోట్లిస్తే సరిపోతుందా.. కేంద్రానికి బాధ్యత లేదా అని ముఖ్యమంత్రి అడిగారు. అలాగే ఏపీ అసెంబ్లీ సీట్లను పెంచాలంటే డబ్బులతో పనిలేదని, అయినా పెంచడం లేదని అన్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను నీరుగార్చే పరిస్థితి వచ్చిందని, కడపలో స్టీల్ ప్లాంట్ ఎందుకు ఏర్పాటు చేయరో చెప్పాలని అడిగారు. కర్నూలులో ట్రిపుల్ ఐటీకి రూ.53 కోట్లు ఇచ్చారని, ఎయిమ్స్‌కు రూ.1618 కోట్లు కావాల్సి వస్తే రూ.34 కోట్లు మాత్రమే ఇచ్చారని సీఎం తెలిపారు.

అన్ని బడ్జెట్లలోనూ అన్యాయం

బీజేపీ ప్రభుత్వం గత నాలుగు బడ్జెట్లలోనూ రాష్ట్రానికి అన్యాయం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. చిట్టచివరగా పెట్టిన బడ్జెట్‌లో అయినా న్యాయం చేస్తుందనుకుంటే ఆ ఆశ కూడా నెరవేరలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ కష్టాలను కేంద్రం ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు అన్ని హామీలు నెరవేరుస్తామని ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన బీజేపీ.. అధికారంలోకి రాగానే మరిచిపోయిందని దుయ్యబట్టారు. ''దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయం పరంగా అట్టడుగున ఉన్నాం. మమ్మల్ని ఆదుకోవాల్సిన అవసరం కేంద్రానికి లేదా? ఎన్నికలకు ముందు మోదీ ఏపీ పట్ల ఎంతో సానుభూతి చూపించారు. ఢిల్లీని తలదన్నే రాజధాని కట్టిస్తామన్నారు.. ఆ హామీలన్నీ ఏమైపోయాయి. అమరావతి నగరం దేశానికే తలమానికం అవుతుంది. అలాంటి నగరాన్ని నిర్మించేందుకు కేంద్రం ఎందుకు సహకరించడం లేదు'' అని సీఎం ప్రశ్నించారు. చంద్రబాబు ప్రసంగం తర్వాత విభజన చట్టం హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై శాసనమండలిలో తీర్మానం చేశారు. అనంతరం మండలిని మంగళవారానికి వాయిదా వేశారు.



పవన్... మీ ఇంటి స్థలం 40 లక్షలకే ఎలా వచ్చింది

- నేను కొనబోతే 6 కోట్లు చెప్పారు
- హీరో అనే మోజుతో తక్కువకే ఇచ్చారా?
- జనసేనానిపై మంత్రి సోమిరెడ్డి ధ్వజం

అమరావతి, మార్చి 16 (మనం ప్రతినిధి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు మంగళగిరిలో ఇంటి స్థలం కేవలం 40 లక్షలకే ఎలా వచ్చిందని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నిలదీశారు. అదే ప్రాంతంలో తాను ఇల్లు కట్టుకొందామని స్థలం కోసం వెళ్తే ఆరేడు కోట్లకుపైగా చెప్పారని, మరి పవన్‌కు సినిమా హీరో అనే మోజుతో తక్కువకే ఇచ్చేశారా అంటూ ధ్వజమెత్తారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా జనసేన ఆవిర్భావ సభలో పవన్ టీడీపీపై చేసిన విమర్శలను తిప్పికొట్టారు. చంద్రబాబు, లోకేశ్‌ను విమర్శించడానికేనా ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ? అని ప్రశ్నించారు. వైసీపీ విమర్శలు, ఆరోపణలను పవన్ దత్తత తీసుకున్నారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పవన్ కూడా ఇప్పుడు వైసీపీనే అనుసరిస్తున్నట్లున్నారని, అందుకే ఆయన మిస్డ్‌కాల్ జాబితాలో చేరినట్లున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వైసీపీ మిస్డ్ కాల్ ఇస్తే సభ్యత్వం ఇచ్చేస్తోందని, ఇప్పుడు జనసేన కూడా అదే దారిలో నడుస్తోందని అన్నారు. పవన్ తన మనస్సు ఎవరి మీదైనా పారేసుకుంటాడని, ఆ తర్వాత మూడు నాలుగేళ్లకు ఆరేసుకుంటాడని ఎద్దేవా చేశారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీపై మనసు పారేసుకున్నాడని, ఆ తర్వాత ఆరేసుకున్నాడని అన్నారు. మోదీకి వ్యతిరేకంగా పోరాడతానని.. ఇప్పుడు ఒక్కసారిగా పన్నీరు సెల్వంలా ఎలా మారిపోయారో అర్థం కావడం లేదన్నారు. నిన్నటి వరకు వామపక్ష భావజాలంతో ఉన్న పవన్ పక్షపాత భావజాలానికి చేరుకున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్లను పెంచుతామన్న కేసీఆర్‌ను పొగుడుతున్న పవన్.. కాపు రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న చంద్రబాబును విమర్శించడమేంటని మండిపడ్డారు. కాపుల విషయంలో పవన్ ఏమైనా అధ్యయనం చేశారా? కాపు రిజర్వేషన్లు వద్దని చెప్పడమేనా మీ అధ్యయనం? అని ప్రశ్నించారు.

మహిళా సభ్యులకు సోమిరెడ్డి ఉగాది కానుక

మహిళా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉగాది పండుగ సందర్భంగా చిరు కానుక అందజేశారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నుంచి ప్రత్యేంగా పట్టుచీరలను తెప్పించి వారికి బహూకరించారు. తెలుగు సంవత్సరాది ఉగాదిని ప్రత్యేకంగా జరుపుకోవాలని తాను చీరలు బహుమానంగా ఇస్తున్నానని మంత్రి సోమిరెడ్డి ఈ సందర్భంగా వారితో అన్నారు.

రైతులకు రూ.3,649 కోట్ల సబ్సిడీ

రాష్ట్రంలోని రైతులకు మూడేళ్లలో ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.3,649 కోట్ల మొత్తాన్ని చెల్లించామని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటివరకు 39లక్షల హెక్టార్ల విస్తీర్ణం కోసం ప్రభావిత రైతుకుల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించామని సోమిరెడ్డి అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

టీడీపీని దెబ్బతీసేందుకు కుట్ర

- పవన్ చదివింది జగన్ స్క్రిప్ట్: ఎమ్మెల్యే చాంద్ బాషా

టీడీపీని దెబ్బ తీయడానికి కుట్ర జరుగుతోందని, పవన్, జగన్ బీజేపీతో లాలూచీ పడ్డారని కదిరి ఎమ్మెల్యే చాంద్ బాషా అన్నారు. శుక్రవారం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. పవన్ పార్టీ ఆవిర్భావ సభలో జనసేన అజెండా చదవకుండా జగన్ స్క్రిప్ట్ చదివారని విమర్శించారు. పవన్‌కు రాజకీయ అవగాహన లేదని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. విభజన హామీల సాధన కోసం సీఎం చంద్రబాబు 29 సార్లు ఢిల్లీ వెళ్లారని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మ గౌరవం కోసం ఆయన ఎన్నో అవమానాలు భరించారని చాంద్‌బాషా చెప్పారు. సీఎం చంద్రబాబుకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమని, మోదీ కంటే ముందే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన కంటే ఎక్కువ కాలం పనిచేశారని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో ఉన్న ఏ ఒక్క హామీని కేంద్రం నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యంగా ఉన్నామని, వారి వైఖరి మారకపోవడంతో హోదా కోసం మంత్రులు రాజీనామా చేశారని, ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడుతున్నారని వివరించారు. కేంద్రం పై ఎంత ఒత్తిడి పెంచినా ప్రయోజనం లేనందునే ఎన్డీయే నుంచి బయటకు వచ్చామన్నారు. రాష్ట్ర ప్రజలు, మైనారిటీలు చంద్రబాబు వెంట ఉన్నారన్నారు. బీజేపీకి ముస్లిం మైనారిటీలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

బీజేపీ.. టీడీపీ మధ్య కురుక్షేత్రం

- గెలుపు మాదే: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బీజేపీ, టీడీపీ మధ్య కురుక్షేత్రం మొదలైందని, కురుక్షేత్రంలో పాండవులు విజయం సాధించినట్లు టీడీపీ విజయం తథ్యమని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెప్పారు. శుక్రవారం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. హోదా, విభజన హామీలు అమలు చేయనందునే బీజేపీకి మద్దతు ఉపసంహరించుకున్నామన్నారు. కేంద్రంపై అవిశ్వాసం పెడతామని వైసీపీ ముందుకు వచ్చినా ప్రజలకు దానిపై విశ్వాసం లేదన్నారు. బీజేపీ పవన్, జగన్‌లతో కుమ్మక్కయిందని ఆరోపించారు. బీజేపీతో విలీనానికి వైసీపీ సిద్ధంగా ఉందని, విజయసాయిరెడ్డి నెలరోజుల నుంచి ఆ దిశగా ఢిల్లీలో జరిపిన మంతనాలు విజయవంతం అయ్యాయన్నారు. వైసీపీ ఎంపీ ఒకరు జనసేన తమతోనే ఉందని చెప్పారని, వీళ్లంతా బాబుపై కక్ష కట్టారని విమర్శించారు. ఆ పార్టీలకి ప్రజలు గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. కేసుల మాఫీకోసం వైసీపీ ప్రయత్నిస్తోందని చెప్పారు. పవన్‌తో నిరాహారదీక్ష చేయించి, ఆ తర్వాత కొన్ని హామీలు ఇచ్చి పవన్‌ను హీరో చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు వెనుక 5 కోట్ల మంది ప్రజలు ఉన్నారని చెప్పారు.

పవన్ పోటీకి వస్తే నా సత్తా చూపిస్తా: ప్రభాకర్ చౌదరి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ తనపై పోటీకి అనంతపురం వస్తే తన సత్తా ఏమిటో ఆయనకు రుచి చూపిస్తానని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'పవన్ కల్యాణ్ మీపైనే పోటీచేస్తున్నారట..' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పై విధంగా వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ బీజేపీ చేతుల్లో ఉన్నారని తాను మూడు నెలల క్రితమే చెప్పానని ఆయన వెల్లడించారు. చంద్రబాబు తర్వాత తానే ప్రత్యామ్నాయమని పవన్ భావిస్తున్నారని, అందుకే లోకేశ్‌పై ఆరోపణలు చేస్తున్నారని ప్రభాకర్‌చౌదరి అన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లు

- గృహ నిర్మాణానికి రూ. 100 కోట్లు
- ఏప్రిల్ నుంచే నిర్మిస్తాం: మంత్రి కాల్వ



అమరావతి, మార్చి 16 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా వారి ఇళ్ల నిర్మాణంకోసం రూ.100 కోట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేటాయించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఈ మేరకు అసెంబ్లీలో ప్రకటించారు. వచ్చే ఏప్రిల్ నుంచే ప్రభుత్వ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేక గృహనిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర సమాచార, గ్రామీణ గృహనిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. జర్నలిస్టుల గృహ నిర్మాణంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమై చర్చించిందని, మార్చి నెలాఖరులోగా మళ్లీ భేటీ అయి ఇళ్ల మంజూరుకు విధివిధానాలు ఖరారు చేస్తుందని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలులో ఉన్న గృహనిర్మాణ పథకాల పరిధిలోనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లను నిర్మిస్తారని తెలిపారు. సాధారణ లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీకి అదనంగా మంజూరు చేసి జర్నలిస్టులపై అధికభారం పడకుండా ఇళ్లను నిర్మిస్తారని చెప్పారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరగా అక్రిడేషన్ల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గృహనిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు.

భూకబ్జాలు.. ఇసుక మాఫియా నిజం కాదా

- బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజు ప్రశ్న

అమరావతి, మార్చి 16 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో టీడీపీ హయాంలో భూకబ్జాలు, ఇసుకమాఫియా జరగుతున్నది నిజం కాదా..? అని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి గురించి తానే అసెంబ్లీలో తొలుత మాట్లాడానని విష్ణుకుమార్‌రాజు గుర్తుచేశారు. సీట్లు, ఓట్లు గురించి రాజకీయ క్రీడలు ఆడాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు. నిన్నటి వరకు జగన్‌తో బీజేపీ ఏకమయ్యిందని.. ఇప్పుడు పవన్‌తో కలిసి కుట్ర చేస్తోందని మాట్లాడుతున్నారని, అసలు ఎవరి వెనుకా తాము ఉండాల్సిన పని లేదని చెప్పారు. వైసీపీ, టీడీపీలే కుమ్మక్కయ్యాయని, అందుకే వైసీపీలో గెలిచిన ఎమ్మెల్యేలను టీడీపీ తన పార్టీలో తెచ్చుకుందని ధ్వజమెత్తారు. రెండు పార్టీలు కలసి కేంద్రాన్ని కూల్చివేయాలని కుట్రపన్నుతున్నాయని ఆరోపించారు. ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీకి చంద్రబాబు ఎందుకు ఒప్పుకున్నారని ప్రశ్నించారు.

చిట్టా రెడీ!

- త్వరలో బుల్లితెరపై ఏపీ అవినీతి
- సర్కారు పెద్దలపై భారీ కథనం
- జాతీయ చానల్లో ప్రసారం?
- తెరవెనక చక్రం తిప్పిన బీజేపీ!
- అవినీతి గుట్టు రట్టు చేస్తాం
- ఇటీవలే చెప్పిన జీవీఎల్ఎన్
- బ్రహ్మాస్త్రాన్ని సిద్ధం చేస్తున్నారా?



(అమరావతి - మనం ప్రతినిధి)

వేల కోట్ల అవినీతి... వందల కోట్లు మెక్కేసిన నేతలు.. కేంద్ర మాజీమంత్రి ఒకరు.. రాష్ట్రంలో మంత్రివర్గంలో మరికొందరు.. త్వరలోనే చూడండి.. బుల్లితెరపై! అతి త్వరలోనే బీజేపీకి అనుకూలంగా ఉంటుందని ప్రచారంలో ఉన్న ఒక జాతీయ మీడియా చానల్లో రాబోతున్న ప్రకటన కుడి ఎడమగా ఇలాగే ఉండబోతోందట!! తమ చేతికి మట్టి అంటకుండా.. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్నాళ్లుగా జరుగుతున్న అవినీతి కార్యకలాపాల గురించి పూర్తి సాక్ష్యాధారాలతో జనం నిర్ఘాంతపోయే కథనాలు ప్రసారం చేయించడానికి పక్కా ప్రణాళికతో పథకం సిద్ధం అవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇన్నాళ్లుగా తమ అమ్ములపొదిలో దాచిపెట్టుకున్న బ్రహ్మాస్త్రాన్ని ఒక్కసారిగా బయటపెట్టి.. ప్రజల ముందుంచాలని యోచిస్తూ అందుకు మంచి సమయం కోసం వేచి చూస్తున్నట్లు సమాచారం. కేంద్ర మాజీమంత్రి ఒకరు.. మరో పార్లమెంటు సభ్యుడు, ఇంకో 'ముఖ్య' నాయకుడు, ఆయన బంధుమిత్రుల చుట్టూ ఈ అవినీతి కథలు చక్కర్లు కొడుతున్నాయని.. వాటన్నింటినీ విడుదల చేయించే పనిలో బీజేపీలోని కీలక నాయకులు కొందరు తలమునకలై ఉన్నారని తెలిసింది.

ఏపీ రాజధాని, పోలవరం ప్రాజెక్టు, నల్లధనం, విదేశాల్లో పెట్టుబడులు, ఇతర ఆర్థిక సంబంధాలు కూడా ఈ అవినీతి కథల్లో ఇమిడి ఉన్నాయని ఒక వర్గం ప్రచారం చేస్తోంది. ఇప్పటికే ఈ చిట్టా సంచలనాలకు కేంద్ర బిందువైన జర్నలిస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న ఒక జాతీయ వార్తా చానల్ వద్ద సిద్ధంగా ఉన్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. పార్లమెంటును కుదిపేస్తున్న ప్రత్యేక హోదా, అవిశ్వాస తీర్మానాలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రంపై నిప్పులు చెరుగుతున్న నేపథ్యంలో... ఒక్కసారిగా మొత్తం అందరి దృష్టిని ఈ స్కాం మీదకు మళ్లించేలా అత్యంత భారీ స్థాయిలో దీన్ని తెరమీదకు తేవాలని సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వంలోని టీడీపీ మంత్రుల రాజీనామాతో పాటు.. ఎన్డీయే నుంచి కూడా వైదొలుగుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించటంతో బీజేపీ-టీడీపీ సంబంధాలు పూర్తిస్థాయిలో తెగిపోయాయి. కొంతకాలంగా రాష్ట్రంలో బీజేపీ-టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతున్నా బీజేపీ జాతీయ నాయకత్వం నిశితంగా పరిస్థితులను అంచనా వేస్తూ తన పని తాను చేసుకుపోతోంది. ఏపీలో ఈ తరహా పరిణామాలుంటాయని ఆరు నెలల క్రితమే ఊహించిన బీజేపీ అందుకు తగ్గట్టుగానే వ్యూహానికి పదును పెడుతోంది. అసెంబ్లీలోను, బయట ఎక్కడ దొరికితే అక్కడ బీజేపీ మీద విరుచుకుపడుతున్న చంద్రబాబు దూకుడుకు కళ్లెం వేయాలంటే ఏవేం అంశాలు చేతిలో ఉన్నాయా అని బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు నిన్న మొన్నటివరకు ప్రచారం జరిగింది. ఈలోపు.. ప్రత్యేక హోదా గురించి ఒక్కసారిగా పోరు మొదలుపెట్టి బీజేపీని ఇరుకున పెట్టేలా సీఎం కూడా కొత్త వ్యూహంతో వెళ్లారు. ప్రజలకు ఒరిగేది ఏంటన్న విషయం పక్కన పెడితే.. టీడీపీ - బీజేపీ - వైసీపీల మధ్య జరుగుతున్న పోరాటం మాత్రం అందరికీ వినోదం పంచుతోంది. ఈ నేపథ్యంలోనే సర్కారీ పెద్దల అవినీతి బాగోతాన్ని తెరమీదకు తెస్తారని విశ్వసనీయ సమాచారం.

జీవీఎల్ మాటల సారాంశం అదేనా..!

తెలుగుదేశం ప్రభుత్వాన్ని, వ్యక్తిగత స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఇంతవరకు చిన్న మాట కూడా అనని బీజేపీ జాతీయ నాయకత్వం తొలిసారి అధికారికంగా విరుచుకుపడింది. చంద్రబాబు సమర్ధతను సవాల్ చేసింది. పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబును అసమర్ధునిగా అభివర్ణించడంతో పాటు.. ఆయన అవినీతిపైనా మాట్లాడారు. చంద్రబాబు మోసాలు, కుట్రలతో పాటు అవినీతిని త్వరలోనే త్వరలోనే బయటపెట్టనున్నట్టు విలేకరుల సమావేశంలో ప్రకటించటం విశేషం. గడిచిన నాలుగేళ్లలో ఎక్కడా లేనంత అవినీతి ఏపీలో చోటుచేసుకుందని, దీనికి కారణం ఎవరని ప్రశ్నించారు. భవిష్యత్ ప్రణాళికలో భాగంగానే జీవీఎల్ ఆ తరహా ఘాటు వ్యాఖ్యలు చేసినట్టు పరిశీలకులు భావిస్తున్నారు.

డెడ్‌లైన్.. 48 గంటలు

- అతిసారపై ప్రభుత్వం స్పందించాలి
- మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలి
- లేకుంటే బంద్‌కు పిలుపునిస్తా
- గుంటూరు ఘటనపై పవన్ కల్యాణ్



గుంటూరు సిటీ, మార్చి 16 (మనం న్యూస్): గుంటూరులో అతిసార సమస్యపై ప్రభుత్వం 48 గంటల్లో స్పందించకపోతే బంద్‌కు పిలుపునిస్తామని, అవసరమైతే దీక్షకు కూర్చుంటానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రోజురోజుకూ అతిసార బాధితులు, మృతుల సంఖ్య పెరుగుతోందని, ప్రభుత్వం సరైన అధ్యయనం చేసి వెంటనే ప్రజల రక్షణ కోసం మెడికల్ ఎమర్జెన్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పవన్ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుంటూరులో తాగునీరు కలుషితం కావడం వల్ల 14 మంది చనిపోతే.. మున్సిపల్ కమిషనర్ ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఇప్పటివరకు పలు రాజకీయపార్టీలు వారి స్వార్థాలకోసమే పనిచేశాయని, ఇటువంటి పరిస్థితుల్లో స్వార్థాన్ని విడిచి స్వచ్ఛందంగా పనిచేయాలని హితవు పలికారు. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న గుంటూరులోనే ఈ పరిస్థితి ఉంటే.. అమరావతి రాజధానిని ప్రపంచ పటంలో ఎలా చూపిస్తారని పవన్ ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై ప్రజాప్రతినిధులు కూడా తూతూమంత్రంగానే చర్చించారని, ప్రజా సమస్యలను తుంగలోతొక్కే హక్కు ఎవరికీ లేదని మండిపడ్డారు. కొన్నేళ్లుగా గుంటూరు నగర కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించలేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికలు జరిగి ఉంటే కనీసం కార్పొరేటర్లకైనా ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే వారని పవన్ అభిప్రాయపడ్డారు. అనంతరం డయేరియాతో మృతి చెందిన షేక్ బీబీ జాన్ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వైసీపీ అసెంబ్లీకి రావాల్సిందే

వైసీపీ అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదాపై ఏ రాజకీయ పార్టీకి స్పష్టత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు తనకుందని.. ఎవరైనా ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోనని హెచ్చరించారు.

నిరాహార దీక్ష చాన్సివ్వం!

- 48 గంటల్లో సమస్య పరిష్కారం
- బాధితులకు అండగా ప్రభుత్వం ఉంది
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు
- మంత్రులు నక్కా ఆనంద్ బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణ



అమరావతి, మార్చి 16 (మనం ప్రతినిధి): గుంటూరులో అతిసార బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రులు ఆనంద్ బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణ, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం వీరంతా కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌కు నిరాహార దీక్ష చేపట్టే అవకాశం ఇవ్వబోమని, 48 గంటలలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.ఈ నెల 5 నుంచి ఇప్పటివరకు ప్రతి రోజూ పరిస్థితిని ముఖ్యమంత్రి సమీక్షిస్తూనే ఉన్నారని తెలిపారు. ఆయన ఆదేశాల ప్రకారమే తాము క్షేత్రస్థాయిలో అన్ని చర్యలు చేపట్టామని, ఇంటింటికి సర్వే చేసి, 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని చెప్పారు. బ్రహ్మానంద రెడ్డి స్టేడియం వద్ద వాటర్ ట్యాంకులు కలుషితం అయ్యాయని, అందుకు బాధ్యులైన 8 మందిని సస్పెండ్ చేశామని తెలిపారు. మొత్తం 130 మంది ఆసుపత్రిలో చేరారని, ప్రస్తుతం ఆ సంఖ్య 82కు తగ్గిందని చెప్పారు. మరణించిన వారు ఎంతమందో నిర్ణయించడానికి ఒక కమిటీ వేశామని, మృతుల కుటుంబాలకు చంద్రన్న బీమా కాక 5 లక్షలు చెక్కులు పంపిణీ చేశామని వివరించారు. రోగులకు అవసరమైతే కార్పొరేట్ వైద్యం చేయిస్తున్నామని, ఆ ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. బాధ్యులైన శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి ప్రయత్నిస్తున్నామని, తాము ఆసుపత్రికి వెళ్లి రోగులను పరామర్శించామని అన్నారు. వాటర్ ట్యాంక్‌లను సూపర్ క్యూరినేషన్ చేయిస్తున్నామన్నారు. 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైప్ లైన్లు మార్చడానికి టెండర్లు పిలిచామని, కలెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సురక్షిత మంచి నీటిని ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ సంఘటనను రాజకీయం చేయడం తగదని తెలిపారు. ఎవరైనా నిర్మాణాత్మక సలహా ఇస్తే స్వీకరిస్తామన్నారు.





సెంచురీ 50 లక్షల పరుపుల తయారీ

హైదరాబాద్: సెంచురీ మ్యాట్రీస్ హైదరాబాద్ ప్లాంట్ నుంచి వరల్డ్ స్లీప్ డే సందర్భంగా 50 లక్షల పరుపులను ఉత్పత్తి చేసినట్లు ప్రకటించింది. ఈ సంస్థ గత 30 ఏళ్ళుగా పరుపుల తయారీ వ్యాపారంలో ఉంది. కాగా కంపెనీ వివిధ రకాల పరుపులు (కాయిర్, ఫోమ్, స్ప్రింగ్, హైబ్రిడ్) తయారు చేస్తోంది. గత ఐదేళ్ళ నుంచి అత్యధికంగా అమ్ముడుపోతున్న బ్రాండ్లలో సెంచురీ చేరింది. సెంచురీ మ్యాట్రెస్ 1988 లో హైదరాబాదులో ఉత్పత్తి మొదలు పెట్టింది. తరువాత భువనేశ్వర్ (ఒరిస్సా) కు తమ వ్యాపారాన్ని విస్తరించింది. అది 12 సంవత్సరాలలో 10 లక్షల పరుపులను విక్రయించింది. కాగా గత 3 సంవత్సరాల లోనే పది లక్షల పరుపులను విక్రయించడం ఈ బ్రాండ్‌కున్న ప్రాచుర్యాన్ని సూచిస్తోంది.

saiprasad
GROUP OF COMPANIES

సాయి ప్రసాద్ గ్రూప్ ఆస్తుల వేలం

న్యూఢిల్లీ: సాయి ప్రసాద్ గ్రూప్ కంపెనీలకు, దాని డైరెక్టర్లలో ముగ్గురికి చెందిన 69 ఆస్తులను స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబి' ఏప్రిల్ 20న వేలం వేయనుంది. మహారాష్ట్ర కేంద్రంగా ఉన్న ఆ సంస్థ అక్రమ ఇన్వెస్ట్‌మెంట్ పథకాల ద్వారా సేకరించిన వేలాది కోట్ల నిధులను రాబట్టుకునేందుకు ఆ గ్రూప్ ఆస్తులను వేలం వేస్తున్నారు. అందులో భాగంగా, సాయి ప్రసాద్ ఫుడ్స్, సాయి ప్రసా ద్ కార్పొరేషన్, సాయి ప్రసాద్ ప్రాపర్టీస్‌ల ఆస్తులు వేలానికి రానున్నాయి. డైరెక్టర్లుగా వ్యవహరించిన బాలాసాహెబ్ భాప్కర్, శశాం క్ భాప్కర్, వందన భాప్కర్‌ల ఆస్తులు కూ డా వేలం వేయనున్నారు. ఈ కంపెనీలకు, డైరెక్టర్లకు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో భూములు, ఆఫీసు, వాణిజ్య వసతి సదుపాయా లు ఉన్నాయని భారతీయ సెక్యూరిటీలు, ఎ క్స్ఛేంజి బోర్డు (సెబి) ఒక నోటీసులో పేర్కొంది. దీనికి సంబంధించి 69 ఆస్తుల అమ్మకానికి తనకు సహకరించవలసిందిగా హె చ్.డి.ఎఫ్.సి రియల్టీని 'సెబి' కోరింది. వాటి మొత్తం రిజర్వు ధరగా రూ. 14 కోట్లను నిర్ణయించింది. బిడ్‌ను సమర్పించడానికి ముందు ఆ ఆస్తులకు సంబంధించిన అన్ని వివరాలను బిడ్డర్లే సరి చూసుకోవాలని 'సెబి' పేర్కొంది.



ఎస్.ఆర్.టి.ఇ.పి.సి కార్యాలయ ప్రారంభం

కోయంబత్తూరు: సింథటిక్ అండ్ రేయాన్ టెక్స్‌టైల్స్ ఎగుమతి ప్రోత్సాహ మండలి (ఎస్.ఆర్.టి.ఇ.పి.సి) దక్షిణాదిన ఉనికిని పెంచుకునే లక్ష్యంతో శుక్రవారంనాడు కోయంబత్తూరులో ప్రాంతీయ కార్యాలయాన్ని తెరిచింది. ఇండియన్ మ్యాన్-మేడ్ ఫైబర్ టెక్స్‌టైల్ (ఎం.ఎం.ఎఫ్.టి) ఎగుమతులను ప్రోత్సహించేందుకు సర్వోన్నత ఎగుమతి ప్రోత్సాహక సంస్థగా ఎస్.ఆర్.టి.ఇ.పి.సిని 1954లో నెలకొల్పారు. దీనిలో 3000లకు పైగా సంస్థలు సభ్యులుగా ఉన్నాయి. అవి ముంబయి, సూరత్, భివాండి, పానిపట్, ఈరోడ్, మాలెగాంవ్ వంటి చోట్లనున్న ప్రధాన ఎం.ఎం.ఎఫ్.టి క్లస్టర్లలో అవి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. సదరన్ ఇండియా మిల్స్ అసోసియేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రాంతీయ కార్యాలయాన్ని టెక్స్‌టైల్ కమిషనర్ కవితా గుప్తా ప్రారంభించారు. ఎం.ఎం.ఎఫ్.టి ఎగుమతిదార్లకు 150కి పైగా దేశాలలో ఉన్న కొనుగోలు దార్లతో లాభదాయకమైన సంబంధాలు ఏర్పరచడంలో, అవి స్థిరంగా కొనసాగేట్లు చేయడంలోఎస్.ఆర్.టి.ఇ.పి.సి కీలక పాత్ర వహించిందని దాని చైర్మన్ నారాయణ్ అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలో మొదటి 10 ఎం.ఎం.ఎఫ్.టి ఎగుమతిదార్లలో ఇండియా నిలిచేట్లుగా చేసింది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, సి.ఐ.ఎస్, మధ్య ప్రాచ్య దేశాల వంటి ప్రవర్ధమాన, నూతన మార్కెట్లలో వివిధ ఎగుమతుల ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించింది. మానవ తయారీ వస్త్రాల ఎగుమతులు పెంపొందించడంలో, ఎగుమతుల సంస్కృతిని ఒంటబట్టించుకునేట్లు చేయడంలో మండలి పరిణామశీల పాత్ర వహించింది.



రాజకీయ ప్రభావంతో మార్కెట్ల పతనం

510 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్

10,200 పాయింట్ల దిగువకు నిఫ్టీ

ముంబయి: బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' శుక్రవారంనాడు దాదాపు 510 పాయింట్లు కోల్పోయి 33,176 పాయింట్ల స్థాయి వద్ద ముగిసింది. ఫిబ్రవరి 6 తర్వాత, ఒకే రోజులో అది అంత ఎక్కువగా క్షీణించడం ఇదే మొదటిసారి. ప్రపంచ వాణిజ్య ఆందోళనలు, జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్.డి.ఏ) నుంచి తెలుగు దేశం పార్టీ (టి.డి.పి) వైదొలగడమే కాక, ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడంతో రాజకీయంగా రేగిన కలకలం భారీ అమ్మకాలకు పురికొల్పాయి. ప్రపంచ వాణిజ్య యుద్ధానికి ఉన్న అవకాశంతో మదుపరులు చిరుబుర్రులాడడంతో ఆసియాలోని ఇతర మార్కెట్లు కూడా నెగెటివ్ జోన్‌లోకి జారుకున్నాయి. దేశీయ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడిని వేగవంతం చేశాయని బ్రోకర్లు చెప్పారు.

వరుసగా మూడవ వారంలో షేర్లు నష్టాల్లో ముగిశాయి. 'సెన్సెక్స్' ఈ వారం మొత్తంమీద 131.14 పాయింట్ల పతనాన్ని నమోదు చేయగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' 31.70 పాయింట్లను



కోల్పోయింది. రాజకీయ రంగంలో తాజా పరిణామంతో సెంటిమెంట్ దెబ్బతింది. ఎన్.డి.ఏలో కీలక మిత్రపక్షమైన టి.డి.పి కూటమి నుంచి వైదొలగాలని నిర్ణయించుకోవడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడంతో షేర్ల అమ్మకాలు మరింత వేగం పుంజుకున్నాయని బ్రోకర్లు చెప్పారు. సభలో గందరగోళం నెలకొనడంతో, పరిస్థితి సజావుగా లేదని స్పీకర్ సుమిత్ర మహాజన్ సభను రేపటికి వాయిదా వేశారు. దాంతో అవిశ్వాస తీర్మాన నోటీసులను లోక్ సభ శుక్రవారంనాడు చేపట్టలేకపోయింది. ''అంతర్జాతీయ వాణిజ్యంపై అమెరికా పాలనా యంత్రాంగ ప్రస్తుత పథకాలు, దేశీయంగా రాజకీయ అస్థిరతలతో మదుపరులలో అప్రమత్త ధోరణి కొనసాగడంతో మార్కెట్ క్షీణించింది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు. 'సెన్సెక్స్' ఫిబ్రవరి 6న 561.22 పాయింట్లు క్షీణించగా, శుక్రవారం 509.54 పాయింట్లు క్షీణించింది. ఇంట్రా-డేలో అది 33,119.92-33,691.32 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. లోహాలు, చమురు, సహజ వాయువు, పి.ఎస్.యు, విద్యుత్, మోటారు వాహనాలు, బ్యాంకింగ్ రంగ షేర్లు విస్తృత నష్టాలను చవిచూశాయి. 'సెన్సెక్స్' గత మూడు సెషన్లలో 232.40 పాయింట్లు కోల్పోయింది.

ఎన్.ఎస్.ఇ 'నిఫ్టీ' 10,200 స్థాయికన్నా దిగువకు పడిపోయి, 165 పాయింట్లు కోల్పోయి 10,195.15 పాయింట్ల వద్ద ముగిసింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు గురువారం రూ. 705.40 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు.

టాటా గ్రూప్‌కు 'టాటా' చెప్పిన రాజన్




చెన్నై: టాటా సన్స్ ఛీఫ్ ఎథిక్స్ ఆఫీసర్ ముకుంద్ గోవింద్ రాజన్ టాటా గ్రూప్ నుంచి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో సంస్థ నుంచి వైదొలగుతున్నట్లు రాజన్ తెలిపారని, రానున్న నెలల్లో వ్యవస్థాపక సామర్థ్యాన్ని నిరూపించుకోగల ప్రయత్నాలు చేయనున్నట్లు సూచించారని టాటా సన్స్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. టాటా గ్రూప్‌లో ఆయన పదవీ కాలం మార్చి 31తో ముగియనుంది. కొందరు ఉద్యోగులతో కలసి టాటా టెలీ సర్వీసెస్ ఫైబర్ ఆస్తులను 1 బిలియన్ డాలర్లతో స్వాధీనం చేసుకునేందుకు చేసిన ప్రతిపాదనతో ఆయన ఇటీవల వార్తల కెక్కారు. ప్రైవేటు ఈక్విటీ ఫండ్ టి.పి.జి, మరో పెన్షన్ ఫండ్ అందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ముందుకొచ్చాయి. రాజన్ (49) టాటా గ్రూప్‌లో 23 ఏళ్ళకు పైనే గడిపారు. రతన్ టాటా, సైరస్ మిస్త్రీ, ఎన్. చంద్రశేఖరన్‌లు సంస్థ చైర్మన్లుగా వ్యవహరించడాన్ని ఆయన చూశారు. టాటా ఎడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారి అయిన రాజన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, బ్రాండ్ కస్టోడియన్, టాటా టెలిసర్వీసెస్ (మహారాష్ట్ర) లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌తో సహా వివిధ పదవులు నిర్వహించారు. ఆయన 600 మిలియన్ డాలర్ల టాటా ఆపర్చ్యూనిటీస్ ఫండ్ మేనేజింగ్ భాగస్వామిగా కూడా ఉన్నారు. ఆయన టి.టి.ఎం.ఎల్‌లో ఉన్నప్పుడు 2009లో ఆయన 'డిజిటల్ ముంబయ్' పేరుతో భారతదేశపు వేగవంతమైన ట్రిపుల్ ప్లే సర్వీసు అమలుపరిచారు. ప్రతి ఇంటికి 100 ఎంబిపిఎస్ ఫైబర్‌తో సేవలందించిన పథకమది. మొబైల్, ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్ నికర చందాదార్ల జోడింపులలో ఆయన ఆ కంపెనీని అగ్ర స్థానానికి తీసుకెళ్ళారు. టాటా టెలిసర్వీసెస్ బోర్డులో పిన్న వయస్కుడైన డైరెక్టర్‌గా రాజన్ ఖ్యాతి వహించారు. ఆయన 2000 దశకం ఆరంభంలో విదేశ్ సంచార్ నిగమ్ బోర్డులోనూ సేవలందించారు. ఆయన హయాంలో టాటా బ్రాండ్ ఇంటర్‌బ్రాండ్, బ్రాండ్ ఫైనాన్స్ రెండు సంస్థలతోనూ ఉత్తమ భారతీయ కార్పొరేట్ బ్రాండ్ అనిపించుకుంది.

రికార్డు స్థాయిలో గోధుమల దిగుబడి



న్యూఢిల్లీ: ప్రభుత్వం 2017-18 పంట సంవత్సరానికి సంబంధించి గోధుమల దిగుబడి అంచనాలను పెంచుతూ సవరించవచ్చు. గోధుమల ఉత్పత్తి గత ఏడాది నాటి రికార్డు స్థాయి 98.51 మిలియన్ టన్నులను ఈ ఏడాది కూడా చేరవచ్చునని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎస్.కె. పట్టనాయక్ చెప్పారు. శుక్రవారంనాడు ఇక్కడ మొదలైన మూడు రోజుల కృషి ఉన్నతి మేళా సందర్భంగా పట్టనాయక్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ గత నెలలో తన రెండవ ముందస్తు అంచనాలో గోధుమల దిగుబడి 1.42 శాతం తగ్గి, జూన్‌తో ముగుస్తున్న ప్రస్తుత పంట సంవత్సరంలో 97.11 మిలియన్ టన్నులుగా ఉండగలదని పేర్కొంది. పంట విస్తీర్ణం నాలుగు శాతం తగ్గడం వల్ల దిగుబడులు కూడా తగ్గవచ్చని భావించింది. కానీ, ఇప్పుడు పంట పరిస్థితి బాగుందని, పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లలో దిగుబడులు మెరుగ్గా ఉండగలవని భావిస్తున్నామని పట్టనాయక్ తెలిపారు. ఆహార ధాన్యాల అంచనాలు ప్రతి దశలోనూ సవరణకు లోనవుతాయని ఆయన గుర్తు చేశారు. అధిక దిగుబడులు దృష్టిలో ఉంచుకుని గోధుమ ఉత్పత్తి అంచనాలను పెంచుతూ సవరించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కర్నాల్‌లోని గోధుమ పరిశోధన సంస్థ, క్షేత్ర వాస్తవికతను దృష్టిలో పెట్టుకుని, ఈ ఏడాది గోధుమ ఉత్పత్తి 100 మిలియన్ టన్నుల మేరకు ఉండగలదని పేర్కొందని, దానితో పోలిస్తే మంత్రిత్వ శాఖ అంచనా సంప్రదాయబద్ధంగానే ఉందని ఆయన అన్నారు. అంతిమ దిగుబడిని ప్రకటించడానికి ముందు, పంట నాలుగు దశల్లో ఉండగా ప్రభుత్వం నాలుగు ముందస్తు అంచనాలను విడుదల చేస్తుంది. భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ), ఇతర ఏజన్సీలు కొన్ని చోట్ల గోధుమ కొనుగోలు కూడా మొదలుపెట్టాయి.

నీరవ్ వజ్రాలు మేలిమివేనా?




ముంబయి: నీరవ్ మోదీ కుంభకోణం తర్వాత, వజ్రాల పరిశ్రమ తాలూకు మార్కెట్ స్థయిర్యం దెబ్బతింది. వజ్రాల నగలలోని మేలిమి గురించి కొనుగోలుదార్లు ఆందోళన చెందుతున్నారని, అది వ్యాపారం క్షీణించడానికి దారితీసిందని ఒక సర్వేలో వెల్లడైంది. ప్రసిద్ధ బ్రాండెడ్ నగల తయారీ సంస్థలు మేలిమి సర్టిఫికెట్లు జారీ చేస్తాయి. కానీ, ఈ వ్యాపారంలో అధిక భాగం ఇప్పటికీ అవ్యవస్థీకృత మార్కెట్‌లోనే ఇప్పటికీ కేంద్రీకృతమై ఉంది. ఆ వ్యాపారం వినియోగదార్లకు, నగల తయారీ సంస్థలకు మధ్య నమ్మకంపై ఆధారపడినదేనని 'అసోచామ్' నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. ''ప్రస్తుతం ఈ నమ్మకం సడలిపోయింది. వజ్రాల నగల వర్తక రంగానికి లభించిన అపారమైన ప్రతికూల ప్రచారం దృష్ట్యా వినియోగదార్లు అవకాశాలు తీసుకునేందుకు సుముఖంగా లేరు. పైగా, మేలిమి సర్టిఫికెట్లు జారీ చేసే బ్రాండెడ్ షోరూములు చాలా వరకు మహా నగరాలకే పరిమితమై ఉన్నాయి. చిన్న నగరాలలో తగినంత కొనుగోలు శక్తి ఉన్నా దుకాణాలు లేవు'' అని ఆ సర్వే వెల్లడించింది. ఢిల్లీ-ఎన్.సి.ఆర్, ముంబయి, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, చండీగఢ్, డెహ్రాడూన్‌లలో 350 నగల సంస్థల్లో ఈ సర్వే నిర్వహించారు. సర్వే నిర్వహించిన ప్రధాన నగరాలలో 65 శాతం మంది నగల వర్తకులు అవ్యవస్థీకృత రంగంలోనే ఉన్నారు. వారు వజ్రాల నగల తయారీని తాత్కాలికంగా పక్కన పెట్టి సంప్రదాయ సిద్ధమైన పూర్తి బంగారు, వెండి నగల తయారీ వైపు మళ్ళుతున్నారు. వజ్రాలు లేదా రత్నాల వంటివాటి మేలిపై వినియోగదారులు నమ్మకం కోల్పోతున్నారు. పి.ఎన్.బిలో కుంభకోణం బయటపడడానికి ముందు కొనుగోలు చేసిన వజ్రాల నగల మేలిమి, ప్రామాణికతలను తిరిగి నిర్ధరించవలసిందిగా కోరుతూ, అవి నిఖార్సు అయినవేనా అని అడుగుతూ కస్టమర్ల నుంచి వస్తున్న ఆరాల సంఖ్య పెరిగిందని చాలా మంది నగల వర్తకులు చెప్పారు. వజ్రాల నగల డిమాండ్ రెండు నెలల లోపలే 10-15 శాతం తగ్గిందని సర్వేలో తేలింది.

Edelweiss

స్వాధీన యత్నం విరమించిన ఇడెల్‌వెయిస్ ఫైనాన్షియల్

ముంబయి: రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు చెందిన సెక్యూరిటీల వ్యాపారాన్ని స్వాధీనం చేసుకునే ప్రతిపాదనను విరమించుకుంటున్నట్లు ఇడెల్‌వెయిస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ శుక్రవారంనాడు వెల్లడించింది. నియంత్రణ సంస్థ నుంచి అవసరమైన అనుమతులు పొందడంలో రెలిగేర్ విఫలమవడం వల్ల తాము ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటున్నట్లు ఇడెల్‌వెయిస్ తెలిపింది. శుక్రవారం ట్రేడింగ్ మొదట్లో రెలిగేర్ షేర్ ధర దాదాపు 5 శాతం క్షీణించింది. కానీ, వెంటనే కోలుకుని చాలా వరకు నష్టాలు పూడ్చుకుని 1.3 శాతం క్షీణతతో మాత్రమే నిలిచింది. ఇడెల్‌వెయిస్ షేర్ ధర 1 శాతం పెరిగింది. రుణ భారం పెరుగుతూపోతున్నందు వల్ల కలత చెందిన రెలిగేర్ తన యూనిట్లలో ఒక్కొక్కదాన్నీ విక్రయిస్తూ వస్తోంది. తన ఆరోగ్య బీమా వ్యాపారాన్ని ప్రైవేటు ఈక్విటీ సంస్థ ఒకటి కొనుగోలు చేస్తుందని రెలిగేర్ జనవరిలో ప్రకటించింది. ఫ్రాడ్ ఇన్వెస్టిగేటివ్ ఏజన్సీ ఎస్.ఎఫ్.ఐ.ఓ రెలిగేర్ కంపెనీ వ్యవహారాలపై దర్యాప్తు జరుపుతోంది. దాని ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, షివీందర్ సింగ్‌ల అనుచిత ప్రవర్తనకు సంబంధించి ఆ దర్యాప్తు సాగుతోందని గత నెలలో ఒక వార్తా కథనం వెల్లడించింది. అయితే, దర్యాప్తు గురించి తమకు అధికారిక కమ్యూనికేషన్ ఏదీ అందలేదని కంపెనీ ప్రకటించింది. రెలిగేర్‌కు చెందిన సెక్యూరిటీల వ్యాపారాన్ని సుమారు 38.5 మిలియన్ డాలర్లకు కైవసం చేసుకోనున్నట్లు ముంబయి కేంద్రంగా ఉన్న ఇడెల్‌వెయిస్ గ్రూప్‌నకు చెందిన వెల్త్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఇడెల్‌వెయిస్ ఫైనాన్షియల్ 2017 డిసెంబరులో ప్రకటించింది. భారతీయ ఎసెట్, వెల్త్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో తన స్థితిని విస్తరించుకునేందుకు అలా స్వాధీనానికి దిగాలనుకుంటున్నట్లు చెప్పింది. ''అంగీకారం కుదిరిన గడువు లోపల, అవసరమైన అనుమతులు సంపాదించడంలో విక్రేత నిస్సహాయత వల్ల, కట్టుబాటు ఒప్పందం మార్చి 15తో ముగిసింది'' అని ఇడెల్‌వెయిస్ శుక్రవారంనాటి ప్రకటనలో తెలిపింది.

రూ. 222 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల విక్రయం



న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల ఆరంభ ఇష్యూలో ఇండియా రూ. 222 కోట్ల విలువ చేసే బాండ్లను విక్రయించింది. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వదలచుకున్న దాతలు తమ వివరాలు వెల్లడించకుండా షెడ్యూల్డు బ్యాంకుల నుంచి ఆ బాండ్లను కొనుగోలు చేయవచ్చని శుక్రవారంనాడు పార్లమెంట్‌కు తెలియజేశారు. ఆరంభ ఇష్యూ మార్చి 1న మొదలై చందాలకు 10 రోజులు అందుబాటులో ఉంది. ''పథకం మొదటి ఇష్యూ కింద ఎలక్టోరల్ బాండ్ల అమ్మకం ద్వారా 2018 మార్చి 9 నాటికి వసూలైన మొత్తం రూ. 222 కోట్లు ఉంది'' అని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్ లోక్‌సభకు ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చే విధానాన్ని ప్రక్షాళన చేసే చర్యగా 2017-18 సంవత్సరపు కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 'ఎలక్టోరల్ బాండ్ల'ను ప్రవేశపెట్టారు. రుణ సాధనాల మాదిరి కాకుండా ఈ బాండ్లు ప్రామిసరీ నోట్లను పోలినవిగా ఉంటాయి. బ్యాంకులను మధ్యవర్తులుగా చేసుకుని దాతలు రాజకీయ పార్టీలకు నిధులు ఇచ్చేందుకు ఇవి వీలు కల్పిస్తాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన కొన్ని శాఖల్లో ఈ బాండ్లు అందుబాటులో ఉన్నాయి. ''ఈ పథకం కింద జారీ చేసే, ఎలక్టోరల్ బాండ్లను నగదుగా మార్చే అధీకృత బ్యాంకు ఎస్.బి.ఐ ఒక్కటే'' అని ఆయన తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని ఈ ఏడాది జనవరిలో నోటిఫై చేసినట్లు ఆయన మరో ప్రశ్నకు జవాబుగా చెప్పారు. జనవరికి బదులుగా ఆరంభ ఇష్యూ ఈ నెలలో మొదలైంది. బాండ్లు మార్చి 1 నుంచి 10 వరకు కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. ఈ వడ్డీ రహిత బ్యాంకింగ్ సాధనాన్ని భారతదేశ పౌరులు లేదా భారతదేశంలో రిజిస్టరైన కంపెనీలు కొనుగోలు చేయవచ్చు. ''బాండ్ గడువు 15 రోజులు. రిజిస్టరైన రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు మాత్రమే వాటిని ఉపయోగించుకోవచ్చు. కడచిన లోక్ సభ లేదా శాసన సభ ఎన్నికల్లో అవి ఒక శాతం కన్నా తక్కువ ఓట్లు తెచ్చుకున్నవి కాకూడదు'' అని మంత్రి తెలిపారు. ఆ పథకం కింద ఏప్రిల్, జూలై, అక్టోబర్‌లలో కూడా 10 రోజుల చొప్పున ఆ బాండ్లు కొనుగోలుకు అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు. సాధారణ ఎన్నికలు జరిగే ఏడాదిలో అదనంగా మరో 30 రోజుల వ్యవధిని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది.

''దాతల పేరును గోప్యంగా ఉంచడంతోబాటు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చే వ్యవస్థలో పారదర్శకత కల్పించేందుకు ఎలక్టోరల్ బాండ్ పథకం రూపొందింది'' అని ఆయన తెలిపారు. కె.వై.సి పాటించిన ఖాతా ద్వారా మాత్రమే చెల్లింపులు జరిపి బాండ్లను కొనవచ్చు. అర్హత కలిగిన రాజకీయ పార్టీ అధీకృత బ్యాంకులో ఉన్న బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే దాన్ని నగదుగా మార్చుకోగలుగుతుంది. రిజిస్టరైన రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు అదనపు బ్యాంకింగ్ సాధనంగా మాత్రమే ఎలక్టోరల్ బాండ్‌ను రూపొందించారని మంత్రి తెలిపారు. జారీ అయిన తేదీ నుంచి 15 రోజుల లోపల మాత్రమే బాండ్ చెల్లుబాటు అవుతుంది. గడువు ముగిసిన తర్వాత డిపాజిట్ చేసే బాండ్‌కు చెల్లింపులు ఉండవు. రాజకీయ పార్టీ బాండ్‌ను డిపాజిట్ చేయడంతోనే ఆ మొత్తం దాని ఖాతాలో జమ అవుతుంది.



పెరిగిన వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: భారత దేశపు వాణిజ్య లోటు 2018 ఫిబ్రవరిలో 11,979.21 మిలియన్ డాలర్ల మేరకు ఉంటుందని అంచనా. ఇది 2017 ఫిబ్రవరిలో ఉన్న 9,521.73 మిలియన్ డాలర్లకన్నా 25.8 శాతం ఎక్కువని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డాటా వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో దేశం నుంచి ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరం అదే నెలతో పోలిస్తే డాలర్ల రూపంలో 4.48 శాతం పెరిగాయి. కానీ, రూపాయలలో చూసినప్పుడు ఎగుమతుల వృద్ధి పేలవంగా 0.27 శాతంగా ఉంది. భారతీయ కరెన్సీ మారకం విలువ తగ్గడం ఆ విధంగా ప్రతిబింబించింది. పెట్రోలియం ఉత్పత్తులు, ఆర్గానిక్, ఇనార్గానిక్ రసాయనాలు, ఔషధాలు, బియ్యం, ఎలక్ట్రానిక్ వస్తువుల అధిక ఎగుమతుల నేపథ్యంలో ఎగుమతుల్లో వృద్ధి కనిపించింది. 2017 ఫిబ్రవరిలో 24,726.71 మిలియన్ డాలర్ల మేరకు ఉన్న ఎగుమతులు 2018 ఫిబ్రవరిలో 25,834.36 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అయితే, రూపాయలలో చూస్తే, 2017 ఫిబ్రవరిలో 1,65,855.64 కోట్ల మేరకు ఉన్న ఎగుమతులు ఈ ఏడాది ఫిబ్రవరిలో 1,66,305.72 కోట్ల మేరకు నమోదయ్యాయి. ఈ ఫిబ్రవరిలో దిగుమతులు పెరిగాయి. (డాలర్ల రూపంలో) అవి 10.41 శాతం పెరిగాయి. పెట్రోలియం, క్రూడ్, ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, యంత్రాలు, యంత్రపరికరాలు, ఎలక్ట్రికల్, నాన్-ఎలక్ట్రికల్ వస్తువులు, ముత్యాలు, విలువైన, పాక్షికంగా విలువైన రత్నాలు, బొగ్గు, కోక్, బ్రికెట్లు తదితర వస్తువుల దిగుమతులు పెరిగాయి. 2017 ఫిబ్రవరిలో 34,248.44 మిలియన్ డాలర్ల మేరకు ఉన్న దిగుమతులు 2018 ఫిబ్రవరిలో 37,813.57 మిలియన్ డాలర్లకు పెరిగాయి.

దుస్థితి సూచనలు

పెరుగుతున్న వాణిజ్య లోటు, బలహీనపడుతున్న భారతీయ కరెన్సీ పట్ల ఇ.ఇ.పి.సి ఆందోళన వ్యక్తం చేసింది. ఇంజనీరింగ్ ఎగుమతులు డాలర్ల రూపంలో దాదాపు 2 శాతం, రూపాయల రూపంలో సుమారుగా 6 శాతం తగ్గడం, 2018 ఫిబ్రవరిలో మొత్తంమీద ఎగుమతుల వేగం మందగించడం మనస్తాపం కలిగిస్తోందని పేర్కొంది. ''ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్న సమయంలో భారతీయ ఎగుమతులు తడబడడం చూస్తే ఇంకా ఎక్కువ ఇబ్బందిగా ఉంది. వాణిజ్య యుద్ధం లాంటి పరిస్థితి తలెత్తుతున్న సమయంలో మనకు మున్ముందు పరిస్థితులు మరింత జటిలం కావచ్చు'' అని ఇ.పి.పి.సి ఇండియా చైర్మన్ రవి సెహగల్ అన్నారు. భారతదేశపు ముడి చమురు దిగుమతుల బిల్లు 2017 ఫిబ్రవరిలో 32.05 శాతం అధికంగా 10,194.33 మిలియన్ డాలర్ల మేరకు ఉంది. ప్రపంచ బ్యాంక్ కమోడిటీ ప్రైస్ డాటా ప్రకారం, 2017 ఫిబ్రవరితో పోలిస్తే, 2018 ఫిబ్రవరిలో గ్లోబల్ బ్రెంట్ ముడి చమురు ధరలు 17.90 శాతం పెరిగాయని అధికారిక ప్రకటన ఒకటి వెల్లడించింది.

మనం రియల్
శనివారం, 17 మార్చి 2018
www.manamnews.com



ఫర్నీచర్‌తో నింపితే..!

ఇంట్లోని గదుల స్థలంలో చాలా వరకు నిరుపయోగంగా పడి ఉంటుంది. గది మూలల్లో ఇవి ఎక్కువగా ఉంటాయి. ఈ ప్రదేశాన్ని సాధారణ ఫర్నీచర్‌తో నింపితే పెద్దగా ఉపయోగం ఉండదు. గది మూలల్లో ముఖ్యంగా గమనించాల్సింది గోడలు ఎంత విస్తారంలో ఉన్నాయో గుర్తించాలి. చట్టుపక్కల ఎటువంటి ఫర్నిచర్ ఉందో చూసుకోవాలి. ఇది ఏ గదిలో ఎక్కువగా ఉందో చూసుకోవాలి. మూలల్లో మంచాన్ని అమర్చుకుంటే పూర్తిగా సద్వినియోగం చేసుకోవచ్చు. కొన్ని గదుల్లోని మూలల్లో దుస్తుల హ్యాంగర్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. గదినిబట్టి మూలల్లో చిన్న షెల్ఫ్‌లు అమర్చి కుటుంబ సభ్యుల ఫొటోలను ఏర్పాటు చేసుకోవచ్చు. కొన్ని గదుల్లో మూలల్లో ఉండే స్థలాన్ని బట్టి చిన్న స్టడీ యూనిట్‌ను డిజైన్ చేసుకోవచ్చు. దీనిలోనే పుస్తకాలు, ఇతర వస్తువులు, కంప్యూటర్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిని మూసివేస్తే ఓ ఉడెన్ యూనిట్‌లా కనిపిస్తుంది. కిచెన్‌లో మ్యాజిక్ కార్నర్ యూనిట్‌ను అమర్చుకోవచ్చు. దీనివల్ల స్థలం వృథాను గణనీయంగా తగ్గించవచ్చు.



మార్బుల్ మెరుపులు

సొంతింటి కలను సాకారం చేసుకొనేందుకు ఎంతగా ఆసక్తి చూపుతారో.. ఆ ఇంటిని తమ అభిరుచులకు అనుగుణంగా నిర్మించుకొనేందుకు అంతే ప్రాధాన్యమిస్తారు చాలామంది. ఇంటి యజమానులు తమ ఇష్టానికి అనుగుణంగా నిర్మించుకున్న కలల సౌధాన్ని మరింత సౌందర్యంగా, చూడముచ్చటగా అలంకరించుకోవడంలోనూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. వంటగది, పడకగది, లివింగ్ రూం, చిన్నారుల గది ఇలా.. ఎక్కడ ఏ రంగు వేయాలి. ఎలాంటి ఫ్లోరింగ్ ఎంచుకోవాలనే కాకుండా మనసుకు హత్తుకొనేవిధంగా ఫర్నిచర్ కొనాలనుకుంటారు. దీనికోసం ఎంతో ఖర్చు చేయాలనుకుంటారు. అలాగే తమ అభిరుచులకనుగుణంగా ఇంట్లో ఫ్లోరింగ్ మార్బుల్స్ వేసుకోవాలనుకుంటారు. ఈ క్రమంలో కొన్ని ఇళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లోరింగ్‌లను గమనిస్తే.. ఇంత చక్కగా అలంకరించుకోవచ్చా అనే ఆసక్తి తలెత్తకమానదు. ఇంటి అందాన్ని ఇనుమడింపజేసే ఆకర్షణీయమైన మార్బుల్స్ విఫణిలో ఇప్పుడు అందుబాటులోకి వచ్చేశాయి. మార్బుల్స్ ఖాళీగా వేసుకోకుండా వాటిని మనకు నచ్చిన రీతిలో రూపొందించుకోవచ్చు. చూడడానికి కూడా ఇవి ఎంతో అందంగా కన్పిస్తాయి. ఇంటికి వచ్చిన అతిథులను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఇంట్లో గది ప్రాముఖ్యాన్ని బట్టి వివిధ శైలుల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. వాటి ధరలు మాత్రం పరిమాణం, శైలులను బట్టి ఉంటాయి. ఇంటి నిర్మాణ సమయంలో ఫ్లోరింగ్‌కు రాయి, పలకలు, చెక్క తరచూ ఎంచుకుంటుంటాం. ఫ్లోరింగ్‌కు స్టోన్ మెటీరియల్‌నే అంతా ఇష్టపడతారు. ఈ స్టోన్‌లో మార్బుల్, గ్రానైట్‌లు అందరికీ తెలిసినవే. మార్బుల్ ఫ్లోరింగ్‌లో చాలా తరచుగా వచ్చే ప్యాట్రన్‌ను డిజైన్‌లాగా ఫ్లోరింగ్ వేసుకుంటాం. కానీ అది సాదాగా ఉంటుంది. కాబట్టి దానికి కాస్త క్రియేటివ్ టచ్ ఇస్తూ మార్బుల్స్‌పై నచ్చిన డిజైన్ ప్రింట్ చేసుకోవచ్చు. దీన్నే మార్బుల్ ఇన్‌లే వర్క్ అంటారు. దీంతో ఫ్లోరింగ్, గోడలు, పూజ గదులు.. ఇలా మనకు కావాల్సిన చోట వివిధ రకాల ప్యాట్రన్‌లను రూపొందించుకోవచ్చు. ఇన్‌లే వర్క్‌లో సాధారణమైన డిజైన్లకు చదరపు అడుగుకు రూ.450 నుంచి ధర మొదలవుతుంది. సంక్లిష్టమైన డిజైన్లకైతే అయ్యే ఖర్చు చదరపు అడుగుకు రూ. 2వేల వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



కిటికీలతో అందం!

గృహ శోభలో కిటికీలదే ముఖ్యమైన పాత్ర. ఇంట్లో అందమైన ఫర్నిచర్ లేకపోయినా కిటికీలను అందంగా తీర్చిదిద్దితే ఆ ఇంటికి వచ్చే ఆకర్షణే వేరు. కిటికీల అందాల్ని మన పూర్వికులు ముందే గుర్తించారు. అందుకే పాతకాలపు కట్టడాలకు కచ్చితంగా అందమైన కిటికీలు ఉంటాయి. వీటికి వాడే కర్టెన్లు, గాజుఫలకాల విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు.



కిటికీలకు, దర్వాజాలకు పూర్తిగా చెక్కనే వాడితే ఖర్చు చాలా అవుతుంది. అంత అందం కూడా రాదు. అందుకే ఫ్రేం వరకు చెక్కను వాడి మిగిలిన భాగం అద్దం వాడితే ఇంటికి కొత్త లుక్ వస్తుంది. ఇటీవల మార్కెట్లో పలు రకాల గ్లాస్‌లు, డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో పూర్తిగా పారదర్శకంగా ఉండే గాజు కాకుం డా కొంచెం రంగుల్లో ఉన్న గాజును (స్టెయిన్ గ్లాస్) వాడాలి. ఇంట్లోని కిటికీలు, తలుపులు, పార్టిషన్ వాల్స్, కప్‌బోర్డ్స్ వంటి వాటికి దీనిని ఉపయోగించవచ్చు. బయట కాంతి ఇంట్లోకి వచ్చే విధంగా వీటిని వాడుకో వాలి. వివిధ రంగుల కాంబినేషన్లలో ఉన్న గాజు ఫలకాలు మరింత శోభను తీసుకొస్తాయి. లివింగ్ రూం వంటి చోట్ల ఉండే చిన్న కిటికీలకు మంచి డిజైన్లు ఉన్న గ్లాస్ అమరిస్తే చూడ్డానికి బాగుంటుంది. పెద్ద కిటికీలు ఉంటే పై భాగంలో వివిధ రంగుల కాంబినేషన్లో ఉన్న గాజును వాడుకోవచ్చు.

ఇల్లు నచ్చింది!

ఇల్లు కడుతున్న ప్రాంతం బాగుంది. ఇంకేం కొనడమే తరువాయి అనుకుంటున్నారా? పెద్దలు మీకు మాత్రమే నచ్చితే సరిపోదు.. మీ పిల్లలు కూడా మెచ్చాలి. అవును! సొంతిల్లు కొంటున్నామంటే ఇప్పుడు పిల్లల అవసరాలు తీరడం కూడా ముఖ్యమే. వారిని దృష్టిలో పెట్టుకుని తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లల చదువు కోసం సొంత ఇల్లు వదిలేసి అద్దె నివాసాల్లోకి మారుతున్న తల్లిదండ్రులు ఎంతోమందిని నేడు చూస్తున్నాం. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇష్టపడి కొనుక్కున్న, ముచ్చటపడి కట్టుకున్న ఇల్లును వదిలేసి వెళ్లడం ఎవరికైనా బాధ. అయినా అలా వెళుతున్నారంటే పిల్లల భవిష్యత్తు కోసం అమ్మానాన్నలు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో తెలుస్తుంది. దీంతో సహజంగానే ఇల్లు కొనుగోలు చేసేవారి దృక్పథంలోనూ చాలా మార్పులు వస్తున్నాయి. ఇదివరకు అంతగా పట్టించుకోని చిన్నారుల అవసరాలే ఇప్పుడు గృహ కొనుగోలు నిర్ణయాలను చాలావరకు ప్రభావితం చేస్తున్నట్లు తెలుస్తోంది.






పెద్దలు మాత్రమే నచ్చితే సరిపోదు.. మీ పిల్లలు కూడా మెచ్చాలి

ధరలపై ప్రభావం

కోరుకున్న వసతులన్నీ ఉంటున్నాయంటే ఆ ప్రాంతం ఇప్పటికే ఎంతో కొంత అభివృద్ధి చెంది ఉంటుంది. సహజంగా దీని ప్రభావం ధరలపై ఉంటుంది. పేరున్న పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రజారవాణా, మాల్స్ ఉన్నట్లయితే ఎక్కువమంది ఆ చుట్టుపక్కల నివాసం ఉండేందుకు ఆసక్తి చూపుతుంటారు. దీంతో కొత్త నిర్మాణాలకు డిమాండ్ ఎక్కువే ఉంటుంది. ఇవన్నీ చూపెట్టి ఆయా ప్రాంతంలో ఉన్న ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించేవారు ఉంటారు. మూడు నాలుగు ప్రాజెక్ట్‌ల్లో ధరలు తెలుసుకోవాలి. అలానే నాణ్యమైన నిర్మాణం, గడువులోపు పూర్తిచేసే నిర్మాణదారులనే అంతిమంగా ఎంపిక చేసుకోవాలి.

ఎక్కువ సమయం గడిపేది

వాస్తవానికి ఇంట్లో ఎక్కువ సమయం గడిపేది చిన్నారులే. పెద్దలు వృత్తి, ఉద్యోగరీత్యా అధిక సమయం బయటనే గడుపుతారు. వీరితో పోలిస్తే చిన్నారులు పాఠశాల సమయం మినహా మిగతా కాలమంతా ఇంట్లోనే ఉంటారు. ఇంట్లో, పరిసరాల్లో వీరి అవసరాలు తీరే వసతులు ఏ మేరకు ఉంటున్నాయనేది కీలకం. సౌకర్యాలంటే ప్రత్యేకంగా వారికంటూ ఒక గది.. అందులో నచ్చేట్లుగా ఉండే రంగులు, ఇంటీరియర్ మాత్రమే కాదన్నది నేటితరం పిల్లల భావన. బయట పరిసరాలు వీరిని ఎక్కువ ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి కేవలం బాల్యం వరకే కాదు పెరిగి పెద్దయ్యే వరకు చుట్టుపక్కల తగిన వసతులు ఉండేలా చూడడం పెద్దల బాధ్యత. కొత్తగా పెళ్లైన దంపతులు సైతం ఇల్లు కొనేటప్పుడు పిల్లల గురించీ పరిగణనలోకి తీసుకోవడం మర్చిపోవద్దు.



ఏ మేరకు అందుబాటులో...

తాము పనిచేసే కార్యాలయానికి దగ్గరగా ఉందా అనేదాని కంటే.. పిల్లలకు విద్య, వైద్యం, వినోదం ఏ మేరకు అందుబాటులో ఉంది.. ఆటపాటలకు సౌకర్యాలు ఎలా ఉన్నాయని కొనుగోలుదారులు చూడాలి. మంచి పాఠశాలలు దగ్గర్లో ఉన్నాయో లేదో చూసుకోవాలి. పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఏదైనా అనారోగ్యం బారినపడినా సత్వరం ఆసుపత్రికి తీసుకెళ్లగలిగేటంత దూరంలో వైద్య సదుపాయాలు ఉన్నాయా? లేవా? అనేది చూడడం ముఖ్యమే. పిల్లలకే కాదు ఇంట్లో పెద్దలకూ వైద్యం చాలా ముఖ్యం. ఈ రెండింటికి అర్ధరాత్రి అపరాత్రయినా చేరుకునేలా రవాణా సదుపాయాలు ఉండడం అన్నింటికంటే ముఖ్యం. పార్కులు, థియేటర్లు, మాల్స్, రెస్టారెంట్లు ఉన్నాయో లేవో కూడా కొనుగోలుదారులు చూస్తున్నారని నిర్మాణదారులు అంటున్నారు.

వసతులపై దృష్టిపెట్టి

ప్రస్తుతం మార్కెట్లో చాలా ప్రాజెక్ట్‌లు పిల్లల వసతులపై దృష్టిపెడుతున్నాయి. వారు ఆటలాడుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తున్నాయి. తక్కువ స్థలంలో నిర్మాణాలు చేపడుతూ, ఖాళీ స్థలం ఎక్కువ ఉండేలా పచ్చదనానికి పెద్దపీట వేస్తున్నాయి. పెద్దలే కాదు పిల్లల కోసం వేర్వేరు ప్లే కోర్టులను తమ ప్రాజెక్ట్‌లో చేపడుతున్నాయి. చిన్నారులకు ప్రత్యేకంగా తక్కువ లోతులో ఈతకొలనులు నిర్మిస్తున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల కోసం ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్పిస్తుంటారు. నలుగురైదుగురు పిల్లలు ఒకరింట్లో చేరితే అక్కడికి మాస్టార్లు వచ్చి బోధిస్తుంటారు. అయితే ఇంట్లో టీవీ, లేదా కుటుంబ సభ్యుల రాకపోకలతో పిల్లల్లో ఏకాగ్రత దెబ్బతింటుంది. ఈ దృష్ట్యా కొన్ని నిర్మాణసంస్థలు అపార్ట్‌మెంట్‌లో ట్యూషన్ గదులను నిర్మిస్తున్నాయి. వ్యాపకాలు, అభిరుచులకు పదను పెట్టేలా చిన్నారుల కోసం ప్రత్యేకంగా క్లబ్‌హౌస్‌లు నిర్మించడం నేటి పోకడగా ఉంది. ఉద్యోగాలకు వెళ్లిన తల్లిదండ్రుల కంటే పిల్లలు పాఠశాల నుంచి ముందుగానే ఇంటికి చేరుకుంటారు. అమ్మానాన్న వచ్చేవరకు వీరు క్లబ్‌హౌస్‌లో ఇతర నైపుణ్యాలను పెంపొందించుకునే కార్యక్రమాల్లో పాల్గొనే సదుపాయం కల్పిస్తున్నాయి. ఈ తరహా ప్రాజెక్ట్‌లో నచ్చితే కొనుగోలు చేయవచ్చు. కేవలం ఆ ప్రాంగణంలోనే ఇవన్నీ ఉండాలని కాదు.. నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఇటువంటి వసతులున్నా ఫర్వాలేదు. ఆయా ప్రాంతాల్లో సొంతింటిని కట్టుకోవచ్చు.



ముందస్తు అంచనాతో...

సౌకర్యాలతో వృద్ధిపథంలో ఉన్న ప్రాంతంలో ధరలు మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. పెరిగే లోపే నిర్ణయం తీసుకోవడం లాభిస్తుంది. ఆ ధరలను సైతం అందరూ భరించలేరు. ఇల్లు కొనడంలో ఎక్కువమందికి బడ్జెట్ కీలకమే కాబట్టి వృద్ధికి ఆస్కారం ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని అనుభవజ్ఞులు సూచిస్తున్నారు. ఇటువంటి ప్రాంతాలు నగరంలో అన్నివైపులా ఎప్పటికప్పుడు విస్తరిస్తూనే ఉంటాయి. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అభివ ద్ధి ప్రకటనలను.. ఆయా ప్రాంతాలను గమనించడం ద్వారా కచ్చితమైన అభివృద్ధికి ఆస్కారం ఉండే వాటిపై ముందస్తు అంచనాకు రావొచ్చు.



చూడచక్కగా చిన్నారి లోకం

చిన్నారులున్న ఇంటి గదులుఅందంగా, ఆకర్షణీయంగా ఉండాలి. పడకగది, రీడింగ్ రూమ్... ఏదయినా సరే ఆ వాతావరణం వాళ్ల మనసుల్ని మురిపించాలి. అది నిజమేకానీ, అదెలా అంటారా... ఇదిగో ఇలా! పిల్లల కోసం రూపొందించిన కొన్ని గదుల లుక్‌ని మీరే చూడండి. పసుపు వర్ణంలో అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ గది గోడలపై పేపర్‌తో చేసిన సీతాకోక చిలుకల్ని అతికించారు. లేడి తల ఆకారాన్ని పోలివుండే ‘మార్నిన్ ల్యాంప్’ నుంచి కాంతులు వెదజల్లేలా అమర్చారు. ఇది పిల్లలకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం. పిల్లల్లో సృజనాత్మకత కోసం బెడ్ రూమ్‌లోనే చాక్‌బోర్డులను కూడా ఏర్పాటుచేయడం ఈ గది ప్రత్యేకత. గోడ మొత్తానికి రంగులు అద్దడం ఇబ్బంది అనుకుంటే.. మీకు కావాలనుకొనే చోట రంగురంగుల గట్టి ప్లైవుడ్ ముక్కలను కావాల్సిన చోట అమర్చుకోవచ్చు. ఈ గది గోడలకు రకరకాల చక్కని పెయింటింగ్ ప్రింట్లను అమర్చారు. తెల్లని ఇటుకలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. పెద్ద పెద్ద గోడల్లో అమర్చిన వివిధ రకాల రంగుల ప్రింట్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఇలాంటి గదుల్లో వుండే చిన్నారులు ఎదుగుతున్న కొద్దీ వీటిపై ఆసక్తి తగ్గేందుకు ఎక్కువ సమయమే పడుతుంది. ఈ గది ఎదుగుతున్న ఔత్సాహిక పిల్లలను దృష్టిలో వుంచుకొని రూపొందించారు. ఈ గదిలో ఏర్పాటుచేసిన చాక్‌బోర్డ్ పిల్లలకు స్క్రిబ్లింగ్ ప్యాడ్‌గా ఉపయోగపడుతుంది. చాక్‌బోర్డులోనే చంద్రుని ఆకారంలోని ల్యాంప్ ఏర్పాటు గదికి మరింత కళను తీసుకొస్తుంది. పిల్లలు గోడపైకి ఎక్కేందుకు వీలుగా మెట్లు ఏర్పాటుచేశారు. చిన్నారుల్లో వ్యాయామ ప్రక్రియ పట్ల ఆసక్తిని పెంచేందుకు ఈ ఏర్పాటు ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ చిత్రానికి కుడివైపున కొన్ని బొమ్మలు వుంచారు. చిన్నారులు ఏ బొమ్మ అయినా కావాలనుకుంటే ఎక్కి తీసుకొనేందుకు వీలుగా షెల్ఫ్‌లు ఏర్పాటు చేశారు.





ఇంట్లోనే జలకాలాట

వేసవి వస్తే చాలు.. స్విమ్మింగ్ పూల్‌లో జలకాలాటల్లో మునిగిపోవాలని చాలామంది కోరుకుంటారు. కాకపోతే స్థలం కొరత కార ణంగా, కొంతమందే సొంతంగా పూల్‌ని ఏర్పాటు చేసుకుంటారు. కొందరి ఇళ్లల్లో బాత్‌టబ్ ఉన్నప్పటికీ, వాడకంలో కొన్ని పరిమితులుంటాయి. తాజాగా ‘డ్యూరవిట్’ సంస్థ బ్లూమూన్, సన్‌డెక్ అనే రెండు ఆధునిక పూళ్లను డిజైన్ చేసింది. ఆస్ట్రియన్ డిజైనర్ రూపొందించిన పూళ్ల ద్వారా ఇంట్లోనే ఈత కొడుతున్న అనుభూతిని పొందవచ్చని సంస్థ అంటోంది. తెల్లటి యాక్రీలిక్, సరైన వుడ్ ప్యానెళ్లను వాడటం వల్ల ఇవి చూడటానికి అందంగా కన్పిస్తాయి. దీనిని వాడాల్సిన అవ సరం లేనప్పుడు దానిపైన లెదర్ కవర్ కప్పేయ వచ్చు. ఈ పూళ్లు మనం కోరుకున్న డిజైన్లలో లభిస్తాయి. నిల్వ చేసే నీటిని 3 నెలల దాకా వాడుకోవచ్చని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

సెమీస్‌లో సింధు

ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో సెమీస్ చేరిన రియో స్టార్

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగుతేజం, రియో ఒలింపిక్ స్టార్ సింధు చెలరేగి పోతోంది. హ్యాట్రిక్ విక్టరీతో సెమీస్‌లో అడుపెట్టి పతకంపై ఆశలు పెంచింది. వందేళ్లకుపైగా చరిత్రగల ఈ టోర్నీలో తొలి సారి సెమీస్‌లో అడుగుపెటి కొత్త చరిత్ర సృష్టించింది.



బర్మింగ్ హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్, రియో ఒలింపిక్ రజత పతక విజేత సింధు విజయపరంపర కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సింధు 20-21, 21-18, 21-18 స్కోరుతో జపాన్ సంచలనం నొజోమి ఒకుహరాను చిత్తు చేసి సెమీస్‌లో అడుగుపెట్టి టైటిల్‌కు చేరువైంది. సెమీస్‌లో సింధు రెండో సీడ్ యమగుచి (జపాన్), ఐదోసీడ్ కరోలిన్ మారిన్ (స్పెయిన్)ల మధ్య విజేతతో పోటీపడుతుంది. ఏడో సీడ్ ఒకుహరాతో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌లో ఓడినా ఆ తర్వాత సత్తా చూపెట్టింది. ప్రపంచ ర్యాంకుల్లో మూడో స్థానంలో ఉన్న సింధుకు తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి అనుకోని ప్రతిఘటన ఎదురైంది. వరుస ర్యాలీలతో బెంబేలెత్తించిన ఒకుహర 20-21 తేడాతో కష్టపడి తొలి గేమ్‌ను గెలచుకుంది. ఆ తర్వాత వ్యూహం మార్చిన సింధు ఆధిక్యత మొదలుపెట్టింది. దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థి బలహీనతలను సొమ్ము చేసుకుని అద్భుతమైన స్మాష్‌లతో ఆధిక్యతను కొనసాగించింది. ఈ గేమ్‌లోనూ సింధుతో సమానంగా ఆడినప్పటికీ కీలకమైన సమయంలో చేసిన పొరపాట్లతో ఒకుహర చిత్తయిపోయింది. రెండో గేమ్‌లో గెలిచిన ఉత్సాహంతో ఆట మొదలు పెట్టిన సింధు మూడో గేమ్ ఆరంభంలో వరుసగా సాధించిన పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఓ దశలో ఒకుహర సింధుకు చేరువగా వచ్చినప్పటికీ పదే పదే పొరపాట్లు చేయటంతో ఒత్తిడికి గురైంది. గంటా 25 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో చివరికి సింధుదే పై చేయి అయింది. ఈ విజయంతో ఒకుహరతో ఆడిన పది మ్యాచ్‌లో సింధు ఐదో విక్టరీతో సమం చేసింది.

అంపైర్ పొరపాట్లతోనే ఓటమి: శ్రీకాంత్



బర్మింగ్ హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనాలు సాధిస్తాడనుకున్న భారత స్టార్ శ్రీకాంత్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టటడం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. నిరుడు సంచలన విజయాలతో ఈ టోర్నమెంట్‌లో హాట్ ఫేవరిట్‌గా బరిలో దిగిన శ్రీకాంత్ భారత్‌కు పతకం గెలుచుకోవటం ఖాయమని అభిమానులు ఆశలుపెట్టుకున్నారు. అభిమానులను నిరాశపరిచిన శ్రీకాంత్ ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చైనా అన్‌సీడెడ్ ఆటగాడు హంగ్ యాంగ్ చేతిలో 11-21, 21-15, 20-22 స్కోరుతో చిత్తయిపోయాడు. అయితే తన ఓటమికి కొత్త నిబంధనలే కారణంగా కనిపిస్తోందని, చాలా సర్వీస్ ఫాల్ట్‌లు ప్రకటించారని, ఇలా జరుగుతుందని తాను ఊహించలేదని మ్యాచ్ ముగిశాక అన్నాడు. మొదటి రౌండ్ మ్యాచ్‌లో ఎలాంటి సర్వీస్ ఫాల్ట్‌లు లేవని, రెండో రౌండ్ మ్యాచ్‌లో మొత్తం మారిపోయిందని శ్రీకాంత్ తెలిపాడు. అర్థంలేని నిబంధనలు అంటూ శ్రీకాంత్ అసంతృప్తిని వ్యక్తం చేశాడు.

కొత్త నిబంధనలతో కష్టాలు

ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య కొన్ని కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. ఇందులో అతి ముఖ్యమైంది 1.15 మీటర్ల ఎత్తుకంటే తక్కువగా ప్రత్యర్థికి సర్వీస్ చేయాల్సి ఉంటుంది. నిరుడు జర్మన్ ఓపెన్‌లో తొలి సారిగా ప్రవేశపెట్టిన ఈ నిబంధనపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. భారత డబుల్స్ స్పెషలిస్ట్ సిక్కిరెడ్డి అంపైర్లు తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల వీడియోలను ట్విట్టర్లో పోస్ట్ చేసి నిరసన తెలిపింది. రోజుకో నిబంధనతో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య తమ కెరీర్‌తో ఆడుకుంటోందని, విజయాలు సాధించటం కోసం ఏళ్ల తరబడి పడ్డ కష్టాన్ని పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్ ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి జంట పరాజయం పాలైంది. వందలో ఒక్కరు కూడా ఈ సర్వీస్ నిబంధనను ఆమోదించటం లేదని తెలిపింది. ఈ నిబంధనపై భారత ఆటగాళ్లు సింధుతో పాటు ప్రఖ్యాత ఆటగాళ్లు లిన్ డాన్, లీ చెంగ్ వి, విక్టర్ అలెక్సెన్‌లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ఆటగాళ్ల పట్ల వివక్షేనని భారత కోచ్ పుల్లెల గోపీచంద్‌తో పాటు డెన్మార్క్‌కు చెందిన కెన్నెత్ జాన్సెన్ చెప్పాడు.



భారత్ ప్రత్యర్థి బంగ్లా

ఉత్కంఠ పోరులో శ్రీలంక చిత్తు

కొలంబో: బంగ్లాదేశ్ మరో సంచలనం సృష్టించింది. ఉత్కంఠ భరితంగా సాగిన టి20 ట్రై సిరీస్ చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసింది. బౌలింగ్‌లో చెలరేగి లంకను 159 పరుగులకే కట్టడి చేసిన బంగ్లా ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ ప్రతాపం చూపెట్టింది. చివరి ఓవర్ వరకూ విజయం దోబూచులాడినా మరో బంతి మిగిలి ఉండగానే బంగ్లా జట్టు విజయం సాధించింది. ఈ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టిన బంగ్లా జట్టు ఆదివారం టైటిల్ కోసం భారత్‌తో ఆడుతుంది.

ఆదుకున్న కుశాల్, తిసారా

టాస్ గెలిచిన బంగ్లాదేశ్ లంకకు బ్యాటింగ్ అప్పగించింది. గాయం తర్వాత జట్టులోకొచ్చిన ఆల్‌రౌండర్ షకిబుల్ హసన్ అందించిన ఉత్సాహంతో బంగ్లా బౌలర్లు రెచ్చిపోయి శ్రీలంకకు చుక్కలు చూపెట్టారు. 41 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టి లంక టాపార్డర్‌ను కుప్పకూల్చారు. ఈ తరుణంలో కుశాల్ పెరీరా (41 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్స్‌తో 61 రన్స్), తిషారా పెరీరా (37 బాల్స్‌లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 58రన్స్) హాఫ్ సెంచరీలతో రాణించి లంకను ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 97 రన్స్ పార్ట్‌నర్ షిప్ అందించి లంక పరువు కాపాడారు. లంక బౌలర్లలో ముస్తాఫిజుర్ 2, షకిబ్, రుబెల్, మొహిది సర్కార్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.

శ్రీలంక ఇన్నింగ్స్:

గుణతిలక (సి) షబ్బీర్ (బి) షకిబ్ 4, కుశాల్ మెండిస్ (సి) సౌమ్య సర్కార్ (బి) రెహ్మాన్ 11, కుశాల్ పెరీరా (సి) హసన్ మిర్జా (బి) సౌమ్య సర్కార్ 61, ఉపుల్ తరంగ (రనౌట్) 5, షణక (సి) ముస్తాఫిఖుర్ (బి) రెహ్మాన్ 0, అజంతా మెండిస్ (సి) ముస్తాఫిజుర్ (బి) హసన్ మిర్జా 3, తిసారా పెరీరా (సి) ఇక్బాల్ (బి) రుబెల్ హసన్ 58, ఉడానా (నాటౌట్) 7, ధనంజయ (నాటౌట్) 1, మొత్తం :20 ఓవర్లలో 159/7, వికెట్ల పతనం : 1-15, 2-22, 3-31, 4-32, 5-41, 6-138 ,7-154.

బౌలింగ్: షకిబుల్ హసన్ 2-0-9-1, రుబెల్ హసన్ 4-0-41-1, ముస్తాఫిజుర్ రెహ్మాన్ 4-1-39-2, హసన్ మిర్జా 4-0-16-1, మహ్మదుల్లా 4-0-29-0, సౌమ్య సర్కార్ 2-0-21-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:

తమీమ్ ఇక్బాల్ (సి) పెరీరా (బి) గుణతిలక 50, లిటన్ దాస్ (సి) పెరీరా (బి) ధనంజయ 0, షబ్బీర్ రెహ్మాన్ (స్టంప్) పెరీరా (బి) ధనంజయ 13, ముస్తాఫిఖుర్ రహీమ్ (సి) పెరీరా (బి) అపొన్సో 28, సౌమ్య సర్కార్ (సి) పెరీరా (బి) అజంతా మెండిస్ 10, మహ్మదుల్లా (నాటౌట్) 43, షకిబుల్ హసన్ (సి) ధనంజయ (బి) ఉడానా 7, హసన్ మిర్జా (రనౌట్) 0, రెహ్మాన్ (రనౌట్) 0, రుబెల్ హుస్సేన్ (నాటౌట్) 0, మొత్తం 19.5 ఓవర్లలో 160/8.


వికెట్ల పతనం:

1-11, 2-33, 3-97, 4-105, 5-109, 6-137, 7-148, 8-148.

బౌలింగ్: ఫెర్నాండో 1-0-10-0, ధనంజయ 4-0-37-2, అపొన్సో 3-0-19-1, పెరీరా 2-0-20-0, గుణతిలక 3-0-24-1, అజంతా మెండీస్ 4-0-24-1, ఉడానా 2.5-0-26-1.

అమ్మకానికి ఐపీఎల్ టిక్కెట్లు

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్-2018 టిక్కెట్ల అమ్మకాలు మొదలయ్యాయి. ఏప్రిల్ 7న ఐపీఎల్ 11వ సీజన్ ప్రారంభమవుతంది. మొదటి రోజు ముంబై వాంఖడే స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్లు ముంబాయి ఇండియన్స్ -చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి పోరు జరుగుతుంది. ఈ మ్యాచ్ కోసం టిక్కెట్ల ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలను ముంబై ఇండియన్ నిర్వాహకులు అమ్మకానికి పెట్టారు. రూ.800 నుంచి ఎనిమిదివేల వరకు అందుబాటులో ఉన్న టిక్కెట్లను ఆన్‌లైన్లో కొనుక్కోవచ్చని నిర్వాహకులుతెలిపారు. అయితే ఏప్రిల్ 14న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో జరిగే మ్యాచ్ టిక్కెట్లు మాత్రం ఆన్‌లైన్‌లో అందుబాటులో లేవు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ మ్యాచ్‌ను నిరుపేద చిన్నారులకు చూసే అవకాశం కల్పించారు.



సెమీస్‌లో ఫెదరర్

ఇండియన్ వెల్స్: వరల్డ్ నంబర్‌వన్ రోజర్ ఫెదరర్ ఇండియన్ వెల్స్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సెమీస్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 7-5, 6-1 స్కోరుతో చెంగ్ హ్యాంగ్‌ను ఓడించిన ఫెదరర్ వరుసగా ఆరోసారి ఇండియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ టైటిల్‌కు మరింత చేరువయ్యాడు. సెమీస్‌లో ఫెదరర్ క్రొయేషియా ఆటగాడు బోర్నా కోరిక్‌తో తలపడతాడు. కెవిన్ అండర్‌సన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కోరిక్ 2-6, 6-4, 7-6 (7-3) తేడాతో గెలుపొంది ఫెదరర్‌తో పోటీకి రెడీ అయ్యాడు.

వీనస్ జోరు

మహిళల సింగిల్స్ విభాగంలో అమెరికన్ స్టార్ వీనస్ సెమీస్‌లో అడుగుపెట్టింది. 2001 తర్వాత డబ్ల్యుటిపి టెన్నిస్ టోర్నీలో వీనస్ సెమీస్‌కు చేరటం ఇదే మొదటి సారి. క్వార్టర్ ఫైనల్లో వీనస్ 6-3, 6-2 తేడాతో స్పెయిన్‌కు చెందిన కార్లా సూరెజ్ నవారోను ఓడించింది.

నరైన్ యాక్షన్‌పై మళ్లీ ఫిర్యాదు

ఐపీఎల్‌కు దూరం!



కరాచి: వెస్టిండీస్ ఆఫ్ స్పిన్నర్ సునిల్ నరైన్ మళ్లీ చిక్కుల్లో పడ్డాడు. నారాయన్ బౌలింగ్ యాక్షన్ సరిగా లేదంటూ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో ఆడుతున్న సునిల్ వచ్చే ఐపీఎల్‌లో ఆడటం సందేహంగా మారింది. లాహోర్ క్వాలాండర్స్ జట్టుకు ఆడుతున్న సునీల్ బౌలింగ్ యాక్షన్ సందేహంగా ఉందంటూ బుధవారం క్వెట్టా గ్లాడియేటర్స్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం ఐసీసీకి నివేదిక ఇచ్చారు. బౌలింగ్ యాక్షన్‌పై సునీల్‌ను హెచ్చరించామని, ఈటోర్నమెంట్‌లో సునీల్ ఆటకొనసాగిస్తాడని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సునీల్ కోల్‌కతా నైట్‌రైడర్స్ తరపున ఆడాల్సి ఉంది. అయితే తాజా వివాదంతో సునీల్ ఐపీఎల్‌లో ఆడతాడో లేదా అన్న విషయంపై ఐసీసీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అంతర్జాతీయ క్రికెట్ నిబంధనల ప్రకారం సందేహాస్పందంగా బౌలింగ్ చేస్తున్నాడంటూ ఓ బౌలర్‌పై అంపైర్లు నివేదిక ఇస్తే... ఆ టోర్నమెంట్‌కు అతను దూరమవుతాడు. సునిల్ బౌలింగ్‌పై క్వెట్టా గ్లాడియేటర్స్ టీమ్ మేనేజర్ మాజీ కెప్టెన్ మొయిన్ ఖాన్ సందేహాలు వ్యక్తం చేశాడు. ఇంత వరకూ ఈ టోర్నీలో సునీల్ బౌలింగ్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. సునిల్ బౌలింగ్‌పై సందేహాలు వ్యక్తమవడం ఇది మొదటి సారి కాదు. 2015 ఇండియన్ ప్రీమియర్ లీగ్ సమయంలోనూ సునిల్ బౌలింగ్‌పై టెక్నికల్ కమిటీ సందేహాలు వెలిబుచ్చింది. అదే ఏడాది నవంబర్‌లో ఇల్లీగల్ బౌలింగ్ యాక్షన్ కారణంగా ఐసీసీ సునిల్‌ను సస్పెండ్ చేసింది. 2014 చాంపియన్స్ లీగ్‌లోనూ సునిల్‌ను మ్యాచ్ అఫిషియల్స్ రెండు సార్లు సస్పెండ్ చేశాడు. మరో సారి సునిల్ బౌలింగ్ యాక్షన్‌పై సందేహాలు వ్యక్తమైతే ఈ టోర్నీలో ఆడనిస్తామని, కానీ బౌలింగ్ చేసేందుకు వీలుండదని పీఎస్ఎల్ నిర్వాహకులు తెలిపారు. వెస్టిండీస్ తరపున ఆరు టెస్టులు 65 వన్డేలు, 48 టి20లు సునిల్ ఆడాడు.

జోరు తగ్గలేదు..

వరుస సిక్సులతో అలరించిన అఫ్రిది



దుబాయ్: పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది వయస్సు పైబడుతున్న జోరు మాత్రం తగ్గట్లేదు.. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో మరోసారి అఫ్రిది తన షాట్లతో అభిమానులకు కనువిందు చేశాడు. మూడేళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ఈ మాజీ క్రికెటర్ ఆ పాత బూమ్ బూమ్ అఫ్రిదిని మరోసారి గుర్తు చేస్తూ.. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో చెలరేగిపోయాడు. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఈ లీగ్‌లో గురువారం పెషావర్ జల్మీ, కరాచీ కింగ్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అఫ్రిది ఏకంగా వరుస నాలుగు బంతుల్లో నాలుగు సిక్సులు బాదాడు.

నివేదిక తర్వాతే షమీపై నిర్ణయం: బిసిసిఐ



న్యూఢిల్లీ : భార్య జహాన్ ఆరోపణలతో చిక్కుల్లో పడ్డ టీమిండియా పేస్ బౌలర్ షమీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2018లో ఆడే విషయంపై బీసీసీఐ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. భారత క్రికెట్ బోర్డుకు చెందిన యాంటీ కరప్షన్ యూనిట్ చీఫ్ నీరజ్‌కుమార్ ఇచ్చే నివేదిక ఆధారంగానే షమీ ఐపీఎల్‌లో ఆడే విషయంపై నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ యాక్టింగ్ ప్రెసిడెంట్ సి.కె.ఖన్నా తెలిపాడు. షమీపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలేమిటో తేల్చాలని బీసీసీఐ పాలక మండలి చీఫ్ వినోద్ రాయ్ ఆదేశించడంతో నీజర్ కుమార్ నేతృత్వంలోని అవినీతి నిరోధక విభాగం విచారణ మొదలుపెట్టంది. బ్రిటన్‌కు చెందిన ఓ వ్యాపారి నుంచి పాకిస్తాన్ మహిళ ద్వారా షమీ డబ్బులు తీసుకున్నాడని షమీ భార్య జహాన్ ఆరోపించటంతో దీనిపై విచారించేందుకు రంగంలోకి దిగిన నీరజ్‌కుమార్ బృందం పలు కోణాల్లో దర్యాప్తు చేస్తోంది. అవినీతి నిరోధక విభాగం వారంలోగా నివేదిక ఇస్తుంది, ఆ నివేదిక వచ్చాకే షమీ క్రికెట్ భవిష్యత్ తేలుతుందని, ఈ విషయంలో బీసీసీఐ పాలక మండలిదే తుది నిర్ణయమని ఖన్నా తెలిపాడు. ఇప్పటికే బీసీసీఐ కాంట్రాక్టు పోగొట్టుకున్న షమీ ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు ఆడాల్సి ఉంది. కోటి రూపాయలు పెట్టి షమిని ఢిల్లీ డేర్‌డెవిల్స్ కొనుక్కుంది.

నేను అమాయకుడ్ని : షమీ

ఇక తన భార్య చేస్తున్న ఆరోపణలపై షమి తీవ్రంగా స్పందించాడు. దీంతో రాజీ మార్గంతో ఈవివాదానికి తెరపడుతుందనుకుంటున్న తరుణంలో మరో మలుపు తిరిగింది. తాను అమాయకుడ్ని అనటానికి పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని తాజాగా షమీ ఎదురుదాడికి దిగాడు. తన భార్యపై న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించాడు. ఇక ఎటువంటి రాజీ ప్రయత్నాలు లేవని తెలిపాడు. పలువురు మహిళలతో సంబంధాలున్నాయని మొదట ఆరోపించిన షమీ భార్య జహాన్ ఆ తర్వాత రోజుకో సంచలన విషయాన్ని బయటపెట్టింది. షమీ అన్న తనపై అత్యాచార యత్నం చేశాడని ఆరోపించటంతో మరింత చిక్కుల్లో పడ్డాడు. అయితే ఈ ఆరోపణలు షమీ కొట్టిపారేశాడు. తనపై అత్యాచారం జరిగిందని చెబుతున్న రోజు తాము ఢిల్లీలో తాజ్ హోటల్‌లో ఉన్నామని, శ్రీలంకతో టెస్ట్ అనంతరం భువనేశ్వర్ ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు హాజరయ్యామని, తర్వాతి రోజు ఉదయం ఢిల్లీ నుంచి వెళ్లిపోయామని షమి తెలిపాడు. ఢిల్లీ నుంచి ఇంటికి వచ్చిన రోజు ఆమె తనపై అత్యాచారం జరిగిందని చెబుతోందని, అదంతా అబద్ధమని వివరించాడు.

బీసీసీఐకి ఎఫ్ఐఆర్ కాపీ

మరో వైపు షమీని చిక్కుల్లోకి నెట్టే ప్రయత్నాలు కొనసాగిస్తోంది భార్య జహాన్. కోల్‌కతా పోలీస్ స్టేషన్లో తాను చేసిన ఫిర్యాదులపై నమోదైన ఎఫ్ఐఆర్ కాపీలను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుకు పంపింది. కోల్‌కతా పోలీస్ స్టేషన్లో షమీపై నమోదైన ఎఫ్ఐఆర్ కాపీని బీసీసీఐ సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్‌కు పంపామని జహాన్ తరపు న్యాయవాది హుస్సేన్ తెలిపాడు. ఇప్పటికే బీసీసీఐ కాంట్రాక్టు పోగొట్టుకున్న షమీ ఐపీఎల్‌లో ఆడటమూ సందేహంగా మారింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.